




ESTD: 1999
www.voodayam.com

# వుదయం

కరీంనగర్ | 13-06-2026 శనివారం | సంపుటి : 14 | సంచిక :177 | SINCE 25 YEARS CIRCULATED TELUGU DAILY | రూ. 4.00 | పేజీలు : 12 | VOODAYAM Telugu DAily

Simultaneously Published from Karimnagar, Hyderabad, Adilabad, Khammam, Guntur & Warangal
Follow us on







# తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెట్టారు

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- ఓట్ల చోరీ నుంచి సీట్ల చోరీకి దిగారు
- రాష్ట్ర హక్కుల కోసం బీజేపీ ఎంపీలు ఎందుకు రాజీనామా చేయరు?
- హిట్లర్ నాకు ఆదర్శమని ఎప్పుడూ చెప్పలేదు



**న్యూఢిల్లీ , జూన్ 12 (ఎంఎస్) :**

తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వ్యవహారంలో రిటర్నింగ్ అధికారి (ఆర్‌ఓ) వ్యవహరించిన తీరుపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. సదరు అధికారి ఎన్నికల నియమావళిని పక్కనబెట్టి, బీజేపీ కార్యకర్తలా వ్యవహరించారని మండిపడ్డారు. ఢిల్లీలో శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఉత్తర కొరియా తరహాలో బీజేపీ పోకడలు

దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థలను బీజేపీ ఖూనీ చేస్తోందని రేవంత్‌రెడ్డి ఆరోపించారు. బీజేపీ నేతలు ఉత్తర కొరియా అధ్యక్షుడు కిమ్ జోంగ్ ఉన్‌ను ఆదర్శంగా తీసుకుని ప్రవర్తిస్తున్నారని విమర్శించారు. "ఉత్తర కొరియాలోనూ ఎన్నికలు జరుగుతాయి.. కానీ ఫలితాలు మాత్రం కిమ్ జోంగ్ ఉన్ ముందే డిసైడ్ చేసినట్లు వస్తాయి. ప్రస్తుత దేశ పరిస్థితులు కూడా అలాగే తయారయ్యాయి" అని వ్యాఖ్యా మధ్యప్రదేశ్‌లో తగిన సంఖ్యాబలం లేకటికీ రాజ్యసభ స్థానానికి మూడో పోటీకి నిలబెట్టడాన్ని ఆయన గతంలో ఓట్ల చోరీకి పాల్పడిన ఇప్పుడు ఏకంగా సీట్ల చోరీకి రలేపిందని దుయ్యబట్టారు.

కిషన్‌రెడ్డిపై ధ్వజం.. కేటీఆర్‌తో ముడిపెడుతూ వ్యాఖ్యలు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా పనిచేస్తున్నారని సీఎం ఆరోపించారు. "పోలవరం ప్రాజెక్టు కోసం తెలంగాణలోని ఏడు మండలాలను ఏపీలో కలిపినప్పుడు లేని అభ్యంతరం.. మహారాష్ట్ర నుంచి తెలంగాణకు రావాల్సిన 1500 ఎకరాల భూమిని సాధించడంలో ఎందుకు చూపడం లేదు?" అని ప్రశ్నించారు. రాష్ట్ర హక్కుల కోసం మహారాష్ట్రను ఒప్పించే వరకు క్యాబినెట్ సమావేశాన్ని బహిష్కరిస్తానని కిషన్‌రెడ్డి, పదవులకు రాజీనామా చేస్తామని బీజేపీ ఎంపీలు ఎందుకు ఒత్తిడి తీసుకురావడం లేదని నిలదీశారు. రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) నిర్మాణాన్ని కూడా కిషన్‌రెడ్డి అడ్డుకుంటున్నారని, బీఆర్ఎస్ నేత కేటీఆర్ స్క్రిప్ట్ ప్రకారమే కిషన్‌రెడ్డి డ్రామాలు ఆడుతున్నారని సీఎం ఎద్దేవా చేశారు.

పవన్ సభకు అనుమతి నిరాకరణపై వివరణ

ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సభకు హైదరాబాద్‌లో అనుమతి నిరాకరించిన అంశంపై ముఖ్యమంత్రి స్పందించారు. తెలంగాణలో పర్యటించేందుకు, పోటీ చేసేందుకు పవన్‌కు పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. అయితే శాంతిభద్రతల సమస్య తలెత్తే అవకాశం ఉందన్న నివేదికల వల్లే సభకు అనుమతి ఇవ్వలేదని స్పష్టం చేశారు. గతంలో ఏపీలో జగన్ ప్రభుత్వ హయాంలో పవన్ సభలకు ఎన్నోసార్లు అనుమతి నిరాకరించిన విషయాన్ని గుర్తు చేస్తూ.. అప్పుడు ఎందుకు అనుమతి ఇవ్వలేదో పవన్ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజావ్యతిరేక వ్యాఖ్యలు చేసినందు వల్లే తమ మంత్రులు పవన్‌పై స్పందించాల్సి వచ్చిందన్నారు.

హిట్లర్ వ్యాఖ్యలపై స్పష్టత తనకు హిట్లర్ ఆదర్శమంటూ వస్తున్న ప్రచారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. "హిట్లర్ నాకు ఆదర్శమని నేనెప్పుడూ చెప్పలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఉన్నవారెవరైనా హిట్లర్‌ను ఆదర్శంగా తీసుకుంటారా?" అని ప్రశ్నించారు. ప్రధాని మోదీతో భేటీపై స్పందిస్తూ.. ఆయనే స్వయంగా తనను కౌగిలించుకున్నారని, తాను వెళ్లలేదని స్పష్టం చేశారు. కాగా, తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై అధిష్ఠానంతో ఎలాంటి చర్చా జరగలేదని రేవంత్‌రెడ్డి తేల్చిచెప్పారు.

# అహ్మదాబాద్ విమాన ప్రమాదానికి ఏడాది

## కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు

**న్యూఢిల్లీ:**

దేశవ్యాప్తంగా తీవ్ర దిగ్భ్రాంతిని రేకెత్తించిన అహ్మదాబాద్ ఎయిరిండియా విమాన దుర్ఘటన జరిగి నేటికి ఏడాది పూర్తయింది. ఈ నేపథ్యంలో కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు దిల్లీలో స్పందించారు. ఈ ఘోర ప్రమాదంపై జాతీయ, అంతర్జాతీయ నిబంధనలకు అనుగుణంగా అత్యంత నిష్పక్షపాతంగా దర్యాప్తు కొనసాగుతోందని ఆయన స్పష్టం చేశారు. ప్రమాదంలో మృతి చెందినవారి కుటుంబాలకు ఈ సందర్భంగా ఆయన తన ఘన నివాళులు అర్పించి, సానుభూతిని ప్రకటించారు. దుర్ఘటనకు గల అసలు కారణాలను సమగ్రంగా నిర్ధరించడానికి 'ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో' రాత్రింబవళ్లు కృషి చేస్తోందని మంత్రి తెలిపారు. ప్రమాదంపై త్వరలోనే తుది నివేదిక అందుతుందని, ఆ నివేదిక ఆధారంగా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దేశంలో విమానయాన భద్రతను మరింత మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం సంపూర్ణంగా కట్టుబడి ఉందన్నారు. ఈ సున్నితమైన దుర్ఘటనకు సంబంధించి సామాజిక మాధ్యమాల్లో ఎలాంటి తప్పుడు ప్రచారాలు, వదంతులు సృష్టించవద్దని ఆయన విజ్ఞప్తి చేశారు.

దర్యాప్తులో గణనీయ పురోగతి: ఏఏఐబీ

మరోవైపు ఈ ప్రమాదంపై విచారణ జరుపుతున్న ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో దర్యాప్తు పురోగతిపై కీలక ప్రకటన విడుదల చేసింది. అంతర్జాతీయ సమీక్షలు, సాంకేతిక సంప్రదింపు ప్రక్రియలు ముగిసిన వెంటనే విమాన ప్రమాద తుది నివేదికను బహిర్గతం చేస్తామని వెల్లడించింది. ప్రమాదానికి గల సాంకేతిక లోపాలను గుర్తించేందుకు ఫ్లైట్ రికార్డర్ (బ్లాక్ బాక్స్) డేటా, కూలిపోయిన విమాన ఇంజిన్ భాగాలు, ఇతర కీలక ఆధారాలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నట్లు పేర్కొంది. ఇప్పటివరకు జరిపిన విచారణలో గణనీయమైన పురోగతి సాధించామని, లభ్యమైన ఆధారాలను తుది నిర్ధారణకు తెచ్చేందుకు ప్రయోగశాలల్లో పరీక్షలు నిర్వహిస్తున్నామని ఏఏఐబీ స్పష్టం చేసింది.



దేశాన్ని కుదిపేసిన విషాదం..

గతేడాది అహ్మదాబాద్ విమానాశ్రయం నుంచి టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఎయిరిండియా విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ దారుణ ఘటనలో విమానంలో ప్రయాణిస్తున్న 241 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆశ్చర్యకరంగా ఈ ప్రమాదం నుంచి 'విశ్వాస్ కుమార్' అనే ప్రయాణికుడు ఒక్కడే ప్రాణాలతో బయటపడ్డారు. అయితే, నియంత్రణ కోల్పోయిన విమానం సమీపంలోని ఒక హాస్టల్ భవనంపై కూలడంతో, అక్కడివారితో కలిపి మొత్తం మృతుల సంఖ్య 260కి చేరింది. కాగా, మృతుల కుటుంబాలకు ఇప్పటికే టాటా గ్రూప్ యాజమాన్యం తగిన నష్టపరిహారాన్ని చెల్లించింది. ఈ పెను ప్రమాదంపై ప్రస్తుతం సమగ్ర దర్యాప్తు తుది దశకు చేరుకుంది.

# హైడ్రా ఒక బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థ



### వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్‌ది మూడో స్థానమే

### కాంగ్రెస్‌లోని ఆ 'బ్లాక్ షీప్' ఎవరో రాహుల్ గాంధీ తేల్చాలి

### ఎయిర్‌పోర్ట్ మెట్రో రద్దుతోనే నగరానికి ఈ దుస్థితి

### డీలిమిటేషన్‌లో దక్షిణాది వాటా తగ్గిస్తే ఊరుకోం

**హైదరాబాద్ జూన్ 12 (వుదయం) :**

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో తనకు ఎలాంటి వ్యక్తిగత పంచాయితీ లేదని, అయితే ఆయన ప్రభుత్వాన్ని నడుపుతున్న విధానం మాత్రం తనతో పాటు రాష్ట్రంలోని మెజారిటీ ప్రజలకు నచ్చడం లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శనివారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో ఆయన కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మున్సిపల్ శాఖ సీఎం పరిధిలోనే ఉందని గుర్తు చేసిన కేటీఆర్.. నగరంలో స్వల్ప వర్షానికే ప్రజలు ఇబ్బంది పడితే ఆ బాధ్యత ఎవరిదని ప్రశ్నించారు. "గతంలో యాభై ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. హైదరాబాద్‌ను ఏమైనా అద్దంలా చేసి మాకు అప్పగించిందా? మేము చెడగొట్టడానికి?" అంటూ ఎద్దేవా చేశారు.

**హైడ్రా పేరుతో బ్లాక్‌మెయిలింగ్!**

బీఆర్ఎస్ హయాంలో వ్యూహాత్మక నాలాల అభివృద్ధి కార్యక్రమం (ఎస్ఎన్‌డీపీ) చేపట్టి నగరంలో వరద ముంపు సమస్యను మెరుగుపరిస్తే.. రేవంత్‌రెడ్డి అధికారంలోకి రాగానే దాన్ని రద్దు చేశారని కేటీఆర్ ఆరోపించారు. నగరంలో నీళ్లు నిలవకపోతే ఆ క్రెడిట్ తమ ఖాతాలో వేసుకునే కాంగ్రెస్ నేతలు, నీరు నిలిస్తే మాత్రం బీఆర్ఎస్‌దే బాధ్యత అనడం హాస్యాస్పదమన్నారు. ఉన్న నగరంపై సీఎంకు కనీస అవగాహన లేదు కానీ, 'ఫ్యూచర్ సిటీ' అంటూ ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి రాగానే ఎయిర్‌పోర్టు మెట్రోను రద్దు చేశారని, ఒకవేళ బీఆర్ఎస్ అధికారంలో ఉండి ఉంటే ఈ పాటికే ఆ లైన్ పూర్తయి ట్రాఫిక్ సమస్యలు తగ్గేవన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు దాటినా, ఎల్ అండ్ టీ నుంచి మెట్రో ప్రాజెక్టును లాక్కోవడం తప్ప చేసిందేమీ లేదని మండిపడ్డారు. చివరికి 'హైడ్రా'కు అపరిమిత అధికారాలు ఇచ్చి, దాన్ని ఒక బ్లాక్‌మెయిలింగ్ వ్యవస్థగా మార్చేశారని ధ్వజమెత్తారు.

**జారుడుబండపై కాంగ్రెస్.. త్వరలో కేసీఆర్ బస్సు యాత్ర**

త్వరలోనే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ బస్సు యాత్ర ఉంటుందని, దానికి సంబంధించిన షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని కేటీఆర్ వెల్లడించారు. పార్టీ సభ్యత్వ నమోదు, శిక్షణా కార్యక్రమాలకు సంబంధించి ఇప్పటికే 60 నియోజకవర్గాల్లో సమావేశాలు పూర్తయ్యాయని, వచ్చే నెలలో విస్తృతంగా సభ్యత్వ నమోదు చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మూడో స్థానానికి పడిపోతుందని, భవిష్యత్తులో బీఆర్ఎస్‌కు బీజేపీతోనే ప్రధాన పోటీ ఉంటుందని జోస్యం చెప్పారు. తెలంగాణ సిద్ధించిన తర్వాత బీఆర్ఎస్ ఎవరితోనూ పొత్తులు పెట్టుకోలేదని, ముమ్ముందు కూడా ఒంటరిగానే పోరాడుతుందని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం జారుడుబండపై ఉందని, అది కిందికి జారడమే తప్ప పైకి లేవడం సాధ్యం కాదన్నారు. కాగా, మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ వెనుక తెలంగాణ కాంగ్రెస్ నేతలే సమాచారం ఇచ్చారని మహారాష్ట్ర మంత్రి చెప్పిన విషయాన్ని గుర్తు చేస్తూ.. కాంగ్రెస్‌లోని ఆ 'బ్లాక్ షీప్' ఎవరో రాహుల్ గాంధీ తేల్చాలని డిమాండ్ చేశారు.

**దక్షిణాది వాటా తగ్గిస్తే ఊరుకోం: డీలిమిటేషన్‌పై హెచ్చరిక**

వచ్చే నెలలో కేంద్ర ప్రభుత్వం మళ్లీ నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) బిల్లు తీసుకురాబోతుందనే సమాచారం తమకుందని కేటీఆర్ తెలిపారు. దేశం మొత్తం మీద కాకపోయినా, తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీల్లో నియోజకవర్గాల సంఖ్యను ఖచ్చితంగా పెంచాలని డిమాండ్ చేశారు. "జమిలి ఎన్నికల విషయంలో ఏం జరుగుతుందో వేచి చూడాలి. అయితే డీలిమిటేషన్ ప్రక్రియలో పార్లమెంట్‌లో దక్షిణాది రాష్ట్రాలకు ఉన్న 24 శాతం సీట్ల వాటాను తగ్గిస్తే మాత్రం ఊరుకునే ప్రసక్తే లేదు. జనాభా నియంత్రణతో పాటు అన్ని రంగాల్లో మంచి పనితీరు కనబరిచినందుకు దక్షిణాదిని శిక్షిస్తామంటే ఒప్పుకోం. దేశాభివృద్ధికి దోహదపడే రాష్ట్రాలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ గట్టిగా ఎదురుతిరుగుతుంది" అని కేటీఆర్ హెచ్చరించారు.

# భారత నౌకలపై దాడులు

**వాషింగ్టన్ :**

ఇరాన్ ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై ఇటీవల దాడులు జరగడాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఖండించారు. ఇరాన్ ఆ దాడులకు పాల్పడిందని ఆరోపించిన ఆయన.. అమెరికా బలగాలే వాటిని అడ్డుకున్నాయని చెప్పారు. భారత నౌకలపై దాడులు ఏమాత్రం సమర్థనీయం కాదంటూ ట్రూత్ సోషల్ వేదికగా పోస్టు పెట్టారు. మరోవైపు, అమెరికాతో ఒప్పందం కుదిరిందని ఇరాన్ తప్పుడు ప్రచారం చేస్తోందని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ నేతలకు నిజాయతీ లేదని, వాళ్లతో మంచి ఒప్పందం కష్టమేనన్నారు. ఆ దేశం వైఖరి మార్చుకోవాలని హెచ్చరించారు. ఇదిలాఉంటే, ఒమన్ తీరంలో భారతీయులున్న నౌకలపై గత నాలుగు రోజుల్లో మూడు సార్లు దాడులు జరగ్గా.. ముగ్గురు భారతీయులు ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే.

## విశాఖ వాసి మృతి



**అమరావతి :**

ఇటీవల ఒమన్ తీరంలో ఆయిల్ ట్యాంకర్ నౌకపై అమెరికా చేసిన మిసైల్ దాడిలో విశాఖ పట్నం శ్రీవారిపురానికి చెందిన సురేష్ పట్నాల మృతి చెందారు. ఈ దాడిలో ముగ్గురు భారతీయులు మృతి చెందారు. సురేష్ ప్రయాణిస్తున్న నౌక ప్రస్తుతం ఒమన్ తీరానికి 35 వాటికన్ మైళ్ల దూరంలో నిలిచిపోయింది. ఒమన్ అధికారులు రాత్రి నౌకను తీరానికి తీసుకు వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

# టెక్ కంపెనీలకు మళ్లీ వీసా సెగ

**వాషింగ్టన్:**

విదేశీ నిపుణులు ఆశ్రయించే ప్రతిష్ఠాత్మక హెచ్1బీ వీసా ఫీజుల పెంపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అస్సలు వెనక్కి తగ్గడం లేదు. వీసా ఫీజును ఏకంగా ఒక లక్ష డాలర్లకు పెంచుతూ ట్రంప్ యంత్రాంగం తీసుకున్న వివాదాస్పద నిర్ణయాన్ని అమెరికాలోని బోస్టన్ ఫెడరల్ కోర్టు ఇటీవల కొట్టివేసిన సంగతి తెలిసిందే. అయితే, ఈ న్యాయస్థాన తీర్పును సవాల్ చేస్తూ ఉన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు అమెరికా న్యాయశాఖ వేగంగా అడుగులు వేస్తోంది. హెచ్1బీ వీసా ఫీజును భారీగా పెంచుతూ గతేడాది సెప్టెంబరులో ట్రంప్ సర్కార్ తీసుకొన్న నిర్ణయం ప్రపంచవ్యాప్తంగా, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగంలో సంచలనం సృష్టించింది. ఈ అహేతుక పెంపును యూఎస్ ఛాంబర్ ఆఫ్ కామర్స్‌తో పాటు డెమోక్రటిక్ పార్టీ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాలు న్యాయస్థానాలలో సవాల్ చేశాయి. ఈ పిటిషన్లపై విచారణ జరిపిన బోస్టన్ ఫెడరల్ కోర్టు.. ట్రంప్ యంత్రాంగం నిర్ణయం చట్టవిరుద్ధమైనదని ప్రకటిస్తూ గతంలో తీర్పునిచ్చింది. ఈ తీర్పుతో అంతర్జాతీయ టెక్ కంపెనీలకు, భారతీయ ఐటీ నిపుణులకు పెద్ద ఊరట లభించింది. న్యాయపోరాటానికి సిద్ధమైన వైట్‌హౌస్ ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలుకు వెళ్లేందుకు అనుమతించాలని కోరుతూ అమెరికా న్యాయశాఖ తాజాగా న్యాయస్థానంలో నోటీసు దాఖలు చేసింది. ట్రంప్ యంత్రాంగం తీసుకున్న ఈ తాజా చర్యతో వీసా ఫీజుల వివాదం మరికొన్ని నెలల పాటు కోర్టుల పరిధిలోనే నలిగే అవకాశం కనిపిస్తోంది. ఫలితంగా, కోర్టు తీర్పుతో లభించిన ఫీజు భారం మినహాయింపు శాశ్వతం కాదనే ఆందోళన కంపెనీల్లో మళ్లీ మొదలైంది. ఈ సుదీర్ఘ న్యాయపోరాటం కారణంగా అమెరికాలో కార్యకలాపాలు సాగిస్తున్న ఐటీ దిగ్గజాలకు తాత్కాలికంగా ఊరట లభించినప్పటికీ, భవిష్యత్తుపై అనిశ్చితి మాత్రం కొనసాగుతోంది.






# అమెరికా రక్షణ ఉపసంహరణ వ్యూహం మిత్రదేశాల తీరుపై ట్రంప్ అసంతృప్తి

- యుద్ధవిమానాలు, నౌకల ఉపసంహరణకు శ్వేతసౌధం సిద్ధం
- అంతర్జాతీయ మీడియా కథనాలతో ఉలిక్కిపడ్డ నాటో కూటమి

**వాషింగ్టన్ :**

ఇరాన్ వివాదంలో తనకు సహకరించేందుకు ముందుకురాని ఐరోపా దేశాల పట్ల కఠినంగా వ్యవహరించేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతోంది. నాటో రక్షణ కూటమికి తాము అందిస్తోన్న సైనిక సహాయాన్ని భారీగా కత్తిరించేందుకు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐరోపాలో నాటో భద్రతా కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచిన యుద్ధవిమానాలు, యుద్ధనౌకలను గణనీయంగా తగ్గించాలని అమెరికా యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఒకవేళ వాషింగ్టన్ గనుక ఈ వ్యూహాన్ని అమలు చేస్తే.. సుదూర ప్రాంతాలపై దాడులు చేయడం, వైమానిక నిఘా వంటి కీలక అంశాల్లో నాటో సామర్థ్యాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారీగా తగ్గనున్న యుద్ధ విమానాలు, నౌకల సంఖ్య!

మీడియా కథనాల ప్రకారం.. అమెరికా తన రక్షణ కోత ప్రణాళికలో భాగంగా ఐరోపాలో మోహరించిన ఎఫ్16, ఎఫ్15E ఫైటర్ జెట్ల సంఖ్యను 150 నుంచి 100కు కుదించే అవకాశం ఉంది. అలాగే, సముద్ర నిఘా విమానాల సంఖ్యను కూడా 26 నుంచి 15కు తగ్గించనున్నట్లు సమాచారం. వీటితో పాటు గాల్లోనే ఇంధనాన్ని నింపే ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను ఐరోపా నుంచి పూర్తిగా ఉపసంహరించుకోనున్నట్లు తెలుస్తోంది. నాటో రక్షణలో కీలకమైన జలాంతర్గాములు, విమాన వాహక నౌకలతో (ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్స్) సహా పలు నౌకలను ఐరోపా నుంచి ఇతర వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించాలని వైట్‌హౌస్ లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో మిత్రదేశాల రక్షణ కోసం కేటాయించిన రెండు బాంబర్ గ్రూపుల్లో ఒకదాని స్థానాన్ని కూడా మార్చాలని అమెరికా భావిస్తోంది. అయితే, ఈ వార్తలపై అటు అమెరికా రక్షణశాఖ (పెంటగాన్) గానీ, ఇటు నాటో ప్రధాన కార్యాలయం గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.



'హర్మూజ్' వివాదమే కారణమా?

వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని ఇరాన్ నిర్బంధం నుంచి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ఐరోపా మిత్రదేశాలకు విజ్ఞప్తి చేశారు. అయితే ట్రంప్ పిలుపును ఐరోపా దేశాలు పెద్దగా పట్టించుకోకపోవడంతో ఆయన తీవ్ర ఆగ్రహానికి గురైనట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే నాటో కూటమి కేవలం ఒక "కాగితపు పులి" అంటూ ట్రంప్ గతంలో తీవ్ర వ్యాఖ్యలు చేశారు. అవసరమైతే నాటో కూటమి నుంచి అమెరికా పూర్తిగా వైదొలిగే యోచనలో ఉందంటూ పలు మార్లు హెచ్చరికలు కూడా జారీ చేశారు.

# భారత్ శత్రుదేశాలకు దశాబ్దాలుగా ఆయుధాల సరఫరా

**న్యూఢిల్లీ :**

ఇరాన్ వివాదంలో తనకు సహకరించేందుకు ముందుకురాని ఐరోపా దేశాల పట్ల కఠినంగా వ్యవహరించేందుకు అగ్రరాజ్యం అమెరికా సిద్ధమవుతోంది. నాటో రక్షణ కూటమికి తాము అందిస్తోన్న సైనిక సహాయాన్ని భారీగా కత్తిరించేందుకు డొనాల్డ్ ట్రంప్ యంత్రాంగం సరికొత్త ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఐరోపాలో నాటో భద్రతా కార్యకలాపాల కోసం అందుబాటులో ఉంచిన యుద్ధవిమానాలు, యుద్ధనౌకలను గణనీయంగా తగ్గించాలని అమెరికా యోచిస్తున్నట్లు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. ఒకవేళ వాషింగ్టన్ గనుక ఈ వ్యూహాన్ని అమలు చేస్తే.. సుదూర ప్రాంతాలపై దాడులు చేయడం, వైమానిక నిఘా వంటి కీలక అంశాల్లో నాటో సామర్థ్యాలు తీవ్రంగా దెబ్బతినే ప్రమాదముందని రక్షణ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

భారీగా తగ్గనున్న యుద్ధ విమానాలు, నౌకల సంఖ్య!

మీడియా కథనాల ప్రకారం.. అమెరికా తన రక్షణ కోత ప్రణాళికలో భాగంగా ఐరోపాలో మోహరించిన ఎఫ్16, ఎఫ్15E ఫైటర్ జెట్ల సంఖ్యను 150 నుంచి 100కు కుదించే అవకాశం ఉంది. అలాగే, సముద్ర నిఘా విమానాల సంఖ్యను కూడా 26 నుంచి 15కు తగ్గించనున్నట్లు సమాచారం. వీటితో పాటు గాల్లోనే ఇంధనాన్ని నింపే ఎనిమిది రీఫ్యూయెలింగ్ ట్యాంకర్ విమానాలను ఐరోపా నుంచి పూర్తిగా ఉపసంహరించుకోనున్నట్లు తెలుస్తోంది. నాటో రక్షణలో కీలకమైన జలంతర్గాములు, విమాన వాహక నౌకలతో (ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్స్) సహా పలు నౌకలను ఐరోపా నుంచి ఇతర వ్యూహాత్మక ప్రాంతాలకు తరలించాలని వైట్‌హౌస్ లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో మిత్రదేశాల రక్షణ కోసం కేటాయించిన రెండు బాంబర్ గ్రూపుల్లో ఒకదాని స్థానాన్ని కూడా మార్చాలని అమెరికా భావిస్తోంది. అయితే, ఈ వార్తలపై అటు అమెరికా రక్షణశాఖ (పెంటగాన్) గానీ, ఇటు నాటో ప్రధాన కార్యాలయం గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు.



'హర్మూజ్' వివాదమే కారణమా?

వ్యూహాత్మక హర్మూజ్ జలసంధిని ఇరాన్ నిర్బంధం నుంచి తెరిపించేందుకు తమతో కలిసి రావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ఐరోపా మిత్రదేశాలకు విజ్ఞప్తి చేశారు.

# చదువు పేరుతో వ్యాపారం!

**- గుర్తింపు లేని బడుల వలలో అమాయక తల్లిదండ్రులు**
**- ఆర్భాటపు ప్రకటనలతో ఆకర్షణ... పిల్లల భవిష్యత్తుతో చెలగాటం**

**గద్వాల జూన్ 13 (వుదయం బ్యూరో)**




పాఠశాల ఎంపికలో అప్రమత్తతే రక్షణ" మీ పిల్లల భవిష్యత్తుకు మా పాఠశాలే భరోసా", "అంతర్జాతీయ స్థాయి విద్య", "100 శాతం ఫలితాలు" అంటూ రంగు రంగుల ప్రకటనలతో ఆకర్షిస్తున్న అనేక విద్యాసంస్థల అసలు రూపం మాత్రం భిన్నంగా ఉంటోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. విద్య సేవగా కాకుండా వ్యాపారంగా మారుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులు అప్రమత్తంగా లేకపోతే పిల్లల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశాలు లేకపోలేదు. పుట్టగొడుగుల్లా బడులు... నిబంధనలు గాలికే! ప్రభుత్వ గుర్తింపు లేకుండానే కొన్ని ప్రైవేటు పాఠశాలలు కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఆకర్షణీయమైన భవనాలు, భారీ ప్రచారాలు, తక్కువ ఫీజుల ఎర చూపిస్తూ విద్యార్థులను చేర్చుకుంటున్న సంస్థలపై పర్యవేక్షణ అవసరమనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గుర్తింపు లేని పాఠశాలల్లో చదివే విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.ఒకే గదిలో మూడు తరగతులు... ఒకే గురువుతో బోధన! కొన్ని విద్యాసంస్థల్లో ఒకే గదిలో రెండు మూడు తరగతుల విద్యార్థులను కూర్చోబెట్టి ఒకే ఉపాధ్యాయుడితో బోధన కొనసాగిస్తున్న పరిస్థితులు ఉన్నట్లు తెలుస్తోంది. విద్యార్థుల సంఖ్యకు తగ్గట్టుగా ఉపాధ్యాయులను నియమించకపోవడం వల్ల బోధన నాణ్యత దెబ్బతింటోందన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. పిల్లల వ్యక్తిగత అభ్యాసంపై దృష్టి సారించే పరిస్థితులు లేకపోవడం విద్యా ప్రమాణాలపై ప్రభావం చూపుతోంది.అర్హతలేని ఉపాధ్యాయులతో పాఠాలు?తక్కువ వేతనాల కోసం తగిన అర్హతలు లేని వ్యక్తులను ఉపాధ్యాయులుగా నియమిస్తున్నారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. బీఈడ్, డీఈడ్ వంటి శిక్షణ లేకుండా విద్యాబోధన జరగడం వల్ల విద్యార్థుల అభ్యాస స్థాయి దెబ్బతింటోందని నిపుణులు పేర్కొంటున్నారు. పిల్లల మానసిక వికాసాన్ని అర్థం చేసుకుని బోధించే నైపుణ్యం కలిగిన ఉపాధ్యాయులే నాణ్యమైన విద్యకు మూలస్తంభమని చెబుతున్నారు. మౌలిక వసతుల్లేని విద్యాలయాలు పరిశుభ్రమైన తరగతి గదులు, తాగునీరు, బాలబాలికలకు ప్రత్యేక మరుగుదొడ్లు, గ్రంథాలయం, ప్రయోగశాల, ఆటస్థలం వంటి కనీస సదుపాయాలు కూడా లేని పాఠశాలలు ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో విద్యార్థుల ఆరోగ్యం, భద్రత, విద్యా ప్రగతి ప్రశ్నార్థకంగా మారుతోందని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తల్లిదండ్రులు తప్పక తెలుసుకోవాల్సిన విషయాలుపాఠశాలకు ప్రభుత్వ గుర్తింపు ఉందో లేదో నిర్ధారించుకోండి. ఉపాధ్యాయుల అర్హతలు, అనుభవం గురించి తెలుసుకోండి.తరగతి గదులు, మరుగుదొడ్లు, తాగునీరు వంటి సౌకర్యాలు పరిశీలించండి.గ్రంథాలయం, ప్రయోగశాల, ఆటస్థలం ఉన్నాయో చూడండి. విద్యార్థుల సంఖ్యకు సరిపడా ఉపాధ్యాయులు ఉన్నారా తెలుసుకోండి.ప్రచార ఆర్భాటాలకు కాకుండా విద్యా నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వండి.పిల్లల భవిష్యత్తు విషయంలో రాజీ వద్దు!పాఠశాల ఎంపిక అనేది కేవలం అడ్మిషన్ ప్రక్రియ కాదు... పిల్లల భవిష్యత్తును నిర్ణయించే కీలక ఘట్టం. ఆకర్షణీయమైన ప్రకటనలు, భారీ భవనాలు, తక్కువ ఫీజుల మాయలో పడకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే నిర్ణయం తీసుకోవాలి. ఎందుకంటే నేడు ఎంచుకునే పాఠశాలే రేపటి పౌరుడి వ్యక్తిత్వాన్ని, భవిష్యత్తును తీర్చిదిద్దుతుంది.

# చెంచు గిరిజనుల అభివృద్ధికి సమన్వయంతో పని చేయాలి



**- విద్య, వైద్యం, తాగునీరు, ఉపాధిపై ప్రత్యేక దృష్టి**
**- జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్**

**నాగర్ కర్నూల్ జూన్ 12 (వుదయం బ్యూరో)**

జిల్లాలోని ఐటీడీఏ మన్ననూరు ప్రాజెక్టు పరిధిలో చెంచు గిరిజనుల జీవన ప్రమాణాల మెరుగుదల కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్ ఆదేశించారు.శుక్రవారం మన్ననూర్ ఐటీడీఏ కార్యాలయంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలపై ఆయన సమగ్ర సమీక్ష నిర్వహించారు. చెంచు కుటుంబాలకు విద్య, ఆరోగ్యం, తాగునీరు, పోషకాహారం, విద్యుత్, ఉపాధి వంటి ప్రాథమిక సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందేలా క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్య, వైద్యానికి ప్రాధాన్యం చెంచు పెంటర్లలోని పిల్లలందరూ పాఠశాలలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, డ్రాప్‌అవుట్‌ల నివారణ, వసతి గృహాల నిర్వహణ, మధ్యాహ్న భోజన పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. ఉన్నత విద్యకు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపట్టాలన్నారు.గిరిజన ప్రాంతాల్లో గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు టీకాలు, పోషకాహారం, వైద్య సేవలు క్రమం తప్పకుండా అందేలా చూడాలని, ప్రతి పెంటకు ఆరోగ్య సిబ్బంది క్రమం తప్పకుండా వెళ్లి సేవలందించాలని వైద్య అధికారులకు సూచించారు.తాగునీరు, ఉపాధి కల్పన చెంచు పెంటర్లలో తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని, పనిచేయని బోర్లు, పైపులైన్లను వెంటనే మరమ్మతు చేయాలని ఆదేశించారు. అవసరమైన చోట సోలార్ పంప్ సెట్లు ఏర్పాటు చేయాలన్నారు.చెంచు యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు విస్తృతంగా అమలు చేసి, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. లైవ్లీహుడ్ కార్యక్రమాలు, ఇందిరా సౌర గిరిజన విద్యుత్ పథకం అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.రేషన్ కార్డు, ఆధార్ సమస్యల పరిష్కారం కోసం మొబైల్ నెట్‌వర్క్ అందుబాటులో ఉన్న పెంటల్లో ప్రత్యేక సేవా కేంద్రాలు, నెట్‌వర్క్ లేని ప్రాంతాల్లో తాత్కాలిక కేంద్రాలు ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, ఐటీడీఏ ప్రాజెక్టు మేనేజర్ జాఫర్ హుస్సేన్, వివిధ శాఖల జిల్లా, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# ఉచిత విద్య, నాణ్యమైన బోధన, ఉజ్వల భవిష్యత్తు



**- పీఎం శ్రీ బాలుర ఉన్నత పాఠశాలలో చేరాలని ఉపాధ్యాయుల ఇంటింటి ప్రచారం**

**నాగర్ కర్నూల్ జూన్ 12 (వుదయం బ్యూరో)**

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపు, వంద శాతం ప్రవేశాలే పీఎం శ్రీ జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆధ్వర్యంలో బడిబాట ఆఖరి రోజు ఇంటింటి ప్రచారం నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు జి. లత నేతృత్వంలోని ఉపాధ్యాయ బృందం స్థానిక కాలనీల్లో పర్యటించి, 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఇంగ్లీష్ మీడియం ప్రవేశాలు ప్రారంభమైనట్లు కరపత్రాలు, బ్యానర్లతో వివరించారు. బడి బయట పిల్లలను గుర్తించి పాఠశాలలో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు.
గడిచిన విద్యా సంవత్సరం 10వ తరగతిలో విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచారని ఉపాధ్యాయులు తెలిపారు. గరిష్టంగా 549 మార్కులు సాధించగా, పలువురు 500 పైచిలుకు మార్కులతో అత్యుత్తమ ర్యాంకులు పొందారని కరపత్రాల ద్వారా ప్రజలకు చూపించారు.ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు లత మాట్లాడుతూ, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే బోధన, డిజిటల్ తరగతులు, కంప్యూటర్, సైన్స్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయన్నారు. ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, రెండు జతల యూనిఫాం, రాగిజావ, కోడిగుడ్లతో కూడిన మధ్యాహ్న భోజనం, NCC, స్కౌట్ & గైడ్, కరాటే, యోగా, క్రీడల్లో ప్రత్యేక శిక్షణ, NTSE, NMMS కోచింగ్ అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో 17వ వార్డు కౌన్సిలర్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు తిరుపతయ్య, భాగ్యలక్ష్మి, సత్యనారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. తల్లిదండ్రులు ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

# వారాంతపు మార్కెట్ యార్డును సద్వినియోగం చేసుకోవాలి



**పేటలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను పునః ప్రారంభించిన కలెక్టర్**

**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**

వారాంతపు మార్కెట్ యార్డ్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక కోరారు. శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ మార్కెట్ (సమీకృత మార్కెట్) యార్డును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి శుక్రవారం సమీకృత మార్కెట్ యార్డులో వివిధ రకాల సేంద్రీయ కూరగాయలు పండ్లు పూల ఉత్పత్తులు ఆహార ధాన్యాలు మహిళా సంఘాల ఉత్పత్తులు రాగి లడ్డూలు జనపనార సంచులు మట్టి కుండలు మట్టి ఆభరణాలు పచ్చళ్ళు వెదురు ఉత్పత్తులు చేనేత చీరలు హస్తకళ ఉత్పత్తులు కళాకారుల కుమ్మరి ఉత్పత్తులు జనపనార తదితర వస్తువుల స్టాల్స్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ మార్కెట్ ను ప్రారంభించటానికి ముఖ్య ఉద్దేశ్యం నిరుపయోగంగా ఉన్న ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయాన్ని వినియోగంలోకి తీసుకు రావడంతో పాటు జిల్లాలో ప్రకృతి వ్యవసాయం ద్వారా రైతులు పండించిన పంట ఉత్పత్తులను మార్కెటింగ్ చేయడానికి అని తెలిపారు. సేంద్రీయ ఎరువులు తయారీ వాటి ప్రదర్శన అమ్మకాలు స్థానిక ఉత్పత్తులకు ప్రోత్సాహం కల్పించడంతో పాటు ఆన్ లైన్ ద్వారా అమ్మకాలు జరిగేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో తయారు చేసే ఉత్పత్తులు వాటిని ప్రజలు ఆదరించేలా తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. వారం లో ఒక శుక్రవారం ఇక్కడి ఇంటిగ్రేటెడ్ మార్కెట్ సముదాయంలో ఆయా ఉత్పత్తులు అందుబాటులో ఉంటాయని, జిల్లా ప్రజలు వారంతపు మార్కెట్ ను ఉపయోగించుకుని రసాయనాలు లేని ఆహార ఉత్పత్తులు కొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని కలెక్టర్ సూచించారు. మున్సిపాలిటీ కమిషనర్, డిఆర్డిఏ , హార్టికల్చర్, అగ్రికల్చర్ అధికారులు సమన్వయంతో ప్రతి శుక్రవారం ఇక్కడ స్టాల్స్ ఏర్పాటు చేయించి మహిళా స్వయం సహాయక సంఘాలు ఆర్థికంగా బలోపేతం అయ్యేలా ప్రోత్సహించాలని ఆదేశించారు.
ఈ కార్యక్రమంలో డీఆర్డీడీఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, పుర కమీషనర్ శంకర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్ పర్సన్ మంజుల జి. ఆర్. రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, కౌన్సిలర్ భరత్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షు రాలు అరుంధతి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ బండి వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టర్ ను సన్మానించిన కౌన్సిలర్ సత్యమ్మ



**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంకను 8వ వార్డ్ కౌన్సిలర్ కందన్ పల్లి సత్యమ్మ శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. కొత్త బస్టాండ్ సమీపంలోని సుమారు 9 కోట్ల రూపాయల వ్యయంతో 8వ వార్డు అశోక్ నగర్ వీధిలో నిర్మించిన ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని జిల్లా కలెక్టర్ పునః ప్రారంభించి అందుబాటులోకి తెచ్చారు. ఇందుకుగాను అవార్డు కౌన్సిలర్ కందన్ పల్లి సత్తెమ్మ జిల్లా కలెక్టర్ ను శాలువా కప్పి సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. నిర్మాణం పూర్తయినప్పటికీ ఇన్నాళ్లు నిర్వీర్యంగా, ఉపయోగం లేకుండా ఉన్న ఈ భవనాన్ని కాపలా కాస్తూ కాపాడుకున్న వార్డ్ యువత కౌన్సిలర్ కృషిని జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా వార్డ్ కౌన్సిలర్ కు ప్రతి శుక్రవారం ఏర్పాటు చేసే స్టాళ్లను ప్రజలు వచ్చేలా సహకరించమని అప్పుడే ఈ శాలువకు మీరు ఇచ్చిన గౌరవంగా భావిస్తానని అన్నారు. కార్యక్రమంలో వార్డు యువత అధ్యక్షులు సిద్ధం లక్ష్మణ్, గొల్ల లక్ష్మణ్, జరంగ్ రాము, మసి పవన్ , వినోద్, హస్నోదిన్ , 8వ వార్డు యువత పాల్గొన్నారు.

# నర్సాపూర్ బీవీఆర్ఐటీలో వామ్స్-2026 సదస్సు విజయవంతం



**- పరిశ్రమ–అకాడెమియా భాగస్వామ్యంపై రాజీవ్ జ్యోతి కీలక సూచనలు**

**హత్నూర, వుదయం జూన్ 12,**

నర్సాపూర్‌లోని బీవీ రాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (బీవీఆర్ఐటీ)లో జరుగుతున్న 5వ ఐఈఈఈ వైర్లెస్, యాంటెన్నా అండ్ మైక్రోవేవ్ సింపోజియం (వామ్స్ 2026) మూడవ రోజు కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వ అంతరిక్ష మంత్రిత్వ శాఖ సాంకేతిక విభాగం డైరెక్టర్ రాజీవ్ జ్యోతి పరిశ్రమ- విద్యా సంస్థల భాగస్వామ్యంపై నిర్వహించిన ప్రత్యేక ప్యానెల్ చర్చలో పాల్గొని, దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న అంతరిక్ష రంగంలోని అవకాశాలపై వివరించారు.
ఈ సందర్భంగా బీవీఆర్ఐటీ ప్రిన్సిపాల్ డా. సంజయ్ దూబే మాట్లాడుతూ, రాజీవ్ జ్యోతి వంటి ప్రముఖ నిపుణుల నుంచి విద్యార్థులు, అధ్యాపకులు ప్రత్యక్షంగా నేర్చుకునే అవకాశం లభించడం గర్వకారణమన్నారు. సదస్సులో భాగంగా నిర్వహించిన ఐఈఈఈ ఉమెన్ ఇన్ ఇంజనీరింగ్ ప్రత్యేక కార్యక్రమంలో ఇస్రో, సీఎస్ఐఆర్-నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్, అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలకు చెందిన మహిళా శాస్త్రవేత్తలు పాల్గొని తమ అనుభవాలను పంచుకున్నారు.అదనంగా 'ఇండియా సెమీకండక్టర్ మిషన్: పవరింగ్ ది ఫ్యూచర్' అంశంపై వర్క్‌షాప్, యంగ్ ప్రొఫెషనల్స్ సెషన్, స్టార్టప్, ఇండస్ట్రీ, మెంటరింగ్ కార్యక్రమాలు నిర్వహించారు. వామ్స్2026 జనరల్ చైర్ డా. బి.ఆర్. సంజీవ రెడ్డి మాట్లాడుతూ, అకాడెమియా, పరిశ్రమలు, పరిశోధనా సంస్థలు, యువ ఆవిష్కర్తలను ఒకే వేదికపైకి తీసుకువచ్చే ప్రపంచ స్థాయి సదస్సుగా వామ్స్ నిలుస్తోందన్నారు. 18 దేశాలకు చెందిన ప్రతినిధులు, ఐఐటీ, ఎన్ఐటీలు, ప్రముఖ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మినరల్ 'మాయా' జలం.. లీటరల్ గా విషతుల్యం!

*** అయిజలో ప్రాణాంతకంగా మారిన అక్రమ వాటర్ దందా**
*** కెమికల్ కలిపిన బోరు నీరే 'అమృతం' ఐఎస్ఐ లేదు.. 'ఎఫ్ఎస్ఎస్ ఏఐ ఊసే లేదు!**
*** కాసుల కక్కుర్తి కోసం 20 శాతానికి 'టీడీఎస్' కోత.. ఒళ్లు గుల్లవుతున్న వైనం**
*** కళ్లు మూసుకున్న యంత్రాంగం.. అడ్డగోలుగా నంబర్ ప్లేట్లు లేని వాహనాల సంచారం**

**అయిజ జూన్ 13 (వుదయం కరస్పాండెంట్)**





అది మినరల్ వాటర్ కాదు.. లీటరు లీటరుకూ నిశ్శబ్దంగా ప్రాణాలు తీసే 'స్లో పాయిజన్'. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణంలో నకిలీ మినరల్ వాటర్ మాఫియా మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ప్రజల ఆరోగ్య అవసరాలను ఆసరాగా చేసుకుని, కనీస అనుమతులు లేని పుట్టగొడుగుల ప్లాంట్లు పుట్టుకొచ్చాయి. శుద్ధి చేసిన స్వచ్ఛమైన జలమంటూ రసాయనాలు దట్టించిన బోరు నీటిని ప్రజల గొంతుల్లో పోస్తూ.. కొందరు కేటుగాళ్లు కాసుల వేట సాగిస్తున్నారు. స్థానిక మున్సిపల్, ఫుడ్ సేఫ్టీ, పోలీస్ అధికారుల 'మామూళ్ల' అలసత్వమే ఈ అక్రమ సామ్రాజ్యానికి అండగా నిలుస్తోందని పట్టణ ప్రజలు నిప్పులు చెరుగుతున్నారు. 'టీడీఎస్' మాయాజాలం.. రోగాల మయం!తాగునీటిలో మానవ శరీరానికి అత్యంత అవసరమైన కాల్షియం, మెగ్నీషియం వంటి లవణాల తీవ్రతను తెలిపే టీడీఎస్ (మొత్తం కరిగిపోయింది ఘనమైన) కనీసం 100 నుండి 150 ఎంజి/ఎల్ ఉండాలని నిబంధనలు స్పష్టం చేస్తున్నాయి. కానీ, అయిజలో దొరుకుతున్న నీటిలో ఇది కేవలం 20 శాతం మాత్రమే ఉండడం గమనార్హం. కేవలం విద్యుత్ బిల్లులు, ఫిల్టర్ల ఖర్చులు తగ్గించుకోవడానికి ప్లాంట్ల యజమానులు నీటిని అడ్డగోలుగా వడపోస్తున్నారు. దీంతో ఖనిజాలన్నీ హరించుకుపోయి, కడుపులోకి 'చప్పిడి నీరు' చేరుతోంది. కొన్ని ప్రాంతాల్లో సరఫరా అవుతున్న క్యాన్లలో ఏకంగా పురుగులు, నాచు బయటపడుతుండడం ఈ ప్లాంట్ల దౌర్భాగ్య స్థితికి నిదర్శనంగా నిలుస్తోంది.నిబంధనలు 'నీళ్లపాలు'.. ఫిల్టర్ల నిండా కెమికల్స్‌బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బిఐఎస్), ఆహార భద్రతా ప్రమాణాల ప్రకారం ఒక వాటర్ ప్లాంట్ నడవాలంటే అగ్నిపరీక్ష ఎదుర్కోవాలి. కానీ, అయిజలో ఒక్క ప్లాంట్‌కూ ఆ అర్హత లేదు.కాగితాల్లో నిబంధనలు: అయిజలో వాస్తవాలు: స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లాంట్ & ఏసీ గదులు తుప్పుపట్టిన ఐరన్ పైపులు, అపరిశుభ్ర వాతావరణం ల్యాబ్‌లు, మైక్రో బయాలజిస్ట్ నియామకం అడ్రస్ లేని ల్యాబ్‌లు, ల్యాబ్ అసిస్టెంట్లు 3 నెలలకోసారి అధికారుల నీటి తనిఖీలు బీఐఎస్ నిబంధనల ప్రకారం క్లోరినేషన్, సాండ్‌కార్బన్ ఫిల్టర్స్, ఆర్ఓ, ఓజోనైజేషన్, అల్ట్రా వయొలెట్ రేడియేషన్ ద్వారా శుద్ధి చేసిన తర్వాతే నీటిని క్యాన్లలో నింపాలి. కానీ, ఇక్కడ నేరుగా బోరు నీటికి కెమికల్స్ కలిపి నాణ్యమైన నీరుగా భ్రమింపజేస్తున్నారు.చట్టం చుట్టమేనా? నంబర్ ప్లేట్లు లేని వాహనాల దందా!
సామాన్య పౌరుడు రోడ్డు మీదకు వస్తే లైసెన్స్, ఇన్సూరెన్స్, హెల్మెట్ అంటూ చలాన్లతో బాదేసే రక్షక భట్రాజ్యం.. ఈ వాటర్ మాఫియా వాహనాల ముందు మోకరిల్లుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో తిరుగుతున్న వాటర్ సప్లై వాహనాలకు నంబర్ ప్లేట్లు లేవు, ఆర్సీ బుక్కులు లేవు. కనీసం డ్రైవింగ్ లైసెన్స్ కూడా లేని క్లీనర్లు, మైనర్లు ఈ వాహనాలను రోడ్లపై ఇష్టారాజ్యంగా నడుపుతున్నారు. దీని వెనుక ఉన్న 'కనిపించని హస్తం' ఎవరిదో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. కిడ్నీలు ఫెయిల్.. ఎముకలు గుల్ల!"అపరిశుభ్రమైన నీటి వల్ల తక్షణమే కలరా, టైఫాయిడ్, పచ్చకామర్లు ప్రబలుతాయి. అలాగే, లవణాలు లేని (తక్కువ TDS) నీటిని నిరంతరం తాగడం వల్ల శరీరంలో క్యాల్షియం లోపించి ఎముకలు బలహీనపడతాయి. కిడ్నీ దెబ్బతినే ప్రమాదం ఉంది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి."— వైద్య నిపుణులు, ప్రభుత్వ ఆసుపత్రిఇప్పటికైనా 'టాస్క్‌ఫోర్స్' కదిలేనా..?అయిజ మున్సిపాలిటీలో సాగుతున్న ఈ ఘోర అక్రమంపై జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలి. ఫుడ్ సేఫ్టీ అధికారులతో తక్షణమే 'టాస్క్‌ఫోర్స్' రంగులోకి దింపి, అనుమ తులు లేని ప్లాంట్లను సీజ్ చేయాలి. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టి వ్యాపారం చేస్తున్న యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పట్టణ ప్రజలు ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నారు.

# పాలకుల 'నిర్లక్ష్య' గ్రంథాలయం.. నడిగడ్డ నిరుద్యోగుల 'కన్నీటి' ఆలయం!



*** గద్వాల లైబ్రరీ దుస్థితిపై పాఠకురాలి గళం.. 'కాంగ్రెస్' పాలనపై నిప్పులు!**
*** నాయకులకు స్వార్థాభివృద్ధేనా? మా బతుకులు పట్టవా?**
*** మూడేళ్లయినా రాని నోటిఫికేషన్లు.. సీఎం రేవంత్ రెడ్డి .. కళ్లు తెరవండి!**

**గద్వాల జూన్ 12 (వుదయం బ్యూరో)**

"రెక్కాడితే గాని డొక్కాడని బడుగు, బలహీన వర్గాల బిడ్డలం.. లైబ్రరీలో చదువుకుని ఉద్యోగం సాధిద్దామంటే ఇక్కడ కనీస వసతులు లేవు. స్థానిక నాయకులకు విద్యావ్యవస్థపై చిత్తశుద్ధి లేదు. మీ వ్యక్తిగత స్వార్థమే తప్ప మా జీవితాల గురించి క్షణమైనా ఆలోచిస్తున్నారా?" అంటూ గద్వాల జిల్లా కేంద్ర గ్రంథాలయ దుస్థితిపై ఓ నిరుద్యోగ పాఠకురాలు తీవ్ర ఆవేదన, ఆగ్రహం వ్యక్తం చేశారు. నడిగడ్డ పాలకుల అసమర్థతకు ఈ గ్రంథాలయమే సజీవ సాక్ష్యమని ఆమె మండిపడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా, నిరుద్యోగులను నిండా ముంచుతూ ఉద్యోగ నోటిఫికేషన్ల విషయంలో తీవ్ర జాప్యం చేస్తోందని ధ్వజమెత్తారు. నోటిఫికేషన్లు లేక, లైబ్రరీలో వసతులు లేక ఈ ప్రాంత బిడ్డలు విద్యా, ఉద్యోగాలకు దూరమ వ్వాల్సి వస్తోందని కన్నీరు పెట్టారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక పాలకులు కళ్లు తెరిచి గద్వాల గ్రంథాలయాన్ని బాగు చేయాలని, నిరుద్యోగుల భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలని ఆమె డిమాండ్ చేశారు.

# ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు




**గద్వాల జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**

ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకొని పరమాల గ్రామ పంచాయతీ కార్యాలయంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. రాజేందర్ పాల్గొని బాల కార్మిక వ్యవస్థ సమాజానికి ఒక సామాజిక దురాచారమని పేర్కొన్నారు. చిన్నారులను విద్యకు దూరం చేసి పనిలో నిమగ్నం చేయడం వారి ప్రాథమిక హక్కుల ఉల్లంఘన అని వివరించారు. ప్రతి బాలుడికి విద్య, ఆరోగ్యం, రక్షణ, సమాన అవకాశాలు కల్పించడం రాజ్యాంగం కల్పించిన హక్కు అని తెలిపారు. బాల కార్మిక చట్టం, పిల్లలకు ఉచిత, నిర్బంధ విద్యా హక్కు చట్టం, బాలల సంరక్షణ చట్టాలు, బాలల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకునే యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశముందని, గ్రామీణ ప్రాంతాలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సహకరించాలని కోరారు.
ప్రతి బాలుడు సురక్షితమైన, ఆరోగ్యకరమైన వాతావరణం లో పెరిగే హక్కు కలిగి ఉన్నాడని తెలిపారు. బాలలపై జరిగే వేధింపులు, బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సమస్యలను గుర్తించిన వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. బాలల హక్కుల పరిరక్షణలో తల్లిదండ్రులు, గ్రామస్థుల పాత్ర అత్యంత కీలకమని వివరించారు. గ్రామ స్థాయిలో బాల కార్మిక వ్యవస్థను పూర్తిగా నిర్మూలించేందుకు అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. పిల్లలను పాఠశాలలకు పంపించి వారి విద్యాభివృద్ధికి సహకరించాలని సూచించారు. ప్రతి చిన్నారి విద్యను కొనసాగించేలా సహకరించాలని కోరారు. బాలల భవిష్యత్తు దేశ భవిష్యత్తు అని పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని, పిల్లలకు విద్య, రక్షణ కల్పించడం ద్వారా సమాజ అభివృద్ధికి తోడ్పడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసులు, లక్ష్మన్న స్వామి, లీగల్ డిఫెన్స్ కౌన్సిల్స్ నర్సింహులు డి.సి.పి.ఓ, తిరుమలేష్, పంచాయతీ కార్యదర్శి, అంజి, సర్పంచ్ బాల రక్షాబంధన్ సిబ్బంది పాల్గొన్నారు.

# శివాజీ విగ్రహ ప్రతిష్టాపనకు దాతల విశేష స్పందన



**నారాయణపేట టౌన్ జూన్12 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లా కేంద్రంలో ప్రతిష్ఠాత్మకంగా ఏర్పాటు చేయనున్న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఏర్పాటుకు పట్టణ ప్రము ఖులు, దాతలు ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తోంది .ఈ సందర్భంగా శక్తిపీఠం వ్యవస్థాపకులు స్వామి శాంతానంద పురోహిత్ రూ.1,16,000,డాక్టర్ ప్రసాద్ శెట్టి, రూ.2,16,000, ప్రముఖ న్యాయవాది నందు నామాజీ రూ.1,16,000 విరాళంగా అందజేశారు.డాక్టర్ గావినోళ్ల మధుసూదన్ రెడ్డి తమ వంతు సహాయాన్ని అందించగా, మున్సిపల్ వైస్ చైర్మన్ భర్త జి ఆర్ రెడ్డి నిర్మాణానికి అవసరమైన సంపూర్ణ మెటీరియల్‌తో పాటు రూ.1,00,000 నగదు సహాయాన్ని ప్రకటించారు.
అదేవిధంగా సీనియర్ నాయ కులు నాగరావు నామాజీ ని కలిసి నిర్మాణ కార్యక్రమ పురోగతిపై చర్చించి వారి అమూల్యమైన సూచనలు, సలహాలను కమిటీ సభ్యులు స్వీకరించారు.నారాయణపేటకు గర్వకారణమైన ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాన్ని అత్యంత త్వరలో ప్రతిష్ఠించేందుకు కృషి చేస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.ఈ సందర్భంగా కమిటీ సభ్యులు దాతలను శాలువాలతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు.

# రుణాలు అందించడంలో బ్యాంకర్లు చొరవ చూపాలి




**- జిల్లా కలెక్టర్ సిహెచ్ ప్రియాంక**

**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**

రైతులు, విద్యార్థులు, ఎం ఎస్ ఎం ఈ యూనిట్లు, స్వయం సహాయక సంఘాలు, స్వయం ఉపాధి రంగాలకు రుణాల మంజూరు లో బ్యాంకులు( బ్యాంకర్లు) చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక ఆదేశించారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఇక్కడి వీసీ హాల్ లో డీ సీ సీ ( డిస్టిక్ కన్సల్టేటివ్ కమిటీ) సమీక్షా సమావేశం నిర్వహించారు. గత ఆర్థిక సంవత్సరం లో బ్యాంకుల ద్వారా చేపట్టిన రుణాల పురోగతిపై కలెక్టర్ సమావేశంలో సమీక్షించారు. గత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవ రుణాల మంజూరు పై కేటగిరి వారీగా సమీక్ష జరిపారు. రుణాల మంజూరులో సిబిల్ స్కోర్ ను ఒక ప్రమాణంగా పరిగణించినప్పటికీ, అర్హులైన రైతులు, విద్యార్థులు , స్వయం ఉపాధి లబ్ధిదారులు రుణాల కోసం తిరస్కరణకు గురికాకుండా బ్యాంకర్లు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని ఆమె సూచించారు. జిల్లాలోని కొన్ని బ్యాంకులు వివిధ ప్రభుత్వ పథకాల కింద రుణాల మంజూరులో వెనుకబడి ఉన్నాయని, అలాంటి బ్యాంకులు వెంటనే తమ పనితీరును మెరుగుపరచుకొని లక్ష్యాలను చేరుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. బ్యాంకులు అభివృద్ధి భాగస్వాములుగా వ్యవహరించి వ్యవసాయం, స్వయం ఉపాధి, సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు తదితర రంగాలకు విస్తృతంగా రుణాలు అందించాలని ఆమె కోరారు. అలాగే ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన, ముద్ర యోజన తదితర ప్రభుత్వ పథకాల కింద అర్హులైన లబ్ధిదారులకు నిర్ణీత గడువులోపు రుణాలు మంజూరు చేసి జిల్లా అభివృద్ధికి తోడ్పడాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు. చివరగా ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూ. 4524.78 కోట్ల జిల్లా వార్షిక రుణ ప్రణాళిక పుస్తకాన్ని కలెక్టర్ విడుదల చేశారు. ఈ సమావేశం లో ఆర్బీఐ ఎల్ డి ఓ శ్రీకాంత్, ఎస్ బి ఐ ఏ జీ ఎం పవన్ కుమార్, నాబార్డ్ డి డి ఎం మహేందర్, శీలా, కెనరా బ్యాంక్ నుంచి నరేష్, యూ బి ఐ నుంచి రమేష్ బాబు, డి ఆర్డిఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్, జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమ అధికారి అబ్దుల్ ఖలీల్, హార్టికల్చర్ అధికారి సాయిబాబ, పశు సంవర్ధక శాఖ అధికారి ఈశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వెజ్, నాన్ వెజ్ మార్కెట్ ఓపెన్ వేలం దరఖాస్తుల స్వీకరణ గడువు పొడిగింపు

**గద్వాల జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**

గద్వాలలోని వెజ్, నాన్ వెజ్ మార్కెట్ దుకాణాల ఓపెన్ వేలం నిమిత్తం దరఖాస్తుల స్వీకరణకు ముందుగా ప్రకటించిన గడువును పొడిగించినట్లు మున్సిపల్ కమిషనర్ జానకిరామ్ సాగర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను 16062026 లోగా సాయంత్రం 5.00 గంటల వరకు పురపాలక సంఘ కార్యాలయంలో సమర్పించవచ్చన్నారు. ఈనెల 19న ఓపెన్ వేలం యథావిధిగా నిర్వహించబడునని పేర్కొన్నారు.
ఆసక్తి గల దరఖాస్తుదారులు గమనించి సద్వినియోగం చేసుకోవలసిందిగా ఈ సందర్భంగా కమిషనర్ కోరారు.

# వంట కార్మికులకు అవగాహన ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల..




**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేట మండల కేంద్రంలోని పీఎం శ్రీ హైస్కూల్ లో ప్రధానోపాధ్యాయురాలు జ్ఞానమాల ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు వంట కార్మికులచే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 23 నుండి విద్యార్థులకు సెలవులు ఇచ్చిన సందర్భంగా ఈనెల 15 నుండి స్కూల్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో జిల్లా విద్యాధికారి రాజు ఆదేశాల మేరకు వంట రూములను సున్నం వేయించి వంట పాత్రలను శుభ్రం చేసుకోవాలన్నారు.అలాగే విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఇలాంటి ఇబ్బందులు లేకుండా వారికి భోజనం సౌకర్యం కల్పించాలని భోజనం విషయంలో ఏమైనా ఇబ్బందులు ఉన్నట్లయితే పాఠశాల ప్రధానోపాధ్యాయుల దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యతోపాటు ఉచిత భోజన సౌకర్యం కల్పిస్తుందని ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలను సద్వినియం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జయరాములు గౌడ్, వెంకటేష్,మహేందర్, ఉమా రాణి,తదితరులు పాల్గొన్నారు.



# గ్రేటర్ హైదరాబాద్



## గుమ్మడిదల మైత్రి డ్రగ్స్ టెక్నాలజీ సెంటర్ పరిశ్రమలో విషాదం



జూనియర్ ఎగ్జిక్యూటివ్ కార్మికుడు మృతి విధులు నిర్వహిస్తుండగా ప్రమాదానికి గురైన జూనియర్ ఎగ్జిక్యూటివ్ ప్రవీణ్ కుమార్ (25) చికిత్స పొందుతూ మృతి చెందిన కార్మికుడు మృతుడు మెదక్ జిల్లా హత్నూర మండలం కసల గ్రామానికి చెందిన వ్యక్తి మూడు రోజుల క్రితం పరిశ్రమలో ప్రమాదం విషయం బయటకు రాకుండా సమీపంలోని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలింపు ఆరోగ్య పరిస్థితి విషమించడంతో నిమ్స్ ఆస్పత్రికి తరలింపు చికిత్స పొందుతూ మృతి చెందిన ప్రవీణ్ కుమార్

ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది పరిశ్రమ భద్రతా ప్రమాణాలపై ప్రశ్నలు వ్యక్తం చేస్తున్న స్థానికులు, కార్మికులు మృత కార్మికుడి కుటుంబానికి మద్దతుగా సీపీఎం కార్మిక నాయకులు బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్న కార్మిక సంఘాలు, వివిధ పార్టీల నాయకులు, స్థానికులు

## చేనేత జౌలీ శాఖ ఏడిని కలిసిన కించి నారాయణ

**నారాయణపేట టౌన్ జూన్12(వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా చేనేత జౌలీ శాఖ అధికారి ఏడిని సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ టౌన్ కార్యదర్శి కెంచి నారాయణ, యాబన్న చౌదరి ,చిన్న జట్రం సీరం వెంకటయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నారాయణపేట జిల్లాలో చేనేత కార్మికుల సాధకబాధకలు కార్మికులకు ఉపాధి పైన చర్చించి వారి సమస్యలను వివరించారు. చేనేత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు వినతి పత్రా రూపంలో పేర్కొన్నారు.

## మాజీ శాసనసభ్యులు గట్టు భీముడుకి ఘనంగా నివాళులు అర్పించిన



**- తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్మన్ సరిత తిరుపతయ్య**

**గద్వాల జూన్ 12 (వుదయం ప్రతినిధి)**

గద్వాల మాజీ శాసనసభ్యులు గట్టు భీముడు వర్ధంతి సందర్భంగా బలిగేర లోని వారి విగ్రహానికి రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సమాఖ్య చైర్మన్ సరితా తిరుపతయ్య పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించినారు. ఈ సందర్భంగా సరిత తిరుపతయ్య మాట్లాడుతూ గద్వాల చరిత్రలో అగ్ర కులాల పెత్తందారులను ఎదిరించి నిలబడి ఎమ్మెల్యేగా గెలిచిన ఒకే ఒక్క నాయకుడు గట్టుభీముడు అలాగే ఆయన చేసిన అభివృద్ధి పనులు మరువలేనివి అన్నారు. అలాంటి బిసి నేత మన మధ్యలో లేనందుకు చింతిస్తున్నామని, కానీ ఆయన అడుగుజాడల్లో ప్రజలు నడవాలని కోరారు.ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు వాల్మీకి బోయ కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మెన్ గట్టు తిమప్ప, డీసీసీ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్, మధుసూదన్ బాబు, మాబాషా, గౌస్, డీర్ శ్రీధర్, శ్రీనివాస్ గౌడ్, రాజశేఖర్ రెడ్డి, ఆనంద్ గౌడ్, సద్దాలోనిపల్లి గోపాల్, బజారి ముఖ్య నాయకులు తదితరులు ఉన్నారు.

## శక్తిపీఠంలో విశేష భజన కార్యక్రమం



**నారాయణపేట టౌన్ జూన్12 (వుదయం ప్రతినిధి)**

స్థానిక శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానము , శక్తి పీఠంలో అధిక మాసమును పురస్కరించుకుని శుక్రవారము విశేష భజన కార్యక్రమమును నిర్వహించారు. శక్తి పీఠం ఆవరణలోని స్వామి శాంతానంద సభా మండపంలో లక్ష్మీ శోభానా భజన మండలి మహిళల దాస సంకీర్తనలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.అధిక మాస విశేష భజనలో పాల్గొన్న మహిళామూర్తులందరికీ కాళ్ళకు పసుపు పారాణి రాసి , పసుపు కుంకుమలను సమర్పించారు.తదనంతరం శక్తి పీఠం అమ్మవారి చిత్రపటమును శక్తి పీఠం డైరీని మహిళందరికీ అందించి సత్కరించారు.సనాతన ధర్మ పరిరక్షణ కొరకు , హిందూ సంస్కృతీ సాంప్రదాయాలను భావి తరాలకు అందించుటకు ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డాక్టర్ స్వామి శాంతానంద అభిప్రాయపడ్డారు.ఇట్టి కార్యక్రమము లో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జర్నలిస్టులకు శుభవార్త.. అర్హు లందరికీ అక్రిడిటేషన్



**గద్వాల జూన్ 12 (వుదయం బ్యూరో)**

జోగులాంబ గద్వాల జిల్లాలో 202628 కాలానికి అర్హత కలిగిన ప్రతి జర్నలిస్టుకు అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ తెలిపారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్‌లో జరిగిన మీడియా కమిటీ సమావేశంలో అక్రిడిటేషన్ దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. నిబంధనల మేరకు అర్హులైన వారందరికీ కార్డులు జారీ చేస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో డీపీఆర్వో అరీఫుద్దీన్‌తో పాటు మీడియా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## తెరల వెనుక బందీ అవుతున్న మనిషి

**గండిపేట్, జూన్ 12 (వుదయం):**



ఆధునిక యుగంలో సాంకేతికత మనిషి జీవితాన్ని ఎంతో సులభతరం చేసినప్పటికీ, అదే సమయంలో మానవ సంబంధాలను బలహీనపరుస్తోందని తెలంగాణ రక్షణ సేన పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ నాయకుడు నిరుడు సర్వేష్ ముదిరాజ్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచం మొత్తం మన అరచేతిలోకి వచ్చేసినప్పటికీ, మన పక్కనే ఉన్న మనిషితో అనుబంధం క్రమంగా దూరమవుతోందని ఆయన పేర్కొన్నారు. నెట్‌వర్క్ సిగ్నల్ బలంగా ఉన్న చోట కూడా మనుషుల మధ్య భావోద్వేగ అనుబంధాలు తెగిపోతున్నాయని అన్నారు. స్మార్ట్‌ఫోన్ తెరలపై గంటల తరబడి గడుపుతున్న నేటి తరానికి, పక్కనే ఉన్న వ్యక్తి బాధను అర్థం చేసుకునే సమయం లేకుండా పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సామాజిక మాధ్యమాల్లో వందలాది మంది వర్చువల్ మిత్రులు ఉన్నప్పటికీ, మనసులోని బాధను పంచుకునే ఒక నిజమైన స్నేహితుడు కూడా లేకపోవడం విచారకరమని పేర్కొన్నారు.ఈ పరిస్థితి యువతలో ఒంటరితనం, మానసిక ఆందోళనలను పెంచుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.ఒకప్పుడు మనుషులు యంత్రాలను నియంత్రించేవారని, కానీ ప్రస్తుతం యంత్రాలే మనుషుల ఆలోచనలు, భావోద్వేగాలు, జీవనశైలిని ప్రభావితం చేస్తున్నాయని నిరుడు సర్వేష్ ముదిరాజ్ అన్నారు.ఇది నిజమైన పురోగమనమా లేక మానవ విలువల పతనమా అనే అంశంపై ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు.ముఖ్యంగా రీల్స్, షార్ట్స్ వంటి క్షణిక వినోదాలపై పెరుగుతున్న మోజు యువతలో లోతైన ఆలోచనా శక్తిని దెబ్బతీస్తోందని తెలిపారు.కృత్రిమ మేధస్సు (ఏఐ) వంటి ఆధునిక సాంకేతికతలు పనులను సులభతరం చేస్తున్నప్పటికీ, వాటిపై అతిగా ఆధారపడటం వల్ల మానవ మేధస్సులోని సృజనాత్మకత తగ్గిపోతోందని ఆయన హెచ్చరించారు.సమాచారాన్ని వేగంగా అందించే ఈ సాంకేతిక సాధనాలు, మనిషిలో ఉండాల్సిన పరిశీలన, విశ్లేషణ, సృజనాత్మక ఆలోచనలను క్రమంగా మందగింపజేస్తున్నాయని పేర్కొన్నారు.సమాజంలో జరుగుతున్న పరిణామాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన అన్నారు.రోడ్డుపై ప్రమాదం జరిగినప్పుడు బాధితుడిని కాపాడే ప్రయత్నం చేయడం కంటే, ఫోన్ తీసి వీడియో చిత్రీకరించాలనే ధోరణి పెరుగుతోందని విమర్శించారు ."ఏం జరిగితే మాకేంటి" అనే నిర్లక్ష్య భావన, సామాజిక బాధ్యతల పట్ల ఉదాసీనత, మానవీయ స్పందనల లోపం వంటి లక్షణాలు డిజిటల్ యుగం ప్రభావంతో పెరుగుతున్నాయని తెలిపారు. ఇకనైనా ప్రతి ఒక్కరూ మేల్కొని డిజిటల్ బంధనాల నుంచి బయటపడాలని నిరుడు సర్వేష్ ముదిరాజ్ పిలుపునిచ్చారు.కొంత సమయమైనా ఫోన్లను పక్కనపెట్టి పిల్లలతో ముచ్చటించాలని, వృద్ధుల మాటలు వినాలని, సమాజం పట్ల కరుణా భావంతో ముందుకు రావాలని సూచించారు.గోడలను కాదు, మనుషుల మధ్య వంతెనలను నిర్మించే మానవత్వమే నేటి సమాజానికి అత్యంత అవసరమని, యాంత్రిక జీవనం నుంచి మానవీయ జీవన విధానంలోకి తిరిగి రావాలని, మనిషిని మనిషిగా ప్రేమించే సంస్కృతిని పెంపొందించాలని ఆయన కోరారు.

## మాంటిస్సోరి పాఠశాలలో జరిగే అక్రమాలపై విచారణ చేపట్టాలి



**- ఆంధ్ర ఉద్యోగులకు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణ వారికి ఇవ్వడం లేదు**

**అలంపూర్ జూన్ 12 (వుదయం ప్రతినిధి)**

అల్లంపూరు మాంటిస్సోరి ప్రైవేటు పాఠశాలలో ఆంధ్ర ఉద్యోగులకు ఇస్తున్న ప్రాధాన్యత తెలంగాణ ఉద్యోగులకు ఇవ్వడం లేదని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బి నరసింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి జి రాజు అన్నారు. శుక్రవారం మాంటిస్సోరి పాఠశాలలో జరుగుతున్న అక్రమాలపై చర్యలు తీసుకోవాలని మండల విద్యాశాఖ అధికారి ఆర్ అశోక్ కుమార్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ అల్లంపూరు మండల కేంద్రంలో ఉన్న మాంటిస్సోరి ప్రైవేటు పాఠశాలలో అనేక అక్రమాలు జరుగుతున్న విద్యాశాఖ జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని విమర్శించారు. మాంటిస్సోరి పాఠశాల యాజమాన్యం ఆంధ్రకు చెందినవారు కావడంతో పాఠశాలలో పనిచేయడానికి ఉపాధి కోసం వస్తున్న ఆంధ్ర ఉద్యోగులకు ఇస్తున్న ప్రాధాన్యత ఉపాధి అవకాశాలు తెలంగాణ ఉద్యోగులకు కార్మికులకు కల్పించడం లేదని అన్నారు. తెలంగాణలో స్కూల్ ఉన్న ఆంధ్ర ఇన్చార్జిలను పెట్టి స్కూల్లో పనిచేస్తున్న తెలంగాణ ఉద్యోగులు కార్మికులను వేధిస్తున్నారని అన్నారు. స్థానికులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని ఉన్న కొద్దిపాటి ఉద్యోగులను కార్మికులను చిన్నచిన్న కారణాలు సాకుగా చూపి విధుల నుండి తొలగిస్తున్నారని అన్నారు. స్థానిక విద్యార్థులు చదువుకోవడానికి కూడా సీట్లు ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. ప్రతి ఏడాది అడ్డగోలుగా ఫీజులు పెంచి దోపిడీ చేస్తున్నారని స్కూల్లో స్టేషనరీ ఏర్పాటు చేసి దందా కొనసాగిస్తున్న విద్యాశాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు. విద్య హక్కు చట్టం ప్రకారం 25% సీట్లు అట్టడుగు కులాల విద్యార్థులకు ఉచితంగా ఇవ్వాలన్న ఇవ్వడంలేదని అన్నారు. స్కూల్లో పనిచేస్తున్న ఉద్యోగులు కార్మికులతో వెట్టి చాకిరి చేస్తున్నారని సమయంతో సంబంధం లేకుండా రోజుకు 14 గంటలు పని చేస్తున్నారని అన్నారు. కార్మికులకు పిఎఫ్, ఈఎస్ఐ ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. పాఠశాల నిర్వహించుకోవడానికి అనుమతి తీసుకొని అనధికారికంగా వసతి గృహం నడపడం వల్ల వసతి గృహంలో గత ఏడాది ప్రమాదవశాత్తూ ఇద్దరూ కార్మికులు చనిపోయారని అన్నారు. వసతి గృహంలో అనేక అక్రమాలు అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్న జిల్లా స్థాయి ఉద్యాధికారులకు లంచాలు ఇస్తూ వసతి గృహంలో జరుగుతున్న విషయాలు బయటకు రాకుండా చూస్తున్నారని అన్నారు. అనుమతి లేకుండా వసతి గృహం నడుపుతున్న పాఠశాల యాజమాన్యం పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఉద్యోగాల నుండి తొలగించిన ఉద్యోగులను కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని ఆంధ్ర ఇన్చార్జిల పెత్తనంతో నలుగుతున్న తెలంగాణ ఉద్యోగులు, కార్మికులకు ప్రాధాన్యత గౌరవం ఇవ్వాలని లేనియెడల పాఠశాల ముందు రిలే నిరాహార దీక్షలు చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు మాంటిస్సోరి పాఠశాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జయన్న, కెవిపిఎస్ టౌన్ కార్యదర్శి అయ్యప్ప, గంగన్న, బాధితులు జి శేఖర్, ఆర్ రత్నశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

## అర్హు లైన వారందరికీ అక్రిడిటేషన్ మంజూరు



**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**

**గద్వాల జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**

202628 కి సంబంధించిన జర్నలిస్టుల అక్రెడిటేషన్ అర్హులైన ప్రతి ఒక్కరికి మంజూరు చేస్తామని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో మీడియా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జోగులాంబ గద్వాల జిల్లాలోని ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు కార్డుల మంజూరు పై చర్చించారు. అర్హులైన ప్రతి ఒక్క జర్నలిస్టుకి అక్రిడిటేషన్స్ మంజూరు అవుతాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ అరీఫుద్దీన్, ఆర్టీసీ డిపో అసిస్టెంట్ మేనేజర్, మీడియా కమిటీ సభ్యులు అక్బర్ బాషా, పెద్ద ఇస్మాయిల్, రవీందర్ రెడ్డి, నల్లన్న, వెంకటేష్, సిరాజ్, భీమ రాయుడు, జాన్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టర్ ప్రారంభించారు.. కమిషనర్ తాళం వేయించారా...!

**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**



వారాంతపు మార్కెట్ యార్డ్ ను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సీ హెచ్ ప్రియాంక శుక్రవారం ప్రారంభించారు. కానీ ప్రారంభించిన అరగంట తర్వాత ఇంటిగ్రేటెడ్ మార్కెట్ గేటుకు తాళం వేశారు. ఈ తాళాలు కమిషనర్ వేయించారా సిబ్బంది వేశారా అని పలువురు ప్రశ్నించుకున్నారు. కలెక్టర్ ప్రారంభించిన తర్వాత అక్కడ ఉన్న రాజకీయ నాయకులు, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు వివిధ శాఖల అధికారులు అక్కడ నుండి వెళ్లిపోయారు. వెళ్లిపోయిన అరగంట తర్వాత మున్సిపల్ సిబ్బంది తాళం వేశారు. ఈ తాళం మున్సిపల్ కమిషనర్ వేయించారా సిబ్బంది వేశారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. విషయం తెలుసుకున్న వుదయం ప్రతినిధి అక్కడకి వెళ్లి ఫోటోలు తీసి కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లడంతో కొద్దిసేపటికే గేటు తాళాలను తెరిచారు. ప్రతి శుక్రవారం వారాంతపు మార్కెట్ గా ప్రకటించి ఉదయం తెరిచి అరగంటలోపే మూసివేయడం ఎంత వరకు సమంజసం అని ఆ వీధి ప్రజలు అడుగుతున్నారు. డీఆర్డీపీఏ వెంకట్ రాములు, జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్, హార్టికల్చర్ అధికారి సాయిబాబా, పుర కమీషనర్ శంకర్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, పుర వైస్ చైర్పర్సన్ మంజుల, బిజెపి జిల్లా అధ్యక్షుడు సత్య యాదవ్, వార్డు కౌన్సిలర్ కందేన్ పల్లి సత్యమ్మ, కౌన్సిలర్ భరత్, జిల్లా మహిళా సంఘం నాయకులు ప్రారంభోత్సవంలో ఉన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన విప్



నకిరేకల్: నకిరేకల్ పట్టణంలోని పన్నాలగూడెం క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి CMRF ద్వారా మంజూరైన రూ.45,25,150 విలువైన 138 చెక్కులను ప్రభుత్వ విప్ & నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ పేద కుటుంబాలు అనారోగ్యంతో బాధపడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి కోసం దరఖాస్తు పెట్టుకున్న ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సహాయం అందుతుందని తెలిపారు.

నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ విజయవంతంగా ముగిసిందని, రామన్నపేట మండలంలో మరో మూడు రోజుల్లో పూర్తవుతుందని చెప్పారు.ఈ ఏడాది రైతులు రికార్డు స్థాయిలో పంట పండించారని, గతంలో ఎన్నడూ లేని విధంగా దిగుబడులు వచ్చాయని పేర్కొన్నారు. ధాన్యం కొనుగోలు అయిన మూడు రోజుల్లోపు రైతుల ఖాతాల్లో డబ్బులు జమ చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అని అన్నారు.కాళేశ్వరం లేకుండానే ఇన్ని పంటలు పండాయంటే, గతంలో కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారానే పంటల దిగుబడి పెరిగిందనేది అబద్ధమని రుజువైందని అన్నారు.రాష్ట్ర అభివృద్ధి కోసం గౌరవ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. మరింత మంది పేద ప్రజలకు త్వరలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసి వారి సొంతింటి కలను నెరవేర్చుతామని హామీ ఇచ్చారు.CMRF చెక్కులు అందుకున్న ప్రతి లబ్ధిదారుడికీ ఎమ్మెల్యే గారు శుభాకాంక్షలు తెలిపారు

## పసిపాపపై పశువుల వివరించిన నిందితుడు

**- మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలి**

**- ఖమ్మం ఘటనను ఖండించిన నారాయణపేట జిల్లా విశ్వ హిందూ పరిషత్**

**నారాయణపేట టౌన్ జూన్12 (వుదయం ప్రతినిధి)**

ఖమ్మం లో పసిపాపపై పశువులా వ్యవహరించిన నిందితుడు మహమ్మద్ గౌస్ ను ఎన్ కౌంటర్ చేయాలని నారాయణపేట జిల్లా విశ్వహిందూ పరిషత్ కార్యదర్శి కన్న శివకుమార్, టౌన్ ప్రెసిడెంట్ మురళి భట్టడ్, బజరంగ్దళ్ జిల్లా అధ్యక్షులు శ్రవణ్, కడుదాస్ ప్రవీణ్ లు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. నిందితుడిని కాపాడే ప్రయత్నం మానుకోవాలన్నారు. ఖమ్మం జిల్లాలో బాలికపై జరిగిన అత్యాచారం, హత్యాయత్న ఘటన అత్యంత దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని, బాధితురాలి హెల్త్ బుల్లెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. మహిళలు, బాలికల భద్రత విషయంలో ప్రభుత్వం ఎలాంటి రాజీ పడకుండా కఠిన నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. సమాజంలో ఇలాంటి దారుణ ఘటనలు పునరావృతం కాకుండా నిరోధించేందుకు శిక్షలు భయపడేలా ఉండాలని అభిప్రాయపడ్డారు. నేరాలను ఖండించే విషయంలో కులం, మతం, రాజకీయ అనుబంధాలు ప్రామాణికంగా మారకూడదన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకు ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం అప్రమత్తంగా వ్యవహరించాలని నిందితుడిపై జూడీషినల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

## జగ్గారెడ్డి దమ్ముంటే ఇంటి దొంగ పేరు బయటపెట్టు: ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



**సంగారెడ్డి వుదయం**

మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సిట్ విచారణకు ఆదేశించి నిజాలు బయటపెట్టాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు.బీఆర్ఎస్ రాజకీయాలు చేస్తుందని విమర్శించే ముందు కాంగ్రెస్ పార్టీలో జరుగుతున్న అంతర్గత రాజకీయాలపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన కాంగ్రెస్ నాయకత్వాన్ని ప్రశ్నించారు.

మీనాక్షి నటరాజన్‌కు అన్యాయం జరిగిందని కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతున్నప్పటికీ, ఆమె నామినేషన్ ప్రక్రియకు సంబంధించిన సమాచారం తెలంగాణ కాంగ్రెస్ నాయకుల నుంచే వెళ్లిందన్న ఆరోపణలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు."కామాలు, ఫుల్‌స్టాప్‌ల వల్లే నామినేషన్ ఆగిపోయిందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడమే" అని విమర్శించారు. జాతీయ పార్టీ ఇంచార్జి స్థాయి నాయకు సన్నిహితుడిగా చెప్పబడుతున్న వ్యక్తే మీనాక్షి నటరాజన్‌కు వెన్నుపోటు పొడిచాడనే ఆరోపణలపై కాంగ్రెస్ ఎందుకు మౌనం పాటిస్తోందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌లో జరుగుతున్న అంతర్గత కుమ్ములాటలను దాచిపెట్టేందుకే బీఆర్ఎస్‌పై ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. మధ్యప్రదేశ్ మంత్రులే తెలంగాణ కాంగ్రెస్ నాయకులే సమాచారం ఇచ్చారని చెబుతున్నప్పుడు దానికి సమాధానం చెప్పే ధైర్యం కాంగ్రెస్‌కు లేదని విమర్శించారు."టి. హరీష్ రావు విమర్శలు ఊహాగానాలు కావు. ఆధారాలతోనే కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి అంశాలను ప్రజల ముందుకు తీసుకొస్తున్నారు" అని చింతా ప్రభాకర్ పేర్కొన్నారు. కాంగ్రెస్‌లోని కోవర్టుల వ్యవహారాన్ని బయటపెట్టినందుకే హరీష్ రావుపై వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని ఆరోపించారు.మీనాక్షి నటరాజన్ వ్యవహారంపై సిట్ విచారణ జరిపి నిజాలు బయటపెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి వర్గమే ఆమెకు ద్రోహం చేసిందని తెలిసినా ఎందుకు మాట్లాడడం లేదని జగ్గారెడ్డిని ప్రశ్నించారు.ముఖ్యమంత్రి కోసం నిర్మిస్తున్న గెస్ట్ హౌస్, యూనిఫామ్ టెండర్లు, ప్రభుత్వ వ్యయాలు, హెలికాప్టర్ అద్దె ఖర్చులు వంటి అంశాలపై హరీష్ రావు లేవనెత్తిన ప్రశ్నలకు కాంగ్రెస్ సమాధానం చెప్పాలని కోరారు.సంగారెడ్డిలో ప్రజల చేతిలో ఓటమి పాలైన టి. జగ్గారెడ్డికి, ప్రజల గుండెల్లో నిలిచిన హరీష్‌రావును విమర్శించే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు.రైతులు, పేదల పక్షాన పోరాడే నాయకుడు హరీష్‌రావు కాగా, కాంగ్రెస్ నాయకులు పదవుల కోసం ఢిల్లీ నాయకుల చుట్టూ తిరుగుతున్నారని విమర్శించారు.ఉంటే మీనాక్షి నటరాజన్‌కు సీటు రాకుండా అడ్డుకున్న వ్యక్తి పేరు బయటపెట్టాలి" అని సవాల్ విసిరారు.ఫార్మాసిటీ రద్దుతో రాష్ట్రానికి రావాల్సిన పరిశ్రమలు, ఉద్యోగాలు ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయాయని, రైతులు, పేదలు, యువత సమస్యలపై సమాధానం చెప్పలేక కాంగ్రెస్ నాయకులు రాజకీయ విమర్శలతో కాలం గడుపుతున్నారని చింతా ప్రభాకర్ ఆరోపించారు.

## రామగుండంలో గంజాయిపై ఉక్కుపాదం



**పెద్దపల్లి జూన్ 12 (వుదయం ప్రతినిధి)**

గంజాయి, ఇతర మత్తు పదార్థాలపై రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెడ్లర్లు, ముఠాచారుల జాబితాను ఎప్పటికప్పుడు పోలీస్ స్టేషన్లలో నవీకరిస్తున్నామని తెలిపారు. 53 కేసుల్లో ఇప్పటి వరకు 200.465 కిలోల గంజాయిని పట్టుకుని ప్రధాన కోర్టు అనుమతితో ధ్వంసం చేసినట్లు తెలిపారు.నార్కోటిక్ సంబంధిత కేసు ప్రాపర్టీ నుంచి ఎవిడెన్స్ పడకుండా ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, గంజాయి, మత్తు పదార్థాల రవాణా, నిల్వపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ధ్వంసం చేసిన గంజాయి, గంజాయి ముక్కల మొత్తం విలువ రూ. 1,00,23,250 ఉంటుందని తెలిపారు.ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ.. డ్రగ్స్, గంజాయి, ఇతర మత్తు పదార్థాల నిర్మూలన కోసం కమిషనరేట్ పరిధిలో ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీస్ స్టేషన్ల సిబ్బందికి నేరుగా కేసులకు సంబంధించిన గంజాయి ధ్వంసం చేయడం జరిగిందని తెలిపారు.కార్యక్రమంలో పాల్గొన్న పోలీస్ అధికారులు మాట్లాడుతూ, యువత డ్రగ్స్, గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనుమానాస్పద వ్యక్తులపై నిఘా ఉంచి, మత్తు పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు.

గంజాయి విక్రయించినా, రవాణా చేసినా, నిల్వ ఉంచినా చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గంజాయి విక్రయాలు, సేవనంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ రవీందర్, ఏసీపీ గోదావరిఖని, డీసీపీ ఎన్. వెంకటేశ్వర్లు, సీఐలు, ఎస్సైలు, బాంబ్ డిస్పోజల్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

### డాక్యుమెంట్ మిస్సింగ్

నేను శ్రీమతి రజిత మల్లికార్జున్ పంతగాని, భర్త పేరు మల్లికార్జున్, వయస్సు 50 సంవత్సరాలు, గృహిణి, నివాసం: హౌస్ నెం. సి 158, వాడి ఘర్కుల్, హైదరాబాద్ రోడ్, సోలాపూర్, మహారాష్ట్ర - 413005. తేదీ 25052026 నాడు నేను మరియు నా కుటుంబ సభ్యులు వరంగల్‌లోని వెంకట్రామా టాకీస్ సమీపం నుండి ఆటోలో నర్సంపేటకు ప్రయాణించాము. ప్రయాణ మధ్యలో నర్సంపేటలోని ఒక హోటల్‌లో టీ తాగాము. టీ డబ్బులు చెల్లించేందుకు బ్యాగ్ తెరిచి డబ్బులు ఇచ్చాము. తర్వాత మా అన్నయ్య ఇంటికి చేరుకున్న అనంతరం బ్యాగ్ పరిశీలించగా, అందులో ఉన్న డాక్యుమెంట్ నెం. 3422/2024 కు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు ఒరిజినల్ వి కనిపించలేదు. అనంతరం అన్ని చోట్ల వెతికినప్పటికీ ఆ పత్రాలు లభించలేదు. కోల్పోయిన పత్రాల వివరాలు: డాక్యుమెంట్ నెం.: 3422/2024 ఇంటి నెం. : 17/4/47/B ఈ విషయమై సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సంప్రదించగా, ఎఫ్ఐఆర్ కాపీ మరియు పత్రికా ప్రకటన సమర్పించిన తర్వాత డాక్యుమెంట్ డూప్లికేట్ కాపీ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. అందువల్ల పై డాక్యుమెంట్ పత్రాలు ఎవరైనా కనుగొన్నట్లయితే, 7396328097 ఈ నెంబర్ కు ఫోన్ ద్వారా గాని వాటిని సమీప పోలీస్ స్టేషన్‌కు లేదా సంబంధిత రిజిస్ట్రార్ కార్యాలయానికి అప్పగించగలరని కోరుచున్నాము. భవిష్యత్తులో ఈ పత్రాలకు సంబంధించి ఎటువంటి లావాదేవీలు జరిగినా వాటికి నేను బాధ్యురాలిని కాను.



"నేను ఎన్నో నినాదాలు విన్నా.. మళ్లీ వింటా...

దీదీ (మమతా బెనర్జీ), పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి

పశ్చిమ బెంగాల్ లో ఎన్నికల తర్వాత తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయాన్ని చవిచూడటం, పార్టీలో తిరుగుబాట్లు, రాజీనామాల నేపథ్యంలో బెంగాల్ పరిస్థితిపై మమతా బెనర్జీ తీవ్ర నిరాశను వ్యక్తం చేశారు. తన పార్టీ బహిరంగ సభలో పరిస్థితిని చూసి ఆమె, "నేను చాలా నినాదాలు విన్నాను, మళ్ళీ వింటాను. దయచేసి నన్ను డిస్టర్బ్ చేయకండి. పరిస్థితి ఇంత దారుణంగా ఉందని నాకు తెలియదు, కనీసం 150 మంది కూడా రాలేదు" అని పేర్కొన్నారు."

*- దీదీ (మమతా బెనర్జీ), పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి*

## వే'మన' పద్యం

**అనగ నడగ రాగ మతిశయిల్లుచునుండు**
**తినగ తినగ వేము తియ్యనుండు**
**సాధనమున పనులు సమకూరు ధరలోన**
**విశ్వధాభిరామ! వినుర వేమ!**



# హిట్లర్ నుంచి స్ఫూర్తి పొందటమా...?

ప్రభుత్వంలో ఉన్న వారికి విజ్ఞత, దక్షత, బాధ్యత ఉండాలంటారు పెద్దలు. కానీ ప్రస్తుత పరిస్థితి అందుకు పూర్తి భిన్నంగా ఉంది. వంది మాగధులను సంతృప్తి పరచటానికి, కార్యకర్తలతో చప్పట్లు కొట్టించుకోవటానికి, తమకు తాము జబ్బలు చరుచుకోవటానికి అన్నట్టు నేతలు వ్యవహరించటం ఇప్పుడు ఒక ట్రెండ్‌గా మారింది. ఈ ఊపులో మనమేం మాట్లాడుతున్నాం.. తద్వారా ప్రజలకు ఏం సందేశమిస్తున్నామనే కనీస స్పృహ వారికి లేకపోవటం శోచనీయం. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ కోవలోకే వస్తాయని చెప్పటానికి ఎలాంటి సంకోచం అక్కర్లేదు. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) గురించి సీఎం ఇటీవల మాట్లాడుతూ... నియంత హిట్లర్‌ను ఉటంకించటం విజ్ఞులను నివ్వెరపరిచింది. తాను హిట్లర్ స్ఫూర్తితోనే హైడ్రాను ఏర్పాటు చేశానన్నది ముఖ్యమంత్రి ఉవాచ. దీంతో మేధావులు, అభ్యుదయవాదులు, ఆఖరికి కాంగ్రెస్ నాయకులు సైతం నోరెళ్లబెట్టాల్సిన పరిస్థితి. హిట్లర్ గురించి, అతడు సాగించిన నరమేధం గురించి తెలిసి అన్నారా? లేక ఎలాంటి అవగాహన లేకుండా మాట్లాడారా? అంటూ తెలంగాణ సమాజం అవాక్కైంది. పైగా సీనియర్ మంత్రి శ్రీధర్‌బాబు సైతం సీఎం వ్యాఖ్యలను సమర్థించటం మరింత చర్చనీయాంశమైంది. హిట్లర్ సినిమాలో అగ్ర నటుడు చిరంజీవి తన కుటుంబ క్షేమం కోసం హిట్లర్‌లా నియంతలా వ్యవహరిస్తారని, ఇప్పుడు రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలను సైతం అదే కోణంలో చూడాలన్నది శ్రీధర్‌బాబు వివరణ. ఇది ఒకరకంగా మోకాలుకి, బోడి గుండుకి లంకె పెట్టటమే. నిజంగా తాను చేపట్టదలుచుకున్న పని గురించి గట్టిగా చెప్పదలుచుకుంటే పట్టువదలని విక్రమార్కుడినే పదాలను వాడుకోవచ్చు. కానీ హిట్లర్ నుంచి స్ఫూర్తి పొందానని సీఎం చెప్పటం ఆయన స్థాయికి తగని పని. తెలంగాణ ప్రభుత్వ సారథిగా ఉన్న సీఎం... ఇలాంటి అవగాహన రాహిత్యంతో చేసే వ్యాఖ్యలు వ్యక్తిగతంగా ఆయన ప్రతిష్టను దెబ్బతీయటమేగాదు.. రాష్ట్ర ప్రభుత్వాన్నీ అప్రదిష్ట పాల్జేస్తున్నాయి. గతంలో సచివాలయంలో మూసీ ప్రక్షాళనపై నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజంటేషన్ సమయంలో కూడా ముఖ్యమంత్రి ఇదే రకంగా పొరపాటు చేశారు. ఆ సందర్భంగా కొన్ని విగ్రహాల గురించి చెబుతూ ఒక విగ్రహం గురించి ప్రత్యేకంగా ప్రస్తావించారు. కానీ అది దేశంలో ఎక్కడా లేకపోవటం గమనార్హం. ఇటీవల జరిగిన కేరళ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కూడా సీఎం ఇదే రకమైన వ్యవహారశైలిని ప్రదర్శించి అభాసుపాలయ్యారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను ఓడించేందుకు సీపీఐ (ఎం), బీజేపీ... కలిసిపోయాయంటూ ముఖ్యమంత్రి బహిరంగ సభలో మాట్లాడటం విడ్డూరం కాకపోతే మరేమిటి? ప్రభుత్వాధినేతగా, జాతీయ కాంగ్రెస్‌లో కీలక నేతగా ఉన్న సీఎం ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నప్పుడు లక్షలాది రూపాయల వేతనం తీసుకుంటున్న ఆయన సలహాదారులు, అడ్వైజర్లు ఏం చేస్తున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. సలహాదారుడంటేనే తప్పు చేసినప్పుడు సరైన సలహానిచ్చి, పరిస్థితిని గాడిలో పెట్టే పెద్ద మనిషి. అతడికంటే ఘనుడు ఆచంట మల్లన్న అన్నట్టు... కేసీఆర్ గవర్నమెంట్ కంటే ఎక్కువ సంఖ్యలో రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో సలహాదారులున్నారు. వారందరూ మిన్నకుండిపోతే సీఎంకు సలహాలిచ్చేదెవరు? ఒకవేళ అలా ఇవ్వకపోతే వారెందుకు?

ఇక హిట్లర్ చరిత్ర గురించి తెలిసిన వారెవ్వరూ అతణ్ని ఎక్కడా కనీసం తలుచుకోరు. జర్మనీలో లక్షలాది మంది యూదులను ఊచకోత కోయించి, రెండో ప్రపంచ యుద్ధానికి కారణమైన దుర్మార్గుడు, పచ్చి నియంత హిట్లర్ అన్న సంగతి పసి పిల్లాడిని అడిగినా చెప్తాడు. యూదులకు వ్యతిరేకంగా జర్మనీ జాతి ఏకమవ్వాలంటూ కొంగొత్త రాగం ఎత్తుకున్న హిట్లర్ స్ఫూర్తితో పని చేస్తున్నానని చెప్పటం హస్తం పార్టీ శ్రేణులకు సైతం మింగుడు పడని పరిస్థితి. ఈ విషయమై ఢిల్లీ స్థాయిలో పెద్ద చర్చ.. అంతకు మించి ఏఐసీసీలో పెద్ద రచ్చే నడిచిందని వినికిడి. ఇప్పుడు మన దేశంలో సైతం మైనారిటీలు, ముఖ్యంగా ముస్లింలను వ్యతిరేకంగా హిందువులందరూ ఏకం కావాలనే రెచ్చగొట్టుడు చర్యలకు పాల్పడుతున్న బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉంది. ఆహార్యంలోనూ, ప్రజలను మభ్యపెట్టటంలోనూ అచ్చం హిట్లర్ సైన్యం అనుసరించిన తీరునే ఆర్.ఎస్.ఎస్. అనుసరిస్తోంది. దాని నీడలో, అడుగుజాడల్లో నడిచే బీజేపీ ఇప్పుడు దేశంలో మత విద్వేషాలను, ఉద్రిక్తతలను రెచ్చగొట్టి తన పబ్బం గడుపుకుంటోంది. అలాంటప్పుడు బీజేపీకి వ్యతిరేకంగా అందరం కలిసికట్టుగా పోరాడాలంటున్న కాంగ్రెస్ వైఖరికి భిన్నంగా రేవంత్ రెడ్డి వ్యవహరించటాన్ని ఆ పార్టీ అధిష్టానం ఎలా చూస్తుందో మరి? ఇలాంటి వ్యాఖ్యల ద్వారా బీజేపీకి చర్యలకు ప్రజామోదం లభించేట్టు సీఎం చేయదలుచుకున్నారా? గతంలో ఏబీవీపీ గురించి... అది మన సమాజాన్ని ఉద్ధరించే సంస్థే అంటూ రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు ఇలాంటి అనుమానాలకు, అపోహలకు తావిస్తున్నాయి. అందువల్ల కాళోజీ కవిత్వం కొంత.. నా పైత్యం కొంత... అనే పద్ధతుల్లో కాకుండా రాష్ట్ర ముఖ్యమంత్రిగా వివేకంతో, వివేచనతో ఆయన మాట్లాడాలి. లేదంటే మూర్ఖులకు మాటలెక్కువ.. విజ్ఞులకు కట్టుబాట్లెక్కువ... అనే నానుడిని గుర్తు చేసుకోవాల్సి వస్తుంది.

# కుట్టు మిషన్ - ఇంటింటి ఆత్మీయనేస్తం



పూర్వకాలంలో నూలు వస్త్రాలను శ్రమించి చేతులతో కుట్టుకునే సంస్కృతి నుంచి నేడు కుట్టు యంత్రం లేదా సీవింగ్ మిషన్ ఆవిష్కరణ తర్వాత అతి తక్కువ సమయం, శ్రమ వెచ్చించకుండానే అత్యంత సులభంగా, అందమైన రీతుల్లో వస్త్రాలు కుట్టుకోవడానికి మార్గం సుగమం అయ్యింది. నేడు ఇంటింటి మహిళల ఆత్మీయ నేస్తం అయ్యింది కుట్టు మిషన్. మహిళలకు ప్రతి మిత్రుడి వలె నిలుస్తూ, జీవనోపాధులను చూపుతోంది అద్భుత కుట్టు యంత్రం. నేడు వస్త్ర పరిశ్రమ కొత్త పుంతలు తొక్కడానికి నేడు కుట్టు మిషన్లు మానవ ప్రమేయ యంత్రాలు, ఎలక్ట్రానిక్, కంప్యూటరైజ్డ్, ఎలక్ట్రిక్ రూపాల్లో పలు సైజులు, ఆకృతుల్లో కనిపిస్తున్నాయి. కుట్టు మిషన్ల రాకతో టైలరింగ్ వృత్తితో పాటు అసంఖ్యాక మహిళలు ఆర్డర్లు తీసుకొని ఇంటి నుంచే బట్టలు కుడుతూ తమ తమ జీవనోపాధులను పొందడం జరుగుతున్నది.

**జాతీయ కుట్టు మిషన్ దినం:**

కుట్టు మిషన్ ప్రాధాన్యాన్ని గుర్తించిన అంతర్జాతీయ పౌర సమాజం ప్రతి ఏట 13 జూన్‌న "జాతీయ కుట్టు మిషన్ దినం" లేదా "నేషనల్ సీవింగ్ మిషన్ డే" పాటించడం ఆనవాయితీగా మారింది. కుట్టు మిషన్ ఆవిష్కరణ మానవాళి నిత్య జీవితంలో, జీవనశైలిలో విప్లవాత్మక మార్పులకు నాంది పలికింది. ఫ్యాషన్ ప్రపంచానికి ఇది ఓ అద్భుత వరంగా మారింది. పెద్ద ఎత్తున వస్త్రాలను తయారు చేయడం, ఫ్యాషన్ లోకంలో అసంఖ్యాక డిజైన్లను పరిచయం చేయడం, వస్త్ర పరిశ్రమ రూపురేఖల్ని మార్చి వేయడం కొనసాగుతోంది. నేడు టైలరింగ్ వృత్తులు, ఫ్యాషన్ డిజైనర్లు, సాధారణ మహిళలు, అభిరుచి కలిగిన వ్యక్తులు కుట్టు మిషన్ ప్రాధాన్యాలను గుర్తించి దాని ప్రచారానికి ఎనలేని కృషి చేస్తున్నారు. జాతీయ కుట్టు మిషన్ దినం వేదికగా కుట్టు మిషన్ ప్రదర్శనలు, కుట్టు మిషన్ పని తీరు పట్ల అవగాహన, కుట్టు మిషన్ సహాయంతో తయారు చేసిన పలు రకాల వస్త్ర డిజైన్ల ప్రదర్శనలు, ప్రఖ్యాత టైలర్లను సన్మానించడం, కుట్టు మిషన్లలో వచ్చిన ఆధునిక సాంకేతిక మార్పులు లాంటివి అవగాహన చేసుకోవచ్చు.

**కుట్టు మిషన్ పుట్టుక :** కుట్టు మిషన్ చరిత్ర 150 ఏండ్ల క్రితమే ప్రారంభమైంది. 13 జూన్ 1829 రోజున ఫ్రెంచ్ టేలర్ "బార్థలెమి టిమ్మోనియర్" కృషితో కుట్టు యంత్రం కనుగొనబడింది. అంతకు పూర్వం పలు ప్రయత్నాలు జరిగిన విషయం కూడా జరగడం జరిగింది. 10 సెప్టెంబర్ 1847న అమెరికన్ "ఇలియాస్ హోవె" తొలిసారి కుట్టు మిషన్‌ను పేటెంట్ చేసారు.

1851లో "ఐజాక్ సింగర్" అను శాస్త్రవేత్త అత్యాధునిక కుట్టు యంత్రం రూపొందించి వాణిజ్యపరంగా ఉత్పత్తి చేయడం జరిగింది. కుట్టు మిషన్ తయారీలో తమ మేధస్సును వెచ్చించిన పలువురు ఆవిష్కర్తలకు కృతజ్ఞతలు తెలపడం మన కనీస బాధ్యత అవుతుంది.

నేడు వస్త్ర పరిశ్రమ పెద్ద ఎత్తున పెరగడానికి పునాదిగా నాటి, నేటి కుట్టు మిషన్ నిలుస్తున్నది. నేడు కుట్టు మిషన్ సామాన్యుల ఇంటిలో ఒక అవిభాజ్య భాగం అయ్యింది. మహిళలు తమ ఇంటి వస్త్రాలను, జీవనోపాధిగా ఇతరుల వస్త్రాలను కుట్టడానికి మన కుట్టు మిషన్ దోహదపడుతున్నది. మనకు వస్త్రాలను కుట్టి,

మన అందాన్ని ఇనుమడింపజేస్తున్న టైలర్స్‌కు కృతజ్ఞతలు తెలుపుదాం. కుట్టు మిషన్ల ప్రదర్శనలకు వెళ్లి పలు రకాల కుట్టు యంత్రాలను చూసి వద్దాం.



మధుసూదన్ రెడ్డి
9949700037

# అల్బినిజంపై సరైన అవగాహన అవసరం

అంతర్జాతీయ కార్మిక సంస్థ నిర్వచనం ప్రకారంప్రతి సంవత్సరం జూన్ 13న అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినోత్సవాన్ని ప్రపంచ వ్యాప్తంగా జరుపుకుంటారు. అల్బినిజం అనే అరుదైన జన్యుపరమైన వైకల్యంపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే ఈ దినోత్సవం యొక్క ప్రధాన ఉద్దేశ్యం. ఈ రుగ్మత కారణంగా బాధపడుతున్న వ్యక్తులు ప్రపంచ వ్యాప్తంగా వివిధ రకాల ఆరోగ్య, సామాజిక, మానసిక సవాళ్లను ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యల పట్ల ప్రపంచ సమాజం గళమెత్తి, అల్బినిజం ఉన్నవారికి హక్కులు, గౌరవం, రక్షణ లభించేలా కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉంది.అల్బినిజం అనేది శరీరంలో మెలనిన్ అనే వర్ణ ద్రవ్యం తక్కువగా ఉత్పత్తి కావడం వల్ల కలిగే స్థితి. మెలనిన్ చర్మానికి, కళ్ళకు, వెంట్రుకలకు రంగును ఇచ్చే పదార్థం. దీనిలో లోపం వలన బాధితుల చర్మం తెలుపుగా, జుట్టు పసుపు లేదా తెల్లగా, కళ్ళు నీలం లేదా గులాబీ రంగులో కనిపిస్తాయి. ఈ వ్యాధి కేవలం శారీరకంగా కాకుండా, భావోద్వేగ మరియు సామాజికంగా తీవ్రమైన ప్రభావాలను చూపుతుంది.అల్బినిజం అనేది ఒకే విధంగా ఉండదు. ఇందులో అనేక రకాలు ఉన్నాయి. ముఖ్యంగా ఆక్యులోక్యూటేనియస్ అల్బినిజం (Oculocutaneous Albinism OCA) అత్యంత సాధారణ రకం. ఇది చర్మం, కళ్ళు, వెంట్రుకలను ప్రభావితం చేస్తుంది. ఆక్యులర్ అల్బినిజం (Ocular Albinism OA) అనే రకం ప్రధానంగా కళ్లను మాత్రమే ప్రభావితం చేస్తుంది.

ఇది ఒక వైరుధ్యమయమైన నిజం - అల్బినిజంతో బాధపడే వారికి, సమాజంలో వారి ప్రత్యేక స్వభావం వల్ల మానసికంగా తీవ్ర ఒత్తిడులు ఎదురవుతున్నాయి. చర్మం తెల్లగా ఉండటం వల్ల వారు ఇతరులకంటే భిన్నంగా కనిపించడం వల్ల బాల్యం నుంచే వారికి వివక్ష, తక్కువ చూపు, హింస ఎదురవుతుంది. ముఖ్యంగా ఆఫ్రికా ఖండంలోని కొన్ని దేశాల్లో ఈ స్థితి మూఢనమ్మకాలకు గురై హింసాత్మకంగా మారింది. అక్కడ అల్బినిజం ఉన్నవారి శరీర భాగాలను తంత్ర శక్తుల కోసం వాడతారని



నమ్మకం ఉంది. వీటిని అరికట్టడం కోసం ఐక్యరాజ్య సమితి 2013లో ప్రత్యేకంగా చర్యలు చేపట్టి, 2015లో జూన్ 13ను అంతర్జాతీయ అల్బినిజం అవగాహనా దినంగా ప్రకటించింది. అల్బినిజం ఉన్నవారు అనేక ఆరోగ్య సమస్యలతో బాధ పడుతుంటారు. ముఖ్యంగా కంటి సమస్యలు - అస్టిగ్మాటిజం, నిస్టాగ్మస్, దృష్టి లోపం, కాంతి పట్ల అధిక స్పందన - ఎక్కువగా కనిపిస్తాయి. వీరు సూర్య కిరణాలకు మరింత సున్నితంగా ఉంటారు, దీంతో సన్‌బర్న్, చర్మ క్యాన్సర్ వంటి ప్రమాదాలు ఎక్కువ. వీటికి తోడు, వారు ఎదుర్కొనే మానసిక ఒత్తిడి, తక్కువ ఆత్మవిశ్వాసం, సమాజానికి దూరంగా ఉండే మానసిక స్థితి మరింత బాధాకరం.ప్రపంచంలో సగటుగా ప్రతి 17,000 నుంచి 20,000 మందిలో ఒకరికి అల్బినిజం ఉంటుంది. అయితే టాంజానియా వంటి దేశాల్లో ఇది మరింత అధికంగా ఉంది - సుమారు 1:1,400 జనాభాలో ఒకరికి ఇది ఉంటుంది. అల్బినిజంతో బాధపడే వారిపై హింసాత్మక దాడులు జరిగే అధికశాతం కేసులు ఆఫ్రికా ఖండంలోనే నమోదవుతున్నాయి.ఇలాంటి పరిస్థితుల దృష్ట్యా, ఈ దినోత్సవం ద్వారా తీసుకోవాల్సిన ముఖ్యమైన చర్యలు: అల్బినిజంపై సరైన అవగాహన కల్పించాలి. వారి ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఉచిత సన్‌స్క్రీన్, కళ్లద్దాలు, వైద్య సేవలు అందుబాటులో ఉంచాలి. విద్యా రంగంలో ప్రత్యేక శిక్షణా పద్ధతులు, దృష్టి ఆధారిత ఉపకరణాలు అందించాలి. చట్టపరంగా వారి హక్కులను నిర్ధారించాలి. సమాజంలో సమానత్వం, గౌరవం కల్పించే విధంగా చైతన్యం కల్పించాలి.ఇది ఒక రోజు వేదిక మాత్రమే కాదు - ఇది ప్రతి ఒక్కరికి బాధితుల బాధను అర్థం చేసుకునే, మార్పు కోసం ముందడుగు వేయాల్సిన రోజు. అల్బినిజం ఉన్న వారు మానవాళిలో భాగమే. వాళ్లు కూడా సమాజంలో గౌరవంతో, భద్రతతో జీవించ గలగాలి. మనం అందరం కలిసి - అవగాహన, ఆమోదం, సహానుభూతి ద్వారా - ఒక సమానతాభిమాన సమాజాన్ని నిర్మించాలి.



రామ కిష్టయ్య సంగన భట్ల
సీనియర్ జర్నలిస్ట్

# స్కూళ్లు.. పేరెంట్స్ గుండె గుభిల్లు...




జూన్ నెల వస్తోందంటే ఒకప్పుడు పిల్లల్లో కొత్త తరగతుల ఉత్సాహం, కొత్త పుస్తకాల సువాసన, కొత్త స్నేహాల సందడి కనిపించేది. కానీ, ఇప్పుడు జూన్ పేరు వినగానే తల్లిదండ్రుల గుండెల్లో గుబులు మొదలవుతోంది. పిల్లల చదువు కోసం డబ్బు ఎంత సమకూర్చాలి? ఫీజులు ఎంత పెరిగాయి? పుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫాంల కోసం ఇంకెంత ఖర్చవుతుంది? - ఈ ప్రశ్నలే వారిని వేధిస్తున్నాయి. ఓవైపు అంతర్జాతీయంగా యుద్ధ ప్రభావంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర సరుకుల ధరలు పెరిగాయి. మరోవైపు ఈఎంఐలు, అప్పులు, కుటుంబ పోషణకే నెలజీతం సరిపోని పరిస్థితి ఉంది. ఇలాంటి స్థితిలో పిల్లల భవిష్యత్తు కోసం పడుతున్న ఈ ఆర్థిక పోరాటం జూన్‌లో మరింత తీవ్రంగా మారుతోంది. ఈ రోజు పిల్లలను పాఠశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడుతున్నారంటే - అది ముమ్మాటికీ పాలకుల వైఫల్యమే తప్ప వేరేకాదు ప్రభుత్వాలు విద్యను మౌలిక హక్కుగా చెబుతున్నప్పటికీ, ఆచరణలో విద్య క్రమంగా వ్యాపార వస్తువుగా మారిపోవడం విచారకరం. ముఖ్యంగా ప్రయివేటు, కార్పొరేట్ విద్యాసంస్థలు ప్రతి ఏడాది ఫీజులను ఇష్టానుసారంగా పెంచడం తల్లిదండ్రులకు అదనపు భారం హైదరాబాద్‌లోని ఒక ప్రయివేటు పాఠశాలలో ఒకటో తరగతి ఫీజు అక్షరాల రెండులక్షల నలభై వేల రూపాయలు నిజంగా ఆశ్చర్యం. ఒక్కఫీజే కాదు, ట్యూషన్ ఫీజు, అడ్మిషన్ ఫీజు, ల్యాబ్ ఫీజు, యాక్టివిటీ ఫీజు, ట్రాన్స్‌పోర్టు ఫీజు, డిజిటల్ క్లాస్‌రూమ్ ఫీజు అంటూ ఏడదంతా వసూళ్ల పర్వం నడుస్తూనే ఉంటుంది.ఫీజుల సమస్యతో పాటు పుస్తకాల భారం కూడా పెరుగుతోంది. పాఠ్యపుస్తకాలతో పాటు అదనపు నోటుబుక్స్, వర్క్‌బుక్స్, ప్రాక్టీస్ మెటీరియల్ పేరుతో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. చాలాచోట్ల పాఠశాల యాజమాన్యాలే నిర్దేశించిన దుకాణాల నుంచి మాత్రమే పుస్తకాలు కొనాలని ఒత్తిడి చేస్తున్నాయి. మార్కెట్‌లో తక్కువ ధరకు లభించే అవకాశం ఉన్నా, తల్లిదండ్రులకు ఆ స్వేచ్ఛ ఉండటం లేదు. విద్యార్థుల భుజాలపై మోయలేని పుస్తకాల బరువు పెరుగుతుంటే, కుటుంబాలపై ఆర్థిక భారం మరింత పెరుగుతోంది. కొన్ని పాఠశాలల్లో యాజమాన్యాలే పుస్తకాల అమ్మకానికి తెరదీశాయి. తల్లిదండ్రుల స్థానంలో ఉండి ఆలోచిస్తేనే వారి ఆవేదన అర్థమవుతుంది. ఒకేసారి ఫీజులు చెల్లించాలి. పుస్తకాలు కొనాలి. యూనిఫాంలు సిద్ధం చేయాలి. రవాణా ఖర్చులు భరించాలి. చాలామంది ఇది పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు తీవ్రమైన ఆర్థిక ఒత్తిడిగా మారుతోంది. ఈ పరిస్థితులకు ప్రధాన కారణం ఫీజుల నియంత్రణపై ప్రభుత్వాల నిర్లక్ష్యం. చాలా ఏండ్లుగా ప్రయివేటు విద్యాసంస్థల ఫీజులను నియంత్రించే సమగ్ర చట్టం అవసరమని విద్యార్థి సంఘాలు, తల్లిదండ్రుల కమిటీలు డిమాండ్ చేస్తున్నాయి. ఇటీవల హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ వంటి చోట ఫీజులు తగ్గించాలని ఆందోళనకు కూడా దిగారు. కోర్టులు కూడా పలుమార్లు ప్రభుత్వాలకు మార్గదర్శకాలిచ్చాయి. అయినప్పటికీ కఠినమైన నియంత్రణ వ్యవస్థను ఏర్పాటు చేయడంలో పాలకులు విఫలమవుతున్నారు. విద్యారంగంలో పెరుగుతున్న వ్యాపార ధోరణి ఇంతకన్నా నిదర్శనం ఏం కావాలి? ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తే ఈ పరిస్థితి ఉండేది కాదు.కానీ, పాలకులకు ఆ చిత్తశుద్ధి లేదనే తెలుస్తోంది. నేడు బడిలో నూటయాభై మంది విద్యార్థినులకు ఒకే బాత్రూం ఉండటం ప్రభుత్వాల డొల్లతనాన్ని బయట పెడుతోంది. ఇలాంటి కారణాలతోనే తల్లిదండ్రులు ప్రయివేటును ఆశ్రయిస్తున్నారు. అక్కడేమో యాజమాన్యాలు వారిని నిలువు దోపిడీ చేస్తున్నాయి. విద్యా రంగంలో కార్పొరేటీకరణ పెరుగుతుండగా, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంలో మాత్రం తగిన శ్రద్ధ కనిపించడం లేదు. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నాణ్యంగా తీర్చిదిద్దితే సహజంగానే ప్రయివేటు విద్యాసంస్థల దోపిడీకి అడ్డుకట్ట పడుతుంది. కానీ అందుకు అవసరమైన ఉపాధ్యాయ నియామకాలు, మౌలిక వసతులు, నిధుల కేటాయింపులు సరైన స్థాయిలో లేవు. ఒకవైపు ప్రభుత్వ విద్య బలహీనపడుతుంటే, మరోవైపు ప్రయివేటు విద్యాసంస్థలు దాన్ని అవకాశంగా మార్చుకుని తమ వ్యాపారాన్ని విస్తరించుకుంటున్నాయి. అందువల్ల ఫీజుల నియంత్రణ చట్టాన్ని వెంటనే అమలు చేయడం అత్యవసరం. జూన్ నెల అంటే పిల్లల భవిష్యత్తుకు పునాది వేసే కాలం. కానీ నేడు అది లక్షల కుటుంబాలకు భయాన్ని, ఆందోళనను మిగులుస్తోంది. విద్యను వ్యాపారంగా మార్చిన విధానాలను అడ్డుకోకపోతే ఈ పరిస్థితి మరింత తీవ్రమవుతుంది. పాలకులు కార్పొరేట్ విద్యాసంస్థలకు కొమ్ముకాయడం మానేసి ప్రజల పక్షాన నిలవాలి. విద్య హక్కని, వ్యాపారం కాదన్న సత్యాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలి. ఈ సారైనా పాఠశాలల ప్రారంభం కాగానే పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేయాలి. అప్పుడే 'వామ్మో జూన్!' అనే నిట్టూర్పు స్థానంలో 'వెల్‌కం జూన్' అనే ఆనందం తల్లిదండ్రుల ముఖాల్లో కనిపిస్తుంది.

# గాత్ర జగత్తులో అరుదైన గౌరవం

**జగదీశ్వర్ శర్మ ప్రతిభ కేవలం పోటీలకే పరిమితం కాలేదు. ప్రముఖ సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్. పీ. పట్నాయక్ తదితరులతో కలిసి అనేక సంగీత విభావరుల్లో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో తన గాత్రాన్ని వినిపించి సంగీతాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పటివరకు 1600కు పైగా సంగీత కచేరీలు నిర్వహించడం ఆయన గానజీవితంలోని అసాధారణ ఘనతగా చెప్పాలి. ప్రతి ప్రదర్శనలోనూ శాస్త్రీయ సంగీత పునాదులను, భక్తి గాన ఆవేశాన్ని, జానపద సంగీత సరళతను సమన్వయం చేయడం ఆయన ప్రత్యేకత.**



తెలుగు సంగీత ప్రపంచంలో ప్రతిభకు, పట్టుదలకు, నిరంతర సాధనకు లభించే గుర్తింపులు కళాకారుడి జీవితంలో ప్రత్యేక మైలురాళ్లుగా నిలుస్తాయి. అలాంటి అరుదైన గౌరవం ప్రముఖ గాయకుడు, ఉపాధ్యాయుడు, టెలివిజన్ గాయకుడు డాక్టర్ గుండి జగదీశ్వర్ శర్మకు లభించడం సంగీతాభిమానులను ఆనందపరిచింది. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని హైదరాబాద్‌లో నిర్వహించనున్న "పాడుతా తీయగా" సంగీత కార్యక్రమంలో బాలుగారి పాటలను ఆలపించే అవకాశాన్ని ఆయన పొందడం విశేషం. వేలాది గాయకులలో ఎంపికై ఈ వేదికపై తన గాత్రాన్ని వినిపించే అవకాశం రావడం ఆయన సంగీత ప్రస్థానానికి మరో అరుదైన గౌరవంగా నిలిచింది. గాత్రంలో గంభీరత, స్వరంలో మాధుర్యం, భావవ్యక్తీకరణలో సహజత్వం కలగలిపిన గాయకుడిగా డాక్టర్ గుండి జగదీశ్వర్ శర్మకు ప్రత్యేక గుర్తింపు ఉంది. తెలంగాణలోని జగిత్యాల జిల్లా ధర్మపురి క్షేత్రంలో జన్మించిన ఆయన చిన్ననాటి నుంచే భక్తి సంగీతం పట్ల మక్కువ పెంచుకున్నారు. పవిత్ర గోదావరి తీరాన వెలసిన ధర్మపురి లక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలోని ఆధ్యాత్మిక వాతావరణం ఆయన వ్యక్తిత్వాన్ని, సంగీతాభిరుచిని మలిచింది. తల్లిదండ్రులు హరిప్రియ, హన్మాండ్లు దంపతుల ప్రోత్సాహంతో బాల్యంలోనే సంగీత సాధన ప్రారంభించిన ఆయన స్వరాన్ని జీవితసాధనగా మలచుకున్నారు.

సంగీతరంగంలో అడుగుపెట్టిన తొలి రోజుల నుంచే ఆయన ప్రతిభ వెలుగులోకి వచ్చింది. ఆకాశవాణి, దూరదర్శన్ కార్యక్రమాల ద్వారా శ్రోతలకు పరిచయమైన ఆయన అనంతరం టెలివిజన్ సంగీత పోటీల ద్వారా విస్తృత గుర్తింపు పొందారు. ముఖ్యంగా ఈటీవీలో ప్రసారమైన "పాడుతా తీయగా" కార్యక్రమంలో పాల్గొనడం ఆయన గానజీవితంలో కీలక మలుపుగా నిలిచింది. గానగంధర్వుడు ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం సమక్షంలో పాటలు ఆలపించి ప్రశంసలు అందుకోవడం ఆయనకు విశేష ఉత్సాహాన్ని ఇచ్చింది. జెమినీ టీవీ నిర్వహించిన "నవరాగం" సంగీత పోటీలో సెమీఫైనల్ స్థాయికి చేరుకొని ప్రముఖ సంగీత విద్వాంసుల ప్రశంసలు పొందారు.జగదీశ్వర్ శర్మ ప్రతిభ కేవలం పోటీలకే పరిమితం కాలేదు. ప్రముఖ సంగీత దర్శకులు కోటి, మాధవపెద్ది సురేష్, ఆర్.పీ. పట్నాయక్ తదితరులతో కలిసి అనేక సంగీత విభావరుల్లో పాల్గొన్నారు. వివిధ రాష్ట్రాలలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలలో తన గాత్రాన్ని వినిపించి సంగీతాభిమానుల ప్రశంసలు అందుకున్నారు. ఇప్పటివరకు 1600కు పైగా సంగీత కచేరీలు నిర్వహించడం ఆయన గానజీవితంలోని అసాధారణ ఘనతగా చెప్పాలి. ప్రతి ప్రదర్శనలోనూ శాస్త్రీయ సంగీత పునాదులను, భక్తి గాన ఆవేశాన్ని, జానపద సంగీత సరళతను సమన్వయం చేయడం ఆయన ప్రత్యేకత.

అవార్డులు, పురస్కారాల పరంగా కూడా ఆయన ప్రస్థానం విశేషంగా నిలిచింది. ఇప్పటివరకు 135కు పైగా అవార్డులు అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పేరుతో మూడు సార్లు, ఘంటసాల పేరుతో రెండు సార్లు పురస్కారాలు అందుకోవడం అరుదైన ఘనత. తెలంగాణ రత్న, ప్రతిభారత్న, జాతీయ ఉత్తమ గాయకుడు వంటి బిరుదులు ఆయనకు లభించాయి. నార్త్ ఢిల్లీ కల్చరల్ అకాడమీ జాతీయ స్థాయిలో ఉత్తమ గాయకుడిగా సత్కరించింది. అంతర్జాతీయ స్థాయిలో వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్, జీనియస్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ రికార్డ్‌స్‌లలో ఆయన పేరు నమోదు కావడం ఆయన ప్రతిభకు ప్రపంచవ్యాప్త గుర్తింపును తీసుకొచ్చింది.

సంగీతసేవకు గుర్తింపుగా 2021లో ఢిల్లీ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేసింది. అప్పటి భారత ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు చేతుల మీదుగా డాక్టరేట్ అందుకోవడం ఆయన జీవితంలో చిరస్మరణీయ ఘట్టంగా నిలిచింది. తెలంగాణ గానసంప్రదాయానికి అది ఒక గౌరవ చిహ్నంగా నిలిచింది.భక్తి సంగీత ప్రచారంలో జగదీశ్వర్ శర్మ చేసిన కృషి విశేషం. వినాయక భక్తిగీతాలు, శ్రీరామ భజనలు, ఆంజనేయ స్తోత్రాలు, లక్ష్మీనరసింహ స్వామి కీర్తనలు, జానపద గీతాలు వంటి అనేక సంగీత రూపాలకు ఆయన గాత్రదానం చేశారు. వందకు పైగా ఆడియో ఆల్బమ్‌లలో పాల్గొని ఆధ్యాత్మిక సంగీతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. ముఖ్యంగా ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి వారి మహిమను కీర్తించే గీతాలకు ఆయన గాత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఇటీవల ఉగాది సందర్భంగా హైదరాబాద్ త్యాగరాయ గానసభలో స్వరమాధురి సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయనకు "స్వర్ణ నంది ఉగాది పురస్కారం" ప్రదానం చేశారు. ఇది ఆయనకు లభించిన మూడవ బంగారు నంది పురస్కారం కావడం విశేషం. దాదాపు మూడు దశాబ్దాల సంగీత సేవకు ఇది మరో గుర్తింపుగా నిలిచింది.

ఇలాంటి గాన ప్రస్థానానికి కొనసాగింపుగా 2026 జూన్ 13న హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లోని సరేగా ప్రధాన మందిరంలో నిర్వహించనున్న "పాడుతా తీయగా" ప్రత్యేక సంగీత కార్యక్రమంలో పాల్గొనే అవకాశం ఆయనకు లభించింది. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని సాయంత్రం నాలుగు గంటల నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు జరిగే ఈ కార్యక్రమంలో జగదీశ్వర్ శర్మ ఐదు గీతాలను ఆలపించనున్నారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీనటుడు సుమన్, హాస్యనటుడు బాబూమోహన్, పలువురు సంగీత దర్శకులు, సినీ ప్రముఖులు, సాంస్కృతిక రంగ ప్రముఖులు హాజరుకానుండటం విశేషం.

ఒకప్పుడు బాలుగారి సమక్షంలో తన ప్రతిభను ప్రదర్శించిన గాయకుడు, నేడు బాలుగారి జయంతి వేదికపై ఆయన గీతాలను ఆలపించేందుకు ఎంపిక కావడం సంగీత జీవితంలో అత్యంత గౌరవప్రదమైన ఘట్టంగా చెప్పుకోవాలి. ఇది కేవలం జగదీశ్వర్ శర్మ వ్యక్తిగత విజయమే కాదు; తెలంగాణ సంగీత సంప్రదాయానికి, ధర్మపురి నేల గానవైభవానికి, గ్రామీణ ప్రతిభకు లభించిన గౌరవం కూడా.సంగీతాన్ని ఉపాధిగా కాకుండా ఉపాసనగా భావించిన కళాకారులు అరుదుగా ఉంటారు. డాక్టర్ గుండి జగదీశ్వర్ శర్మ అలాంటి వారిలో ఒకరు. సాధన, శ్రద్ధ, వినయం, భక్తి అనే నాలుగు స్తంభాలపై ఆయన గాన ప్రస్థానం నిలిచింది. అందుకే ఆయన గాత్రం కేవలం పాటగా వినిపించదు; అది ఒక ఆధ్యాత్మిక అనుభూతిగా శ్రోతల హృదయాలను తాకుతుంది. బాలుగారి జన్మదినోత్సవ వేదికపై ఆయన గాత్రం మరోసారి మార్మోగనున్న ఈ సందర్భం తెలుగు సంగీతాభిమానులకు ఆనందదాయకం. భవిష్యత్తులోనూ ఆయన గానసేవ మరింత విస్తరించి, తెలుగు సంగీత సంప్రదాయాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటాలని సంగీత ప్రేమికులు ఆకాంక్షిస్తున్నారు.



# జాతీయం-అంతర్జాతీయం



## 2027 నాటికి ఆ దళాల ఉపసంహరణ



- ఈశాన్య రాష్ట్రాలకు గుడ్ న్యూస్
- అమిత్ షా కీలక ప్రకటన మోదీ సర్కార్ మరో పెద్ద నిర్ణయం

**న్యూఢిల్లీ,జూన్ ,11 (ఎ.ఎం.ఎస్ )** కేంద్రంలోని ఎన్డీఏ కూటమి మరో పెద్ద నిర్ణయం తీసుకోనుంది. ఈశాన్య భారతదేశంలో శాంతిభద్రతలు అదుపుతప్పడంతో సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టం (ఏఎఫ్ఎస్పీఏ)ను కేంద్రం ఏర్పాటు చేసింది. అయితే, ఇటీవల కాలంలో పరిస్థితులు మెరుగు పుడుతుండటంతో 2027 నాటికి ఒకటి లేదా రెండు రాష్ట్రాలను మినహాయించి మిగతా ఈశాన్య రాష్ట్రాల నుంచి ఈ ఏఎఫ్ఎస్పీఏ ఉపసంహరిస్తామంటూ కేంద్ర హోం మంత్రి అమిత్ షా ప్రకటించారు. అస్సాం నాగాలాండ్ సరిహద్దు ప్రాంతాల్లో చమురు, ఖనిజ అన్వేషణకు సంబంధించిన త్రైపాక్షిక అవగాహన ఒప్పందాల సంతకాల కార్యక్రమంలో అమిత్ షా ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. ఈశాన్య రాష్ట్రాల్లో ఏఎఫ్ఎస్పీఏ అమలులో ఉన్న ప్రాంతాలు క్రమంగా తగ్గిపోవడం అక్కడ శాంతి నెలకొంటుంది అని చెప్పడాన్ని సూచిస్తుందని అమిత్ షా అన్నారు. ఒకటి లేదా రెండు రాష్ట్రాలను మినహాయిస్తే వచ్చే ఏడాదిలో మొత్తం ఈశాన్య ప్రాంతం నుంచి సాయుధ దళాలను తొలగించగలమనే నమ్మకం ఉందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు.

అస్సాం నాగాలాండ్ సరిహద్దుల్లోని వివాదాస్పద ప్రాంతాల్లో చమురు, సహజ వాయుదు, ఇతర ఖనిజాల అన్వేషణ కోసం కేంద్ర ప్రభుత్వం అస్సాం ప్రభుత్వం నాగాలాండ్ ప్రభుత్వం మధ్య ఒప్పందం కుదిరింది. మూడు దశాబ్దాలుగా అంతర్గత సమస్యలతో ఈ ప్రాంతంలో అన్వేషణలు జరగలేదు.. అయితే, తాజా ఒప్పందంతో ఆ అడ్డంకులు తొలగిపోయాయని షా పేర్కొన్నారు.

ప్రస్తుతం ఈ ప్రాంతంలో రోజుకు వెయ్యి నుంచి 1500 బ్యారెళ్ల చమురు ఉత్పత్తి సామర్థ్యం ఉండగా.. ఈ ఒప్పందంతో అది దాదాపు పది రెట్లు పెరిగే అవకాశం ఉందని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు. ఇన్నాళ్ల పాటు భద్రతా సమస్యల కారణంగా ఈ ప్రాంతంలో చమురు, సహజ వాయువుతో పాటు ఖనిజ నిల్వలు ఉన్నా వినియోగించుకోలేక పోయామన్నారు. ఒక్క చమురు క్షేత్రం నుంచే రూ. 15 వేల కోట్లకు పైగా విలువైన నిల్వలను వెలికి తీయవచ్చని అమిత్ షా స్పష్టం చేశారు. నాగాలాండ్‌లో చమురు నిల్వలను వినియోగించగలిగితే విదేశీ చమురుపై ఆధారపడాల్సిన అవసరం లేదని అమిత్ షా పేర్కొన్నారు.



## మళ్లీ కావేరి జలాల రగడ

- తమిళనాడు-కర్నాటక మధ్య డిష్యూం.. డిష్యూం...
- ప్రధానికి సీఎం డీకే వినతి

**న్యూఢిల్లీ,,జూన్ , 12 (ఎ.ఎం.ఎస్)**

కర్ణాటక తమిళనాడు మధ్య రైవల్రీ అంటే ముందుగా గుర్తొచ్చేది కావేరీ జలాల వివాదం. ఆ వివాదం ఎంత విధ్వంసాన్ని సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. కావేరీ జలాల ప్రస్తావన వస్తే ఇరు రాష్ట్రాల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితులకు తీసుకొచ్చింది. తాజాగా కర్ణాటక నూతన ముఖ్యమంత్రి డీకే శివకుమార్ మేకేదాటు ప్రాజెక్టుకు కేంద్రం త్వరగా అనుమతులు ఇవ్వాలని కోరుతూ ప్రధాని నరేంద్ర మోదీకి లేఖ రాశారు. కర్ణాటక సీఎం నిర్ణయాన్ని తమిళనాడు ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. మేకేదాటు ప్రాజెక్టు విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా జోక్యం చేసుకుని ఆమోద ప్రక్రియను వేగవంతం చేయాలంటూ సీఎం డీకే శివకుమార్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఢిల్లీలో ప్రధాని మోదీని కలిసిన ముఖ్యమంత్రి డీకే, మేకేదాటు ప్రాజెక్టుతో పాటు కర్ణాటకకు సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులపై చర్చించారు.ప్రధాన మంత్రికి ఇచ్చిన లేఖలో తమిళనాడు దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌ను సుప్రీం కోర్టు తిరస్కరించిన విషయాన్ని కూడా డీకే ప్రస్తావించారు. దీంతో ఇప్పుడు నిర్ణయం తీసుకోవాల్సిన పూర్తి బాధ్యత కేంద్రంపైనే ఉందని ఆయన పేర్కొన్నారు. మేకేదాటు ప్రాజెక్టుపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం కావేరీ వాటర్ మేనేజ్‌మెంట్ అథారిటీ, సెంట్రల్ వాటర్ కమిషన్‌కే ఉందని గుర్తు చేశారు. మేకేదాటు రిజర్వాయర్ నిర్మాణం ద్వారా బెంగళూరుకు తాగునీటి సరఫరా మెరుగుపరచాలని కర్ణాటక ప్రభుత్వం చూస్తోంది. దాంతో పాటు 400 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, భవిష్యత్ రాష్ట్ర ప్రజల నీటి అవసరాలు తీర్చడం వంటి లక్ష్యాలను కర్ణాటక ప్రభుత్వం పేర్కొంటోంది. ఈ ప్రాజెక్టుతో తమిళనాడుకు కేటాయించిన కావేరీ జలాల్లో ఎలాంటి కోత ఉండదని కూడా కర్ణాటక హామీ ఇస్తోంది. అయితే, తమిళనాడు ప్రభుత్వం మాత్రం ఈ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. కావేరీ జలాల పంపిణీపై కచ్చితంగా ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తోంది. గత నెలలో తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ కూడా మోదీకి లేఖ రాసి ప్రాజెక్టుపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు.

## ఎవరికీ అర్థంగాని ట్రంప్

- అకస్మాత్తుగా ప్లేట్ ఫిరాయింపు
- ఇరాన్‌పై బాంబులు కురిపిస్తామంటూ హెచ్చరిక.. అంతలోనే రాజీ...
- అమెరికాకు ఇరాన్ ట్విస్టుల మీద ట్విస్టులు

**న్యూయార్క్ వుదయం డెస్క్,**



ఇరాన్‌పై రాత్రికి రాత్రే బాంబుల వర్షం కురిపిస్తామని స్టేట్‌మెంట్ ఇచ్చిన గంటల్లోనే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్లేటు ఫిరాయించారు. అమెరికా ఇరాన్ మధ్య శాంతి ఒప్పందం ఈ వారంలోనే కుదిరే అవకాశం ఉందని ప్రకటించారు. ఈ ఒప్పందం అమలులోకి వస్తే ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధి మళ్లీ తెరుచుకునే అవకాశం ఉందని తెలిపారు. ట్రంప్ శాంతి ఒప్పందం గురించి చెప్పగా.. ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని ఇరాన్ స్పష్టం చేసింది. అమెరికా అపాచీ హెలికాప్టర్ కూల్చివేత తర్వాత ఇరు దేశాల మధ్య యుద్ధమేఘాలు అలముకున్నాయి. ఇరాన్‌తో పాటు హోర్ముజ్ జలసంధిలోని పలు నౌకలపై అమెరికా మిస్సైల్ దాడులు చేసింది. గురువారం రాత్రి ఇరాన్‌పై భారీ దాడులు చేస్తామని చెప్పిన ట్రంప్.. కొద్దిసేపటికే వైమానిక దాడులు రద్దు చేశామని ప్రకటించారు. ఇరాన్ అత్యున్నత నాయకత్వ స్థాయిలో చర్చలు జరిపి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అమెరికా, ఇజ్రాయిల్, సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్, టర్కీ, పాకిస్థాన్, బహ్రెయిన్, కువైట్, జోర్డాన్, ఈజిప్ట్ దేశాలు ఈ ఒప్పందానికి మద్దతు ఇస్తున్నాయని ట్రంప్ పేర్కొన్నారు. అయితే ఈ ఒప్పందం అధికారికంగా ఖరారయ్యే వరకూ హోర్ముజ్ జలసంధిపై ఆంక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు.శాంతిరాగం ఆలపించే ముందు ఇరాన్ వైమానిక, నౌకాదళ, రాడర్ రక్షణ సామర్థ్యాలు దాదాపు నిర్వీర్యం చేశామంటూ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ప్రధాన చమురు ఎగుమతి కేంద్రమైన ఖార్గ్ దీవితో పాటు మిగతా ఇంధన నిక్షేపాల ఎగుమతులపై నియంత్రణ సాధిస్తామని చెప్పారు. అదే సమయంలో ఇరాన్ దక్షిణ హోర్ముజ్గాన్ ప్రావిన్స్‌లోని సిరిక్ తీర ప్రాంతం వద్ద గురువారం పేలుడు సంభవించినట్లు ఇరాన్ ప్రభుత్వ మీడియా తెలిపింది. ఇరాన్‌తో యుద్ధ సమయంలో అమెరికా భారతీయ నౌకలను టార్గెట్ చేస్తూ వచ్చింది. ఇప్పటి వరకు మూడు నౌకలపై దాడి చేసింది. దీన్ని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ కూడా తీవ్రంగా ఖండించింది.

మొత్తానికి ట్రంప్ శాంతి ఒప్పందం కుదురుతుందని ప్రకటించినప్పటికీ ఇరాన్ ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు.

## అమెరికా బ్యాంకుకు భారత సంతతి వ్యాపారవేత్త

- రూ.950 కోట్ల మేర టోకరా అదుపులోకి తీసుకున్న పోలీసులు
- చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ్డారంటూ ఆరోపణలు

**న్యూయార్క్ వుదయం డెస్క్,**



అమెరికాలో ఇన్సూరెన్స్ పాలసీల టైటిల్ రికార్డ్స్ తారుమారుచేసి, ఓ బ్యాంకు నుంచి దాదాపు 100 మిలియన్ డాలర్లు (భారత కరెన్సీలో రూ.954.2 కోట్లు) మోసపూరితంగా దోచేసిన భారత సంతతికి చెందిన వ్యాపారవేత్తను అదుపులోకి తీసుకున్నారు. భారత సంతతి వ్యాపారవేత్త 44 ఏళ్ల మహేందర్ మఖిజానిని బుధవారం ఉదయం న్యూపోర్ట్ బీచ్‌లోని అతడి విలాసవంతమైన భవనంలో బుధవారం ఉదయం అమెరికా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ కేసులో ఆరోపణలు రుజువైతే అతడికి గరిష్ఠంగా 30 ఏళ్ల జైలు శిక్ష పడే అవకాశం ఉంది. భారతీయ పౌరుడైన మఖిజానీ గ్రీన్ కార్డుపై అమెరికాలో నివాసం ఉంటున్నారు. ఆర్థిక మోసాలకు పాల్పడటమే కాదు.. సాయుధ అనుచరులతో హోటళ్లు, రెస్టారెంట్లను స్వాధీనం చేసుకోవడం, సెక్స్, డ్రగ్ పార్టీలు నిర్వహించడం వంటి పలు చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడినట్లు కూడా ఆయనపై ఆరోపణలు ఉన్నాయి. కాలిఫోర్నియా సెంట్రల్ డిస్ట్రిక్ట్ ఫస్ట్ అసిస్టెంట్ యూఎస్ అటార్నీ బిలాల్ ఎస్సాయిలీ మాట్లాడుతూ.. కరోనా డెల్ మార్ ప్రాంతంలో నివాసం ఉంటోన్న భారతీయ పౌరుడైన మహేందర్ మఖిజానీ ఒక బ్యాంకును దాదాపు 100 మిలియన్ డాలర్ల మేర మోసం చేసినట్లు వచ్చిన ఫిర్యాదు ఆధారంగా అరెస్ట్ చేశారని చెప్పారు. అమెరికా ఇంటర్నల్ రెవెన్యూ సర్వీస్ ప్రకారం.. టైటిల్ ఇన్సూరెన్స్ రికార్డులను మఖిజానీ తారుమారుచేసి, అసలైన లీన్ పొజిషన్లు (ఆస్తిపై హక్కుదారులు) దాచిపెట్టాడు. ఫెడరల్ ఇన్సూరెన్స్ ఉన్న బ్యాంకును తప్పుదోవ పట్టించడానికి షెల్ కంపెనీల నెట్‌వర్క్‌ను ఉపయోగించాడు. ''మా ప్రత్యేక ఏజెంట్లు వివిధ ఖాతాల ద్వారా జరిగిన లావాదేవీలను నిశితంగా పరిశీలించి కుట్రను ఛేదించారు.. తమ వ్యక్తిగత లాభం కోసం ఇలాంటి మోసాలకు పాల్పడిన వ్యక్తులను వదిలిపెట్టేది లేదు..'' అని ఐఆర్ఎస్ క్రిమినల్ ఇన్వెస్టిగేషన్ లాస్ ఏంజిల్స్ ఫీల్డ్ ఆఫీస్ యాక్టింగ్ స్పెషల్ ఏజెంట్ ఇంఛార్జ్ డారెన్ లియాన్ అన్నారు.

### సుప్రీంలో మీనాక్షి

# పిటిషన్ తిరస్కరణ

- తెలంగాణలో ఆమెపై కేసు నమోదయ్యిందంటూ ఆరోపణ ఆర్‌వో నిర్ణయంలో జోక్యం చేసుకోలేమన్న న్యాయస్థానం
- నిరాశలో ఏఐసీసీ, కాంగ్రెస్ శ్రేణులు



**న్యూఢిల్లీ,,జూన్ ,12 (ఎ.ఎం.ఎస్)**

రాజ్యసభకు మధ్యప్రదేశ్ నుంచి తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కరణకు గురైన సంగతి తెలిసిందే. ఆమెపై తెలంగాణలో నమోదైన కేసు వివరాలను నామినేషన్ పత్రాల్లో వెల్లడించలేదని బీజేపీ ఫిర్యాదు చేసింది. దీంతో ఆమె నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించారు. దీంతో ఆమె సుప్రీం కోర్టుకు వెళ్లగా.. అక్కడా నిరాశ తప్పలేదు. ఆర్వో నిర్ణయంలో తాము కల్పించుకోలేమని సుప్రీం కోర్టు ధర్మాసనం తెలిపింది.

దీనిపై ఈసీకి ఫిర్యాదు చేయాలని సూచించింది.తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి మీనాక్షి నటరాజన్ కు సుప్రీంకోర్టులోనూ ఊరట దక్కలేదు. మధ్యప్రదేశ్ నుంచి తన రాజ్యసభ నామినేషన్‌ను తిరస్కరించడాన్ని సవాల్ చేస్తూ ఆమె దాఖలు చేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం కొట్టివేసింది. రిటర్నింగ్ అధికారి నిర్ణయంలో తాము జోక్యం చేసుకోలేమని ఈ మేరకు స్పష్టం చేసింది. మీనాక్షి నటరాజన్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ అతుల్ ఎస్.చందూర్కర్‌ల ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. సీనియర్ లాయర్, కాంగ్రెస్ నేత అభిషేక్ మను సింఘ్వీ ఆమె తరఫున హాజరై వాదనలు వినిపించారు.ఎలాంటి క్రిమినల్ కేసులు ఆమెపై లేవని, కేవలం సమన్లు మాత్రమే జారీ అయ్యాయని వివరించారు. ఈ వాదనలు విన్న ధర్మాసనం... ఆర్వో నామినేషన్ తిరస్కరణ విషయంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది. అంతేకాదు, గతంలో ఇటువంటి తీర్పులు ఏమైనా ఉంటే న్యాయస్థానం ముందు ఉంచాలని సూచించింది. అభ్యర్థి నామినేషన్‌ను రిటర్నింగ్ అధికారి తిరస్కరిస్తే.. ఎన్నికల సంఘాన్ని ఆశ్రయించడమే సరైందని పేర్కొంది. అవసరమైతే హైకోర్టుకు వెళ్లాలని ధర్మాసనం తెలిపింది. అనంతరం పిటిషన్ విచారణకు అర్హత లేదంటూ కొట్టివేసింది. తెలంగాణలో నమోదైన కేసు వివరాలను మీనాక్షి తన అఫిడ్‌విట్‌లో వెల్లడించలేదని పేర్కొంటూ ఆమె నామినేషన్‌ను ఆర్వో తిరస్కరించిన సంగతి తెలిసిందే.రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి అరవింద్ శర్మ జారీ చేసిన ఒక ఉత్తర్వులో అందుబాటులో ఉన్న పత్రాలను పరిశీలించిన మీదట మీనాక్షి నటరాజన్ తన నామినేషన్‌తో పాటు సమర్పించిన ఫారం 26లో కోర్టు ఫిర్యాదును చేర్చకుండా అసంపూర్ణ అఫిడవిట్‌ను సమర్పించినట్లు తేలిందని పేర్కొన్నారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ అధికారి ఒకరు మాట్లాడుతూ.. తెలంగాణలో తనపై నమోదైన కేసును నటరాజన్ తన అఫిడవిట్‌లో ప్రస్తావించలేదని ఆరోపిస్తూ, అధికార బీజేపీ అభ్యర్థి మహేష్ కేవత్ రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు.మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్ తిరస్కరణ భారత రాజకీయాల్లో అపూర్వమైన పరిణామమని,

దేశంలో ప్రజాస్వామ్య స్థితిపై ఆందోళనలు రేకెత్తిస్తున్నాయని మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు జితు పట్వారీ ఆరోపించారు. ''భారత రాజకీయాల్లో రాజ్యసభ నామినేషన్‌ను రద్దు చేసిన మొట్టమొదటి కేసు, ఇటువంటి మొదటి సంఘటన ఇది. ప్రస్తుతం ఇది దేశంలో చర్చనీయాంశంగా మారింది. ఈ దేశంలో ప్రజాస్వామ్యం నిలబడుతుందా? లేక దేశం నిరంకుశత్వం, నియంతృత్వం వైపు పయనిస్తోందా? అనే భావన సామాన్య ప్రజల మనసుల్లో బలంగా నాటుకుపోయింది. ఈ మొత్తం ఆలోచనా సరళిని ప్రతిబింబించే ఒక ముఖ్యమైన సంఘటన ఇది'' అని విలేకరుల సమావేశంలో పట్వారీ అన్నారు.

## ఇప్పటికే జీవిత ఖైదు

**దక్షిణ కొరియా వుదయం డెస్క్,**



అయినా మరోసారి 30 ఏండ్ల జైలు శిక్ష
దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ దుస్థితి

దేశంలో మార్షల్ లా విధించిన కేసులో దక్షిణ కొరియా మాజీ అధ్యక్షుడు యూన్ సుక్ యేల్ ఇప్పటికే జీవిత ఖైదు అనుభవిస్తున్నారు. కాగా 2024 అక్టోబర్‌లో ఉత్తర కొరియాలోకి డ్రోన్లు పంపినందుకు గాను ఆయనకు మరో 30ఏళ్లు జైలు శిక్ష విధిస్తున్నట్లు దక్షిణ కొరియాలోని కోర్టు తీర్పు వెలువరించింది. కిమ్ సేనను రెచ్చగొట్టేందుకే ఆయన ఈ మేరకు ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొంది. చట్టవిరుద్ధంగా పార్లమెంటును తన గుప్పిట్లోకి తీసుకునేందుకు, నేతలను అరెస్టు చేసేందుకు, అనియంత్రిత అధికారాన్ని చెలాయించేందుకు ఆయన విధించిన 'మార్షల్ లా' విఫలమవడంతో ఓ సాకు సృష్టించుకోవడానికి ఈ చర్యలకు పాల్పడినట్లు వెల్లడించింది. యూన్‌తో పాటు, ఆయన మాజీ రక్షణ మంత్రి కిమ్ యోంగ్ హ్యూన్, డిఫెన్స్ కౌంటర్ ఇంటెలిజెన్స్ కమాండ్ మాజీ అధిపతి యో ఇన్ హ్యూంగ్, డ్రోన్ ఆపరేషన్స్ కమాండ్స్ మాజీ అధిపతి కిమ్ యోంగ్‌డేలను న్యాయస్థానం దోషులుగా నిర్ధరించింది. వారికి కూడా జైలు శిక్ష విధించింది. అత్యవసర పరిస్థితిని సృష్టించడం కోసం ఉత్తర కొరియాను రెచ్చగొట్టడానికి నిందితులు సైనిక చర్య అనే ముసుగును ఉపయోగించారని విమర్శించింది. అయితే చెత్త బెలూన్లను తమ దేశంపై ప్రయోగించి.. తమను రెచ్చగొట్టడానికి యత్నించిన ఉత్తర కొరియాకు తగిన బుద్ధి చెప్పడానికే మాజీ అధ్యక్షుడు ఆ దేశంలోకి డ్రోన్లను పంపారని ఆయన తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలియజేశారు.

ప్రతిపక్షాలు దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నాయని ఆరోపిస్తూ 2024 డిసెంబరులో అధికారంలో ఉన్న అధ్యక్షుడు యూన్ సుక్ యోల్ దేశంలో 'మార్షల్ లా' విధించారు. వారి నుంచి దేశానికి రక్షణ కల్పించడానికే ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావడంతో గంటల వ్యవధిలోనే ఆ ప్రకటనను విరమించుకున్నారు. ఈ పరిణామాల నేపథ్యంలో అభిశంసనకు గురై పదవిని కోల్పోయారు. ప్రస్తుతం ఆయన జైల్లో ఉన్నారు.

## అమెరికా యుద్ధ కాంక్షకు తెలుగోడు బలి

- ఒమన్ తీరంలో విశాఖ వాసి పట్నాల సురేశ్ దుర్మరణం
- మరో ఇద్దరు నావికులూ కన్నుమూత

**దుబాయ్ వుదయం డెస్క్,**



అమెరికా దుందుడుకుతనంతో పశ్చిమాసియాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఆ దేశ నౌకాదళం దాడి చేయడంతో ఒమన్ తీరంలో బుధవారం గల్లంతైన ముగ్గురు భారతీయ నావికులు మృతిచెందారు. వారిలో ఒకరిని ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్నానికి చెందిన పట్నాల సురేశ్‌గా గుర్తించారు. ఒమన్ తీరంలోనే 20 మంది భారతీయులతో ఉన్న మరో ట్యాంకర్‌పై అమెరికా గురువారం దాడి చేసింది. అయితే వారందరూ ప్రాణాలతో బయటపడ్డారు. ఒమన్ తీరానికి చేరువలో భారతీయ నావికులున్న నౌకలపై 4 రోజుల్లో అమెరికా నౌకాదళం చేసిన మూడో దాడి ఇది పలావు పతాకంతో వెళ్తున్న ఎంటీ సెటెబెల్ అనే ట్యాంకర్‌పై అమెరికా బలగాలు బుధవారం దాడి చేయడంతో.. అందులోని 24 మంది భారతీయ నావికుల్లో ముగ్గురు గల్లంతైన సంగతి తెలిసిందే. ఆ ముగ్గురూ మరణించినట్లు కేంద్ర ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల మంత్రి సర్బానంద సోనోవాల్ గురువారం ధ్రువీకరించారు. మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. మృతులను చీఫ్ ఇంజినీర్ పట్నాల సురేశ్, డెక్ క్యాడెట్ ఆదిత్య శర్మ (హిమాచల్ ప్రదేశ్), ఇంజిన్ ఫిట్టర్ శివానంద్ చౌరాసియా (ఉత్తర్‌ప్రదేశ్)లుగా గుర్తించారు. ఒమన్‌లోని షినాస్ ఓడరేవు సమీపంలో 20 మంది భారతీయ సిబ్బందితో ప్రయాణిస్తున్న 'ఎంటీ జల్‌వీర్' నౌకపై అమెరికా నౌకాదళం గురువారం దాడి చేసింది. ఈ ఘటనలో ఎవరికీ ప్రాణహాని జరగలేదు. ఒమన్ అధికారుల సహాయంతో 20 మందినీ సురక్షితంగా తీరానికి చేర్చినట్లు మస్కట్‌లోని భారతీయ రాయబార కార్యాలయం తెలిపింది. 'ఎంటీ జల్‌వీర్' గినియాబిసావు పతాకంతో ప్రయాణిస్తోంది. తమ బలగాలు పదేపదే చేసిన సూచనలను సిబ్బంది పాటించలేదని.. అమెరికా దాడి చేసిన మూడు నౌకల్లో రెండు.. ఆ దేశ ఆంక్షలకు లోబడే కార్యకలాపాలు కొనసాగించినట్లు విదేశీ వ్యవహారాల శాఖ స్పష్టం చేసింది. ఒక్కటి మాత్రమే ఆంక్షలకు అనుగుణంగా నడుచుకోని కేటగిరీలో ఉందని పేర్కొంది. విదేశీ వ్యవహారాల శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ దిల్లీలో విలేకర్లతో మాట్లాడుతూ ఈ విషయాల్ని వెల్లడించారు. దాడులను వెంటనే ఆపేయాలని.. చర్చలు, దౌత్యంతో పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పే ప్రయత్నాలు చేయాలని ఆయన పిలుపునిచ్చారు. గల్ఫ్ ప్రాంతంలో 18 వేల మందికిపైగా భారతీయ నావికులు ఉన్నారని ఓడరేవులు, షిప్పింగ్, జలమార్గాల శాఖ అదనపు కార్యదర్శి ముకేశ్ మంగళ్ తెలిపారు. వారిలో 562 మంది.. భారతీయ పతాకంతో ఉన్న 13 నౌకల్లో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. పశ్చిమాసియాలో వాణిజ్య నౌకలపై దాడులను భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. ఈ దాడుల కారణంగా పలువురు భారతీయులు మృతి చెందారని, గల్లంతయ్యారని ఆందోళన వ్యక్తం చేసింది. 'అంతర్జాతీయ శాంతి, భద్రతలు పశ్చిమాసియాలో రాజకీయ పరిష్కారాలు' అనే అంశంపై భద్రతా మండలి బుధవారం నిర్వహించిన సమావేశంలో.. ఐక్యరాజ్య సమితి భారత శాశ్వత ప్రతినిధి పర్వతనేని హరీశ్ ఈ అంశాన్ని లేవనెత్తి మాట్లాడారు. గల్ఫ్‌లో దాదాపు కోటి మంది భారతీయులు ఉపాధి పొందుతున్నారని గుర్తుచేశారు. వారి భద్రత,

సంక్షేమం భారత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యాంశమని ఉద్ఘాటించారు.

# ఐఆర్‌సీటీసీ కొత్త వెబ్‌సైట్

రైల్వే ప్రయాణికులకు గుడ్ న్యూస్ • ఇక తత్కాల్ బుకింగ్‌కి నో టెన్షన్




**న్యూఢిల్లీ ,జూన్ ,12 (ఎ.ఎం.ఎస్)**

రైలు ప్రయాణం చేసేవారికి ఆ జర్నీకంటే ముందు టికెట్లు బుక్ అవుతాయా లేదా? తత్కాల్‌లో పరిస్థితి ఏంటి అన్న టెన్షనే ఎక్కువ. ఇకపై ఆ టెన్షన్ ఉండదని రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ భరోసా ఇచ్చారు. రైలు టికెట్ బుకింగ్‌లో ప్రయాణికులు ఎదుర్కొంటున్న సమస్యలకు త్వరలోనే పరిష్కారం లభించనుందని, జూలై 15 నాటికి కొత్త ఫీచర్లతో కూడా ఐఆర్‌సీటీసీ వెబ్ సైట్‌ను అందుబాటులోకి తీసుకు రానున్నట్లు ఆయన ప్రకటించారు.రాజస్థాన్‌లోని జైపూర్‌లోని మాళవీయా నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థులతో రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో తరచూ ఎదురయ్యే క్యాప్చా సమస్యపై ఫిర్యాదు చేయడంతో.. ఆయన జూలై 15 నుంచి ఇక ఆ సమస్య ఉండదని, కొత్త వెబ్ సైట్‌ని లాంచ్ చేస్తున్నట్లు ప్రకటించారు.ఇన్‌స్టిట్యూట్ విద్యార్థి ఐఆర్‌సీటీసీ క్యాప్చా సమస్యను పరిష్కరించండి సార్ అంటూ మంత్రిని కోరాడు. దాంతో మంత్రి వెంటనే అక్కడ నుంచే సంబంధిత అధికారికి ఫోన్ చేసి "విద్యార్థులంతా కొత్త ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్ కావాలని కోరుతున్నారు. 30 రోజుల్లో కొత్త వెబ్‌సైట్ సిద్ధం చేయగలమా?" అని అధికారిని కోరారు. ఆ వెంటనే జూలై 15 నాటికి కొత్త వెబ్‌సైట్ ప్రారంభిస్తామని ప్రకటించడంతో విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌లో ప్రయాణికులు చాలా కాలంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అంశాలలో ప్రధానమైనది తత్కాల్ టికెట్ బుకింగ్ సమయంలో సర్వర్ డౌన్ అవడం. అదేవిధంగా వెబ్‌సైట్ క్రాష్ కావడం, ఓటీపీలు ఆలస్యంగా రావడం.. ఒకేసారి ఎక్కువ మంది బుక్ చేసుకోవడం వల్ల ఇబ్బందులు ఎదరవుతూ ఉన్నాయి. కొత్త వెబ్‌సైట్‌తో ఈ సమస్యలన్నీ తొలగిపోతాయని మంత్రి భరోసా ఇచ్చారు.ఇండియన్ రైల్వేలో 2002లో ఆన్‌లైన్ సేవలు ప్రారంభించారు. అప్పటి నుంచి డిజిటల్ టికెట్ బుకింగ్ సేవలు పెరిగాయి. 88 శాతం బుకింగ్‌లు ఆన్‌లైన్ ద్వారానే జరుగుతున్నాయి. కొన్ని లోటుపాట్లను కూడా పరిశీలించిన రైల్వే శాఖ గతేడాది జూలై నుంచి తత్కాల్ టికెట్లను బుక్ చేయాలంటే ఆధార్ తప్పనిసరి చేసింది. ఇటీవల రైళ్లలో ఆహార నాణ్యతను పర్యవేక్షించేందుకు ఏఐ ఆధారిత వ్యవస్థను అమలు చేసింది.మొత్తానికి రైల్వే శాఖ ఐఆర్‌సీటీసీతో పాటు రైళ్లలో చిన్న చిన్న సమస్యలను అప్డేట్ చేసుకుంటూ మెరుగైన సేవలు అందించేందుకు ప్రయత్నిస్తోంది. జూలై 15 నుంచి కొత్త వెబ్ సైట్‌తో ప్రయాణికులకు ఇంకాస్త మెరుగైన సేవలు అందే అవకాశం ఉంది.

# బెంగాల్ ప్రభుత్వ భవనంలో ప్రమాదం

**4 వేల ఈవీఎంలు అగ్నికి ఆహుతి**
**కలకత్తా జూన్ ,12 (ఎ.ఎం.ఎస్)**



పశ్చిమ బెంగాల్‌లో జరిగిన ఓ అగ్ని ప్రమాదంలో ఇటీవల ఎన్నికల్లో ఉపయోగించిన 4 వేల ఈవీఎంలు కాలిబూడిదయ్యాయి. వాటిని భద్రపరిచిన ఓ ప్రభుత్వ భవనంలో బుధవారం భారీ అగ్ని ప్రమాదం సంభవించినట్లు బెంగాల్ మంత్రి కౌశిక్ చౌధురీ వెల్లడించారు. కోల్‌కతాలోని అలీపుర్ ప్రాంతంలో ఉన్న 9 అంతస్తుల భవనంలో ప్రభుత్వ విభాగాలతోపాటు సౌత్ 24 పరగణాల జిల్లా పరిషత్ ఆఫీసు కూడా ఉంది. 24 గంటల పాటు శ్రమించి అతికష్టమ్మీద మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు సమాచారం.ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి కౌశిక్ మీడియాతో మాట్లాడుతూ.. ''ఈ ఘటనలో దాదాపు 4,000 ఈవీఎంలు దగ్ధమయ్యాయి.. ఇటీవలి జరిగిన అసెంబ్లీ ఎన్నికల సమయంలో 10 నియోజకవర్గాల్లో ఈ ఈవీఎంలను వినియోగించారు.. ఇది సాధారణ ప్రమాదంలా కనిపించడం లేదని, ఏదైనా కుట్ర ఉందా? అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నాం.. రెండు, మూడు అంతస్తుల్లో మొదలైన మంటలు మధ్యలో ఉన్నవాటికి అంటుకోలేదు.. కానీ, ఎనిమిది, తొమ్మిదో అంతస్తులకు వ్యాపించడంపై అనుమానం ఉంది.. వాటికి మంటలు ఎలా వ్యాపించాయో స్పష్టంగా తెలియరాలేదు. పూర్తిస్థాయి విచారణ కొనసాగుతోంది.. ఫోరెన్సిక్ నివేదిక తర్వాత ప్రమాదంపై స్పష్టత వస్తుంది'' అని చెప్పారు. గురువారం ఉదయం మంటలు కనిపించనప్పటికీ, అక్కడక్కడా చిన్న చిన్న మంటలు చెలరేగే అవకాశాన్ని కొట్టిపారేయలేమని అధికారులు తెలిపారు. ''భవనం లోపల అక్కడక్కడా మంటలు చెలరేగుతున్నాయి, వాటిని ఆర్పివేయాలి.. నీటితో చల్లబరిచే ప్రక్రియ కొనసాగుతోంది'' అగ్నిమాపక శాఖ అధికారి తెలిపారు. దక్షిణ 24 పరగణాల జిల్లా కలెక్టర్ ఫిర్యాదుతో అలీపూర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కాగా, ఈ అగ్ని ప్రమాదం వెనుక కుట్రకోణాన్ని కొట్టిపారేయలేమని కేంద్ర మంత్రి సుకాంత మజుందార్ వ్యాఖ్యానించారు. ఇది పక్కా ప్లాన్‌తో జరిగిందని బీజేపీ నాయకుడు రాకేశ్‌సింగ్ ఆరోపించారు. ఈ ఆరోపణలను బలపరిచే ఎలాంటి ఆధారాలు ఇప్పటివరకు బయటపడలేదు.ఫోరెన్సిక్, శాస్త్రీయ ఆధారాలతోనే దీనిపై నిర్ధారణకు వస్తామని దర్యాప్తు బృందాలు పేర్కొన్నాయి. భవనంలో ఉన్న ప్రభుత్వ రికార్డులు, భద్రతా వ్యవస్థలు, మౌలిక సదుపాయాలకు వాటిల్లిన నష్టాన్ని కూడా అధికారులు అంచనా వేస్తున్నారు.అగ్నిప్రమాదానికి విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ లేదా మరేదైనా ఇతర కారణమా? దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటివరకు ఎలాంటి నిర్దిష్ట కారణం తేలలేదని అధికారులు తెలిపారు. పలు అంతస్తులకు మంటలు ఏ రీతిలో వ్యాపించాయనే దానిపై దర్యాప్తు అధికారులు దృష్టి సారించారు. భవనాన్ని సీల్ చేసి, దాని చుట్టూ పోలీసులు నిఘాను పెంచారు. ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి నమూనాలను సేకరించే అవకాశం ఉంది. ఈ అగ్నిప్రమాదం ప్రమాదవశాత్తు జరిగిందా లేక ఏదైనా ఉద్దేశపూర్వక చర్య ఫలితమా అని నిర్ధారించడంలో ఫోరెన్సిక్ నివేదికలు కీలకమని అధికారులు తెలిపారు.

# వరంగల్ | ఖమ్మం | నల్లగొండ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## ఏక్ పెడ్ మా కే నామ్" వాల్ పోస్టర్ ఆవిష్కరణ




- విద్యార్థుల్లో పర్యావరణ బాధ్యత పెంపొందించడమే లక్ష్యం. జిల్లా కలెక్టర్ డా. సత్యశారద.

**వరంగల్ జిల్లా జూన్ 12 (వుదయం ప్రతినిధి) :** పర్యావరణ పరిరక్షణ, హరితహారం కార్యక్రమ విస్తరణ, విద్యార్థుల్లో ప్రకృతి పట్ల బాధ్యతాభావం పెంపొందించడమే లక్ష్యంగా తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ (ఎన్‌జీసీ), జిల్లా విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించనున్న "ఏక్ పెడ్ మా కే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటడం) - Sowing to Growing 2026" జాతీయ స్థాయి విద్యార్థి పర్యావరణ పోటీ కార్యక్రమానికి సంబంధించిన వాల్ పోస్టర్‌ను వరంగల్ జిల్లా కలెక్టర్ డా. సత్యశారద ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తన తల్లి పేరుతో ఒక మొక్కను నాటి, దానిని సంరక్షించడం ద్వారా ప్రకృతితో అనుబంధాన్ని పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు. ఏక్ పెడ్ మా కే నామ్" కార్యక్రమం పర్యావరణ పరిరక్షణకు తోడ్పడటమే కాకుండా విద్యార్థుల్లో బాధ్యతాభావం, సేవా దృక్పథం, ప్రకృతి ప్రేమను పెంపొందించే ఉద్యమంగా మారాలని ఆమె ఆకాంక్షించారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు కూడా సమాన ప్రాధాన్యత ఇవ్వాల్సిన అవసరం ఉందని, ప్రతి మొక్కను జీవంగా భావించి కాపాడాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలలు ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా చేపట్టి విద్యార్థులను భాగస్వాములను చేయాలని కోరారు. తెలంగాణ నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ జాతీయ స్థాయి పోటీలో పాఠశాల, కళాశాల విద్యార్థులు, పరిశోధకులు, యువతతో పాటు సాధారణ ప్రజలు కూడా పాల్గొనవచ్చని అధికారులు తెలిపారు. మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, పర్యావరణ అవగాహన కార్యక్రమాల నిర్వహణ వంటి కార్యకలాపాల్లో పాల్గొని, వాటి ఫోటోలు మరియు వివరాలను నిర్దిష్ట పోర్టల్‌లో అప్‌లోడ్ చేయడం ద్వారా పోటీలో పాల్గొనవచ్చని వివరించారు. జిల్లాలో పచ్చదనం పెంపొందించడమే లక్ష్యంగా "హరిత వరంగల్" నిర్మాణానికి ఈ కార్యక్రమం దోహదపడుతుందని అధికారులు పేర్కొన్నారు. ప్రతి విద్యాసంస్థ ఈ కార్యక్రమాన్ని ఉద్యమాత్మకంగా అమలు చేయాలని పిలుపునిచ్చారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థలు ఈ కార్యక్రమంలో విస్తృతంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. పర్యావరణ పరిరక్షణను విద్యార్థుల దైనందిన జీవితంలో భాగంగా మార్చడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి విజయలక్ష్మి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ యూ. సుజన్ తేజ, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. సాంబ శివరావు, ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ డా. కట్ల శ్రీనివాస్, వివిధ శాఖల జిల్లా అధికారులు, మండల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమమే బాట.. అభివృద్ధే లక్ష్యం



**ఖమ్మం, వుదయం బ్యూరో జూన్ 12:** ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటినీ సమన్వయంతో ముందుకు తీసుకెళ్తోందని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.
శుక్రవారం తిరుమలాయపాలెం మండల ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో కల్యాణలక్ష్మి, సి.ఎం. రిలీఫ్ ఫండ్ చెక్కులను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం గత రెండున్నర సంవత్సరాలుగా పేదల సంక్షేమాన్ని ప్రధాన లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తోందన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రేషన్ కార్డుల ద్వారా సన్న బియ్యం పంపిణీ, కొత్త తెల్ల రేషన్ కార్డుల జారీ, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, డైట్ ఛార్జీలను 40 శాతం పెంపు, గురుకులాల్లో కాస్మొటిక్ ఛార్జీలను 200 శాతం పెంపు వంటి పలు సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్నట్లు తెలిపారు.గత ప్రభుత్వం పేదల గృహ నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసిందని, ప్రజా ప్రభుత్వం మొదటి విడతలో 4.5 లక్షల ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందన్నారు. రెండవ విడతలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి మరో 2 వేల ఇళ్లను మంజూరు చేయనున్నట్లు వెల్లడించారు.
రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందజేస్తామని స్పష్టం చేశారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి పేర్కొన్నారు. 25 లక్షల మంది రైతులకు 2 లక్షల వరకు రుణమాఫీ అమలు చేశామని తెలిపారు. రైతు భరోసా సాయాన్ని ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.12 వేలకు పెంచామని చెప్పారురాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశించిన స్థాయిలో లేకపోయినా ప్రజలకు మేలు చేసే ప్రతి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతకు సుమారు 72 వేల ఉద్యోగాలను కల్పించినట్లు వెల్లడించారు.కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీని క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నామని మంత్రి తెలిపారు. గత ఏడాది ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా పేదల వైద్య చికిత్సల కోసం రూ.1,034 కోట్ల సహాయాన్ని అందించామని పేర్కొన్నారు.రాబోయే రెండున్నర సంవత్సరాల్లో కూడా మరిన్ని ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తామని మంత్రి తెలిపారుఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, విద్యుత్ శాఖ ఎస్.ఈ. శ్రీనివాసచారి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి.పుల్లయ్య, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు, లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.




## నిరుద్యోగ మైనారిటీ యువతకు ప్రత్యేక నైపుణ్య శిక్షణ

**నల్గొండ, జూన్ 12 (వుదయం ప్రతినిధి)** తెలంగాణ ప్రభుత్వం మైనారిటీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (TGMFC), తెలంగాణ క్రిస్టియన్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ (TGCMFC) ద్వారా 202627 ఆర్థిక సంవత్సరానికి ఉపాధి ఆధారిత నైపుణ్య శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి టి. విజేందర్ రెడ్డి తెలిపారు. ట్రైనింగ్, ఎంప్లాయ్‌మెంట్ అండ్ ప్లేస్‌మెంట్ పథకం కింద నిరుద్యోగ మైనారిటీ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

ఈ నేపథ్యంలో TASK, EGMM, MEPMA, NSDC, NIMSME లేదా ఇతర ప్రభుత్వ గుర్తింపు పొందిన సంస్థలతో అనుబంధం కలిగి, ఉపాధి కల్పనలో అనుభవం ఉన్న శిక్షణ భాగస్వామ్య సంస్థలు (Training Partners) తమ ప్రతిపాదనలు సమర్పించాలని కోరారు.ఆసక్తి గల సంస్థలు తమ ప్రతిపాదనలను జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయం, నల్గొండకు సమర్పించాలని సూచించారు. పూర్తి వివరాల కోసం జిల్లా మైనారిటీల సంక్షేమ అధికారి కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.

## ప్రగతి బాటలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి సీతక్క

**ములుగు, జూన్ 12 (వుదయం ప్రతినిధి) :** ములుగు జిల్లాను అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి జిల్లాలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, కోట్లాది రూపాయల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.ఇందిరమ్మ ఇళ్ల భూమిపూజ - లబ్ధిదారులకు పత్రాల పంపిణీ : మంత్రి సీతక్క
మల్లంపల్లి మండలంలోని ముద్దునూరు తండ గ్రామంలో రూ.1 కోటి వ్యయంతో మంజూరైన 30 ఇందిరమ్మ ఇండ్ల రెండో విడత నిర్మాణ పనులకు మంత్రి సీతక్క, కలెక్టర్‌తో కలిసి భూమిపూజ నిర్వహించారు.
అనంతరం అర్హులైన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు.సిసి రోడ్లు, ఆలయ కాంపౌండ్ వాల్ ప్రారంభంపంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో రామచంద్రాపురం గ్రామ పరిధిలోని యేసు నగర్‌లో రూ.19 లక్షల సీఆర్ఆర్ నిధులతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్డును, దుర్గామాత టెంపుల్ వరకు రూ.15 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును మంత్రి ప్రారంభించారు. అలాగే, రూ.10 లక్షల డీఎంఎఫ్‌టీ నిధులతో నూతనంగా నిర్మించిన దుర్గామాత దేవాలయం కాంపౌండ్ వాల్‌ను కూడా ఆమె ప్రారంభించారు.
జిల్లా కేంద్రంలోని గడిగడ్డ షెడ్యూల్ కులముల బాలికల వసతి గృహంతో పాటు, కోయగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా శానిటేషన్ డ్రైవ్‌లో మంత్రి, కలెక్టర్ స్వయంగా పాల్గొన్నారు. హాస్టల్‌లోని గదులను, పరిసరాలను పరిశీలించి, విద్యార్థినులకు మెరుగైన వసతులు కల్పించాలని అధికారులను ఆదేశించారు.రైతువేదికలో 'ప్రజా దర్బార్' మల్లంపల్లి మండలంలోని రైతువేదిక ప్రాంగణంలో గుర్తుర్ తండా, కొడిశలకుంట, ముద్దనూరు తండా, రామచంద్రపూర్, భూపాల్ నగర్, శివ తండ గ్రామాల ప్రజల కోసం ప్రత్యేక ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి మంత్రి సీతక్క, కలెక్టర్ స్వయంగా అర్జీలను స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు సూచించారు.ప్రభుత్వ ఆసుపత్రి తనిఖీ






అనంతరం ములుగు ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని సందర్శించిన మంత్రి.. క్రిటికల్ కేర్ విభాగం, డయాలసిస్ యూనిట్, ఎమర్జెన్సీ వార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు.ఈ కార్యక్రమాల్లో డీఎఫ్ఓ వికాస్ మీనా, అదనపు కలెక్టర్లు సిహెచ్ మహేందర్ జి., సంపత్ రావు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ చింతనిప్పుల చంద్రకళ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రేగ కళ్యాణి, ఆర్డీవో కృష్ణవేణి, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, పంచాయతీరాజ్ డైరెక్టర్ బైరెడ్డి భగవాన్ రెడ్డి,
ఆత్మ కమిటీ చైర్మన్ రవీందర్ రెడ్డి, ఆసుపత్రి సూపరిండెంట్ చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, స్థానిక సర్పంచులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

### తాలిపేరు ఎడమ కాలువలో

## అడ్డంకులు తొలగించాలి

**ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి: జిల్లా కలెక్టర్**

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూన్ 12 (వుదయం ప్రతినిధి)** రైతులకు సాగునీరు సకాలంలో అందేలా తాలిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువలో నీటి ప్రవాహానికి అడ్డంకిగా ఉన్న గడ్డి, చెత్త, పూడికను వెంటనే తొలగించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం దుమ్ముగూడెం మండలంలో క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆయన తాళిపేరు ప్రాజెక్టు ఎడమ కాలువతో పాటు దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు.వీరభద్రపురం గ్రామ పరిధిలోని తాళిపేరు ఎడమ కాలువను పరిశీలించిన కలెక్టర్, కాలువ పరిస్థితులు, నీటి ప్రవాహం, ఆయకట్టు వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. తాళిపేరు ప్రాజెక్టు ద్వారా సుమారు 24,700 ఎకరాలకు సాగునీరు అందుతుండగా, ఎడమ కాలువ 46.46 కిలోమీటర్ల పొడవుతో 34 డిస్ట్రిబ్యూటరీల ద్వారా 21,100 ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేస్తున్నట్లు అధికారులు వివరించారు. కాలువలో పేరుకుపోయిన గడ్డి, చెత్త, పూడికను తొలగించి నీటి ప్రవాహానికి ఎలాంటి ఆటంకాలు లేకుండా చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఆయకట్టు చివరి భూముల వరకు సాగునీరు చేరేలా ప్రత్యేక పర్యవేక్షణ నిర్వహించాలని, రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కాలువల నిర్వహణను సమర్థవంతంగా చేపట్టాలని సూచించారు.



అనంతరం దుమ్ముగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అంకిత్, ఆసుపత్రిలోని వివిధ విభాగాలను సందర్శించి వైద్య సేవల నిర్వహణపై సమగ్రంగా ఆరా తీశారు. ఇన్‌పేషెంట్ వార్డును పరిశీలించి చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది హాజరు వివరాలు, సేవల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు.ఫిజికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం వచ్చిన విద్యార్థులతో మాట్లాడి వారి వివరాలు తెలుసుకున్న కలెక్టర్, సర్టిఫికెట్ల జారీ ప్రక్రియపై వైద్యులను అడిగి వివరాలు సేకరించారు. అనంతరం ఔషధ నిల్వల గదిని పరిశీలించి మందుల లభ్యత, నిల్వల పరిస్థితిని తనిఖీ చేశారు. ఇన్‌పేషెంట్, ఔట్‌పేషెంట్ రిజిస్టర్లు, ఇతర వైద్య రికార్డులను కూడా పరిశీలించారు.పాముకాటు, తేలు కాటు వంటి అత్యవసర పరిస్థితులకు అవసరమైన మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పాముకాటుకు గురైన రోగులకు అందించే చికిత్స విధానం, అనుసరించే వైద్య ప్రోటోకాల్‌పై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, రైతులకు సాగునీరు సకాలంలో అందించేందుకు కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని, అలాగే ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే ప్రతి రోగికి నాణ్యమైన, సత్వర వైద్య సేవలు అందేలా వైద్య సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంతో పాటు రైతుల సంక్షేమం కోసం అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు .ఈ కార్యక్రమంలో తహసీల్దార్ అశోక్ కుమార్, ఇరిగేషన్ ఈఈ జానీ, డాక్టర్ రుక్మాకర్ రెడ్డి తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.



## డ్రగ్స్‌కు నో - చదువుకు యస్

**ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో డ్రగ్స్‌కు నో చదువుకు యస్": సూర్యాపేట ఎస్పీ నరసింహ విద్యార్థులకు పిలుపు**

**సూర్యాపేట ,జూన్: 12 వుదయం ప్రతినిధి** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా, సూర్యాపేట జిల్లా పోలీస్ ఆధ్వర్యంలో చివ్వెంల మండలం దురాజుపల్లి వద్ద గల ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో "డ్రగ్స్ నిర్మూలన"పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ, "యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తు నిర్మించుకోవాలి. కష్టపడే వయసులో వ్యసనాలకు అలవాటు పడొద్దు. సమాజానికి సేవ చేసే వనరుగా ఎదగాలి" అని పిలుపునిచ్చారు. డ్రగ్స్ అమ్మకాలపై సమాచారం ఇస్తే వివరాలు గోప్యంగా ఉంచుతామని, బాధితులకు పునరావాసం కల్పిస్తామని తెలిపారు.రోడ్డు ప్రమాదాలు, సైబర్ మోసాలపై కూడా విద్యార్థులకు జాగ్రత్తలు సూచించారు. డ్రగ్స్, గంజాయి నిర్మూలనలో తమ వంతు భాగస్వాములం అవుతామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో రూరల్ సిఐ రాజశేఖర్, చివ్వెంల ఎస్ఐ మహేష్, షీ టీం ఎస్ఐలు మౌనిక, నీలిమ,
కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## గత పాలకులారా.. పదేళ్లలో మీరేం చేశారో చెప్పగలరా?

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి
- రూ.1.25 కోట్లతో 47వ డివిజన్‌లో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన
- రెండేళ్లలోనే డివిజన్ ప్రగతికి రూ.6 కోట్లు ఖర్చు చేశాం
- కాజీపేట ముఖచిత్రం మారుతోంది.. బూత్ కమిటీల ప్రక్రియ వేగవంతం చేయాలి



**హనుమకొండ జూన్ 12 (వుదయం ప్రతినిధి) :** తాము చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ధైర్యంగా ప్రజలకు చెప్పుకుంటున్నామని.. మరి గత పదేళ్ల పాలనలో మీరేం చేశారో చెప్పగలరా? అని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు శ్రీ నాయిని రాజేందర్ రెడ్డి ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు.శుక్రవారం కాజీపేట 47వ డివిజన్ పరిధిలోని డీజిల్ కాలనీ, ఇంపీరియల్ కాలనీలలో రూ.1.25 కోట్ల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని మాట్లాడుతూ
గత పాలకులు ప్రజల మౌలిక అవసరాలను పూర్తిగా విస్మరించారని, ఇప్పుడు వారు అభివృద్ధి గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు.
రెండేళ్లలోనే రూ. 6 కోట్ల అభివృద్ధి: వరంగల్ పశ్చిమ అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని, కేవలం రెండున్నర ఏళ్లలోనే 47వ డివిజన్‌లో రూ.6 కోట్లకు పైగా నిధులతో మౌలిక వసతులు కల్పించామని తెలిపారు.
మారుతున్న కాజీపేట: కాజీపేట ప్రాంతం గతంలో ఎలా ఉండేదో, ఇప్పుడు ఎలా మారుతుందో ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతి కాలనీలో ప్రగతి పనులు వేగంగా సాగుతున్నాయని స్పష్టం చేశారు.పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం:
అనంతరం నిర్వహించిన పార్టీ సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సంస్థాగత బలోపేతానికి బూత్ ఏజెంట్ల నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని నాయకులకు సూచించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఇంటికీ తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో యువ నాయకులు విష్ణువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు జక్కుల రవీందర్, విజయ శ్రీ రజాలి, సీనియర్ నాయకులు అంకుష్, మనోహర్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు సాంబయ్య, డివిజన్ అధ్యక్షులు షేక్ అస్గర్, నాయకులు సిరి లారెన్స్, దొంగల కుమార్, తమ్మడి మానస మధు, ఇప్ప శ్రీకాంత్, దువ్వ రాజులు రేవతి, బర్ల రాజకుమార్, శ్రీనివాస్, అధికారులు పాల్గొన్నారు.

### బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో

## ప్రవేశాలకు దరఖాస్తులు

**జనగామ, జూన్ 12 (వుదయం ప్రతినిధి) :** జనగామ జిల్లాలోని బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో 202627 విద్యా సంవత్సరానికి గాను షెడ్యూల్డ్ కులాల (SC) విద్యార్థుల నుండి ప్రవేశాలకు దరఖాస్తులు కోరుతున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఒక ప్రకటనలో తెలిపారు. 1వ తరగతిలో 15 సీట్లు, 5వ తరగతిలో మిగిలిపోయిన 37 సీట్ల భర్తీకి ఈ నోటిఫికేషన్ విడుదల చేశారు.

**ముఖ్యమైన వివరాలు:**
దరఖాస్తుల ప్రారంభ తేదీ: 15.06.2026 చివరి తేదీ: 22.06.2026 (సాయంత్రం 4:00 గంటల వరకు)ఎంపిక చేసిన పాఠశాలలు: సెయింట్ థామస్ స్కూల్ (శివునిపల్లి), సిద్ధార్థ విద్యాలయం (పాలకుర్తి), జాన్ బ్రిటో హై స్కూల్ (కడవెండి), సెయింట్ పీటర్ ఫౌండేషన్ హైస్కూల్ (నిడిగొండ).

**అర్హతలు:**
కుటుంబంలో ఒకరు మాత్రమే అర్హులు.
తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల వారికి రూ.1,50,000, పట్టణ ప్రాంతాల వారికి రూ.2,00,000 మించకూడదు. వయోపరిమితి: 1వ తరగతి విద్యార్థులు 01.06.2020 31.05.2021 మధ్య, 5వ తరగతి విద్యార్థులు 01.06.2016 31.05.2017 మధ్య జన్మించి ఉండాలి.

**జతచేయాల్సిన పత్రాలు:**
పుట్టిన తేదీ ధృవీకరణ పత్రం, కుల, ఆదాయ, నివాస ధృవీకరణ పత్రాలు (మీసేవా), రేషన్/ఆధార్ కార్డ్ జిరాక్స్, 3 పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలు, గత విద్యాసంవత్సరం మార్కుల జాబితా (5వ తరగతి వారికి).ఆసక్తి గల అభ్యర్థులు జనగామ కలెక్టరేట్‌లోని ఫస్ట్ ఫ్లోర్ (రూమ్ నెం. F25) లో గల జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యాలయం నుండి దరఖాస్తులు పొంది, పూర్తి చేసిన ఫారాలను గడువు లోగా అక్కడే సమర్పించాలని అధికారి సూచించారు.




### మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, కు

## 'గ్రీన్ ఎన్విరో గోల్డ్ అవార్డు

**మేళ్లచెరువు/ హుజూర్నగర్ జూన్ 12 (వుదయం ప్రతినిధి):** పర్యావరణ పరిరక్షణలో విశేష కృషికి గుర్తింపుగా స్థానిక మై హోమ్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, మేళ్లచెరువు సిమెంట్ వర్క్స్ IV కు ప్రతిష్ఠాత్మక "2వ వార్షిక గ్రీన్ ఎన్విరో ఎన్విరాన్మెంట్ అవార్డు 2026 - గోల్డ్ అవార్డు" లభించింది.ఈ అవార్డు అస్సాం రాష్ట్రం గువాహతిలో 12 జూన్ 2026 న గ్రీన్‌ఎన్విరో ఫౌండేషన్ వారు నిర్వహించిన కార్యక్రమంలో ఈ అవార్డును మహారాష్ట్ర సీఎం టాస్క్ ఫోర్స్ ఫర్ ఎన్విరాన్మెంట్ సస్టైనబిలిటీ చైర్మన్ శ్రీ పాషా పటేల్ మరియు 'ఫారెస్ట్ మ్యాన్ ఆఫ్ ఇండియా', పద్మశ్రీ అవార్డు గ్రహీత శ్రీ జాదవ్ పయంగ్ చేతుల మీదుగా యూనిట్ హెడ్ & ప్రెసిడెంట్ (వర్క్స్) శ్రీ ఎన్. శ్రీనివాస రావు స్వీకరించారు.ఈ సందర్భంగా శ్రీ ఎన్. శ్రీనివాస రావు మాట్లాడుతూ "పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసిన పద్మశ్రీ జాదవ్ పయంగ్ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం మాకు ఎంతో స్ఫూర్తిదాయకమని తెలిపారు.

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి. సూర్యచంద్రకళ

**జయశంకర్ భూపాలపల్లి జూన్ 12(వుదయం జిల్లా ప్రతినిధి)** పరిశ్రమలలో పనిచేస్తున్న బాల కార్మికులను గుర్తించి వారి బంగారు భవితను కాపాడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్.వి.పి.సూర్య చంద్రకళ పోలీసు అధికారులకు సూచించారు. బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం ను పురస్కరించుకొని శుక్రవారం పోలీసు అధికారులతో చర్చించారు.
జిల్లాలోని వివిధ పరిశ్రమలలో పని చేస్తున్న బాలలను గుర్తించి వారిని రక్షించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. పారా లీగల్ వాలంటీర్లు, కార్మిక శాఖ, రెవిన్యూ శాఖ అధికారుల సమన్వయంతో విస్తృతంగా అవగాహనా కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడిషనల్ ఎస్పీ ఏ. నరేష్ కుమార్, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏదులాపురం శ్రీనివాస్, డి.ఎస్.పి లు సంపత్ రావు, సూర్యనారాయణ, సి.ఐ లు, ఎస్.ఐ లు పాల్గొన్నారు.



## అడ్మిషన్లు పెంచాలి.. బాలకార్మికతను అరికట్టాలి

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**మహబూబాబాద్ జిల్లా జూన్ 12 వుదయం జిల్లా ప్రతినిధి** శుక్రవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్,* స్త్రీ శిశు సంక్షేమ, ఇంటర్మీడియట్ విద్యా శాఖ లపై సమీక్ష సమావేశం నిర్వహించారు, ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రతీ అంగన్వాడి ప్రాజెక్ట్ లు, అంగన్వాడి కేంద్రాలలో చదువుతున్న పిల్లల వివరాలు ఖాళీగా ఉన్న పోస్టుల సంఖ్య పూర్తి సమచారం సిద్ధం చేయాలని, వచ్చే విద్యా సంవత్సరంలో 3 సం లోపు పిల్లల అడ్మిషన్లు పెంచాలని, వారికి రుచికరమైన ఆహారం అందించాలని తెలిపారు, పదవ తరగతి పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థిని, విద్యార్థులు వివరాలు సేకరించి సంబంధిత స్తానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీలలో చేర్పించి అడ్మిషన్లు పెంచాలని సూచించారు, ఇంటర్మీడియట్ పిల్లల విద్యా సామర్థ్యాలు పెంచేందుకు ప్రతీ మాసం స్లిప్ టెస్టులు నిర్వహించాలని, కాలేజ్ లో మైనర్ రిపేర్లు ఉంటే వెంటనే చేయాలని, భవనాలు స్థితిగతులను పరిశీలించాలని, నూతన భవనాలు మరిన్ని అదనపు తరగతి గదులు ఏవైనా మరమ్మతులకోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలని సూచించారు,వసతి గృహాల నిర్వహణ విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు,రవాణా సౌకర్యం నిమిత్తం వివరాలు సేకరించి బస్ ల సమయపాలన ప్రకారం జిల్లాలో ఏర్పాట్లు చేయాలని, కాలేజ్ కి వచ్చి తరగతులకు గైహాజరైన వారి వివరాలను నమోదు చేసుకోవాలని, డ్రగ్స్, మాదక ద్రవ్యాలు బారిన పడకుండా గమనిస్తూ ఉండాలని సూచించారు,జిల్లాలోని (10) ప్రభుత్వ జూనియర్ కళాశాలలో రికార్డుల నిర్వహణ ప్రిన్సిపల్ లో లెక్చరర్స్ విద్యార్థిని విద్యార్థుల యొక్క హాజరు శాతం పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు, ఈ సమావేశంలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి మదర్, కళాశాల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



## హత్యాయత్నం కేసులో ఇద్దరు అరెస్ట్

**జూన్ 12 (వుదయం ప్రతినిధి):** టేకుమట్ల మండలంలోని వెంకట్రావుపల్లి (బి) గ్రామానికి చెందిన భర్తపై, భార్య విద్యుత్ షాక్ ద్వారా హత్య చేయడానికి ప్రయత్నించిన కేసులో పోలీసులు ఇద్దరిని అరెస్ట్ చేశారు. భర్త ఫిర్యాదు మేరకు, అతని భార్య, ఆమెతో సన్నిహిత సంబంధం ఉన్న వ్యక్తిని ఈ ఘటనపై కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.



# కరీంనగర్ |అదిలాబాద్ | నిజామాబాద్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## సింగరేణిని నామరూపాలు లేకుండా చేసేందుకు కుట్రలు

**వరుస కుంభకోణాలకు తెరలేపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం**

**40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఫేక్ మాత్రమే: కొప్పుల ఈశ్వర్**

**బొగ్గు పేరుతో మట్టి, బండరాళ్లను చూపిస్తున్నారని ఆరోపణ**



**పెద్దపల్లి, జూన్ 12 (వుదయం కరస్పాండెంట్ ):**

సింగరేణి సంస్థను నామరూపాలు లేకుండా చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఆరోపించారు. శుక్రవారం రామగుండం ఆర్జీ-1 ఓసీపీ-5లో బొగ్గు నిల్వలను మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్, టీజీబీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డితో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.ఈ సందర్భంగా కొప్పుల ఈశ్వర్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సింగరేణిలో వరుస కుంభకోణాలకు తెరలేపిందని ఆరోపించారు. ఒకప్పుడు వేలాది కుటుంబాలకు ఉపాధి కల్పించి ఈ ప్రాంత ఆర్థికాభివృద్ధికి వెన్నెముకగా నిలిచిన సింగరేణి సంస్థను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఓబీ కాంట్రాక్టులు, సోలార్ పవర్ ప్లాంట్లు, డెటోనేటర్ కొనుగోళ్లు, విద్యుత్ ప్రాజెక్టుల పేరుతో భారీ అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సింగరేణి అధికారిక వెబ్‌సైట్‌లో నమోదైన వివరాల ప్రకారం ఆర్జీ-1 ఓసీపీ-5లో సుమారు ఆరు లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు చూపిస్తున్నారని, సింగరేణి వ్యాప్తంగా 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నట్లు పేర్కొంటున్నారని తెలిపారు.అయితే వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉందని, బొగ్గు పేరుతో మట్టి పెళ్లలు, బండరాళ్లు, నాసిరకం పదార్థాలను కుప్పలుగా వేసి నిల్వలుగా చూపిస్తున్నారని ఆరోపించారు. ప్రస్తుతం మూడు లక్షల అరవై వేల టన్నుల బొగ్గు ఉందని చెబుతున్నప్పటికీ, అక్కడ 50 వేల మెట్రిక్ టన్నుల నాణ్యమైన బొగ్గు కూడా కనిపించడం లేదని వ్యాఖ్యానించారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలోనే ఈ వ్యవహారాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, 40 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలంటూ ప్రచారం చేయడం పూర్తిగా ఫేక్ అని అన్నారు. ఈ అంశంపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ)తో విచారణ జరిపించాలని, లేని బొగ్గును లెక్కల్లో ఎలా చూపిస్తున్నారో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.ప్రజాధనాన్ని వృథా చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని, సింగరేణి ప్రజల ఆస్తి కాబట్టి దాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు.ఇటీవల గోదావరిఖనిలో మాజీ మంత్రి హరీష్ రావు నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో డిపెండెంట్ ఉద్యోగాల అంశాన్ని ప్రస్తావించారని, అన్‌ఫిట్‌గా గుర్తించిన సుమారు 400 మంది కార్మికుల కుటుంబాలకు ఉద్యోగాల కల్పనలో జాప్యం జరుగుతోందని వెల్లడించారని గుర్తుచేశారు. ఈ విషయం బయటకు రావడంతో అధికారులు అప్రమత్తమై రెండు రోజుల్లో ఉద్యోగ నియామక పత్రాలు అందించేందుకు సిద్ధమవుతున్నారని తెలిపారు.సింగరేణిలో జరుగుతున్నట్లు ఆరోపిస్తున్న అన్ని కుంభకోణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొప్పుల ఈశ్వర్ డిమాండ్ చేశారు.

## నర్సింగ్ కాలేజ్ ను సందర్శించిన కలెక్టర్



**నిజామాబాద్, జూన్ 12 :**

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండల కేంద్రంలో కొనసాగుతున్న ప్రభుత్వ నర్సింగ్ కాలేజ్ ను కలెక్టర్ ఇలా త్రిపాఠి శుక్రవారం సందర్శించారు. కాలేజీ ఆవరణను పరిశీలించిన సందర్భంగా ప్రహరీ లేకపోవడాన్ని గమనించిన కలెక్టర్, వెంటనే ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని, నర్సింగ్ కాలేజీ వద్ద, పరిసర ప్రాంతాలలో పోలీసులు పెట్రోలింగ్ చేసేలా చూడాలని అన్నారు. తుది దశలో కొనసాగుతున్న నిర్మాణ పనుల నాణ్యతను తనిఖీ చేసి, వివరాలను అడిగి తెలుసుకున్నారు. యుద్ధప్రాతిపదికన పనులను పూర్తి చేయించాలని, విద్యార్థినులకు అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. తరగతి గదులను సందర్శించి విద్యార్థినులతో భేటీ అయ్యారు. విద్యార్థినులకు పలు ప్రశ్నలు వేస్తూ వారి అభ్యాసన సామర్థ్యాన్ని అంచనా వేశారు. తన వెంట తెచ్చిన డైరీలు, చాక్లెట్లు, బహుమతులను అందించారు. నర్సింగ్ కోర్సు ఎంతో డిమాండ్ కలిగిన చక్కటి కోర్సు అని, ఏకాగ్రతతో ఇష్టంగా చదువుకోవాలని హితవు పలికారు. కరోనా సమయంలో పారా మెడికల్ సిబ్బంది అందించిన సేవలు ఎంతో గొప్పవని కొనియాడారు. సేవా భావంతో కూడిన నర్సింగ్ కోర్సు వల్ల ఉద్యోగ అవకాశాలతో పాటు ఆకర్షణీయమైన వేతనాలతో విరివిగా ఉపాధికి లభించేందుకు ఆస్కారం ఉంటుందని అన్నారు. స్మార్ట్ ఫోన్, సోషల్ మీడియా వంటికి ఒకింత దూరంగా ఉండాలని, ఉన్నత భవిష్యత్తు కోసం ప్రణాళికతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా, వారి కలలను నిజం చేయాలని, అధ్యాపకులకు మంచి పేరు తేవాలని హితవు పలికారు. కాగా, వ్యక్తిగత భద్రత విషయంలో ఏమరుపాటుగా ఉండకుండా అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించాలని విద్యార్థినులకు జాగ్రత్తలు సూచించారు. ఏవైనా ఇబ్బందులు ఎదురైతే ధైర్యంగా అధికారులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఏవైనా అనుకోని ఘటనలు జరిగితే సఖీ వన్ స్టాప్ సెంటర్ ను సంప్రదిస్తే, వారు అన్ని విధాలుగా వెన్నుదన్నుగా నిలుస్తూ న్యాయం జరిగేలా కృషి చేస్తారని, మీ వ్యక్తిగత గుర్తింపు బయటపడకుండా గోప్యత పాటిస్తారని కలెక్టర్ తెలిపారు. బాలికల రక్షణకు, వారి ఆరోగ్యాల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, బయటి వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ లోనికి అనుమతించకూడదని, బంధువులు అయినా సరే లోనికి రాకుండా చూడాలని నిర్వాహకులను, సిబ్బందిని ఆదేశించారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని ఎంతమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట స్థానిక తహసీల్దార్ శేఖర్, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ భూలక్ష్మి తదితరులు ఉన్నారు.

## పెయిడ్ న్యూస్ తో దిగజారిపోతున్న జర్నలిజం విలువలు



**కామారెడ్డి, జూన్ 12 (వుదయం ప్రతినిధి):**

సోషల్ మీడియా, పెయిడ్ న్యూస్ తో జర్నలిజం విలువలు దిగజారిపోయిన ప్రస్తుత తరుణంలో ఏది నిజమో ఏదీ అబద్ధం వార్త అనేది తెలియని గందరగోళ పరిస్థితి ఏర్పడిందని కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణరెడ్డి అన్నారు. తెలంగాణ యూనియన్ ఆ జిల్లా శాఖ తృతీయ మహాసభలు, జిల్లా నూతన కార్యవర్గం పదవి ప్రమాణ స్వీకార ఉత్సవం కామారెడ్డి వరలక్ష్మి గార్డెన్ లో శుక్రవారం జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డితో పాటు మున్సిపల్ చైర్పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్, టీయూడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు విరాహత్ అలీ, రాంనారాయణ, వ్యాపారవేత్త టీ.సుభాష్ రెడ్డి లు హాజరయ్యారు. విలువలు గల జర్నలిస్టులు, పత్రికలు కొన్ని ఇంకా మిగిలి ఉన్నందున ప్రజాసమస్యలు పరిష్కరం అవుతున్నాయని ఎమ్మెల్యే అన్నారు. గ్రామీణ విలేకరులు సమస్యలపై వార్తలు రాస్తే సమాజాభివృద్ధి జరుగుతుందని వ్యాపార వేత్త టీ.సుభాష్ రెడ్డి అన్నారు. తాను ఒక్క పాఠశాలను నిర్మిస్తే తనను స్ఫూర్తిగా తీసుకుని దాతల ద్వారా 27 పాఠశాలలు నిర్మించారని ఇది పత్రికల ద్వారానే మార్పు జరిగిందన్నారు.సమావేశంలో టీయూడబ్ల్యూజే జిల్లా అధ్యక్షుడు రజనీ కాంత్, కార్యదర్శి రాజేష్, ఇంద్రసేనా రెడ్డి, లతీఫ్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ పైప్‌లైన్ పరిసరాల్లో ఇసుక, మట్టి తవ్వకాలు చేయొద్దు.. తాడిచెర్ల ప్రజలకు సర్పంచ్ బండి స్వామి విజ్ఞప్తి



**మల్హార్‌రావు, జూన్ 12 ( వుదయం ప్రతినిధి):**

తాడిచెర్ల గ్రామ పరిధిలోని వడ్డెరపల్లి తాళ్ల నుంచి మానేరు వాగు వరకు ఏర్పాటు చేసిన గ్యాస్ పైప్‌లైన్ మార్గంలో ఇసుక, మట్టి తవ్వకాలు చేపట్టవద్దని తాడిచెర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్యాస్ పైప్‌లైన్ ఉన్న ప్రాంతంలో లేదా దాని పరిసరాల్లో ఇసుక, మట్టి తీయడం వల్ల పైప్‌లైన్ దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. పైప్‌లైన్‌కు నష్టం జరిగితే రైతులు, స్థానిక ప్రజలు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.ముఖ్యంగా ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు, జేసీబీ ఆపరేటర్లు ఈ విషయాన్ని గుర్తుంచుకొని పైప్‌లైన్ పరిధిలో ఎలాంటి తవ్వకాలు చేపట్టవద్దని సూచించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు.గ్యాస్ పైప్‌లైన్ రక్షణ అందరి బాధ్యత అని, అనుమానాస్పద తవ్వకాలు లేదా పైప్‌లైన్‌కు ప్రమాదం కలిగించే చర్యలు కనిపిస్తే వెంటనే గ్రామపంచాయతీ అధికారులకు సమాచారం అందించాలని సర్పంచ్ బండి స్వామి తెలిపారు.

## పాఠశాల ప్రారంభానికి ముందే అన్ని సౌకర్యాలు విద్యార్థులకు అందుబాటులో ఉండాలి: అదనపు కలెక్టర్ డా. అశ్వని తానాజీ వాకడే




**కరీంనగర్ జూన్ 12 (వుదయం ప్రతినిధి):**

కరీంనగర్ జిల్లా అదనపు పాలనాధికారి డాక్టర్ అశ్వని తానాజీ వాకడే ఐఏఎస్ పాఠశాల పునఃప్రారంభ కార్యక్రమంలో భాగంగా ఎలగందల్, కొత్తపల్లి మండలంలోని విద్యాసంస్థలను సందర్శించి మౌలిక వసతుల పరిస్థితిని పరిశీలించారు.ఈ సందర్భంగా ఎలగందల్ మోడల్ స్కూల్, జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, కేజీబీవీ మరియు సాంఘిక సంక్షేమ హాస్టళ్లను సందర్శించిన ఆమె, అక్కడ విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, భవనాల మరమ్మతులు, తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్ మరియు ఇతర సౌకర్యాలపై సమీక్ష నిర్వహించారు.పరిశీలనలో గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పెండింగ్‌లో ఉన్న పనులను నిర్దేశిత గడువులో పూర్తి చేసి, పాఠశాలలు పునఃప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా విద్యాసంస్థలను సన్నద్ధం చేయడం అధికారుల బాధ్యత అని పేర్కొన్న అదనపు కలెక్టర్, ప్రతి పనిని నాణ్యతతో పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ పర్యవేక్షణ కార్యక్రమంలో టీజీడబ్ల్యుఐడీసీ ఈఈ అశోక్ కుమార్ , ప్లానింగ్ సమన్వయాధికారి మిలుకూరి శ్రీనివాస్ , కొత్తపల్లి మండల విద్యాధికారి తుమ్మా ఆనందం తదితరులు పాల్గొన్నారు.

## మగ్గిడి మోడల్ స్కూల్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం



**ధర్మపురి, జూన్12 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి మండలంలోని మగ్గిడి తెలంగాణ ఆదర్శ పాఠశాల,ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టు ల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుం డి దరఖాస్తులు కోరుతున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన గంటల చొప్పున బోధించుటకు గాను భర్తీ చేయనున్నారు. శిక్షణ పొందిన పట్టభద్రుల ఉపాధ్యాయులు (టీజీటీ) సైన్స్ 01 హిందీ 01 పోస్టు,పోస్ట్ గ్రాడ్యుయేట్ ఉపాధ్యాయులు (పీజీటీ) ఫిజిక్స్ 01,ఎకనామిక్స్ 01పోస్టుటీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులలో డిగ్రీతో పాటు ఉపాధ్యాయ శిక్షణ (బి.ఎడ్) ఉపాధ్యాయ అర్హత, పరీక్ష (టెట్) ఉత్తీర్ణులై ఉండాలి.పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులలో పీజీ(పోస్ట్ గ్రాడ్యుయేషన్),ఉపాధ్యాయ శిక్షణ (బి.ఎడ్) పూర్తి చేసి ఉండాలి.అర్హత, ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈ నెల జూన్ 16వ తేదీ లోపు మగ్గిడి ఆదర్శ పాఠశాలలో స్వయంగా సమర్పించాల్సి ఉంటుంది.దరఖా స్తు చేసుకున్న అభ్యర్థులకు న మూనా డెమో నిర్వహించి, దాని ప్రాతిపదికన ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడుతామని ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు.

## భరణి నక్షత్రం సందర్భం గా యమధర్మరాజుకు ప్రత్యేక అభిషేకాలు



**ధర్మపురి, జూన్12 (వుదయం ప్రతినిధి):**

ధర్మపురి శ్రీలక్ష్మి నరసిం హ స్వామి దేవస్థానంఅనుబంధ దేవాలయమై న శ్రీ యమధర్మ రాజు ఆలయంలో భరణి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. స్వామి వారికి వేదపండితులు పురుషసూక్తం, శ్రీ లక్ష్మీ సూక్తం, మన్యు సూక్త పఠనాలతో శాస్త్రోక్తంగా అభి షేకం చేశారు. అనంతరం భక్తులఆయురారోగ్యాలను కాంక్షిస్తూ ఆలయ ప్రాంగణంలో ఆయుష్య హోమం భక్తిశ్రద్ధలతో జరిపించారు. స్వామి వారికి ప్రత్యేక అలంకరణ చేసి, వేద మంత్రోచ్చారణల నడుమ మహా మంగళ హారతి, మంత్ర పుష్పం కార్యక్రమాలను భక్తుల కో లాహలం మధ్య నిర్వహిం చారు.ఈ సందర్భంగా ఆల యం యమధర్మ రాజ నామ స్మరణతో మారుమోగింది.ఈ విశేషపూజాకార్యక్రమాల్లో ఈఓ సంకటాల.శ్రీనివాస్, దేవస్థానం సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్, వేదపండి తులు పాలెపు ప్రవీణ్ కుమార్ శర్మ, నేరెళ్ల సంతోష్ కుమార్, ఆలయ అర్చకులు వొద్దిపర్తి కళ్యాణ్ కుమార్,అభిషేకం పురో హితులు బొజ్జ సంతోష్ కుమార్,దేవాలయ సిబ్బంది, అర్చక బృందం పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు,భక్తులు పాల్గొన్నారు.

## జన్నారం ఎంఈవోగా వి. రాజేందర్ నియామకం



**జన్నారం, జూన్ 12(వుదయం విలేకరి)**

జన్నారం మండల ఇన్చార్జ్ ఎంఈవోగా వి. రాజేందర్‌ను వరంగల్ ఆర్జేడి మదన్మోహన్ నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం నడిమెట్లు విజయ్ కుమార్ మండల ఇన్చార్జ్ ఎంఈవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. వ్యక్తిగత కారణాలవల్ల తను ఈ అదనపు బాధ్యత నుంచి తప్పుకుంటున్నట్లు అధికారులకు రాతపూర్వకంగా అందజేశారు.ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో పాఠశాలలను పరిశీలిస్తానని తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేస్తానన్నారు.ఈ సందర్భంగా శుక్రవారం రోజున బాధ్యతలు స్వీకరించిన రాజేందర్ ను పిఆర్టియు మండల అధ్యక్షుడు కట్ట రాజమౌళి, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్యం అందించాలి: జిల్లా కలెక్టర్




**నిర్మల్ జిల్లా 12 జూన్ (వుదయం ప్రతినిధి)**

జిల్లాలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, బుధవారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లాలో ప్రజలకు ప్రభుత్వాసుపత్రుల్లో అందుతున్న వైద్య సేవలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని అన్ని ప్రాథమిక ఆసుపత్రులు, ఆరోగ్య ఉప కేంద్రాలు సహా అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రైవేట్ కు దీటుగా వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలన్నారు. సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వాసుపత్రుల్లో మంచి వైద్యం అందుతుందన్న నమ్మకం ప్రజల్లో పెంపొందించాలని వివరించారు. ఆసుపత్రుల్లో ఏవైనా మౌళిక సదుపాయాల పనులు, వైద్య పరికరాలు అవసరం ఉన్నాయేమో అని అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో అంటువ్యాధులతో ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య6 పెరిగే అవకాశం ఉన్నందున వైద్యులు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. చిన్నారులకు టీకాలు నిర్ణిత సమయానుగుణంగా అందివ్వాలన్నారు. నిర్మాణంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాల పనులు త్వరితగతిన పూర్తి చేసి, వైద్యసేవలకు అందుబాటులోకి తేవాలని తెలిపారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, వైద్యాధికారి రాజేందర్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి పర్యవేక్షకులు గోపాల్ సింగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్ శారద, డిసిఎహెచ్ఎస్ కాశీనాథ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## విద్య అభివృద్ధికి ప్రభుత్వం కృషి-జిల్లా కలెక్టర్



**మంచిర్యాల/జూన్ 12(వుదయం ప్రతినిధి)**

ప్రభుత్వ విద్యా సంస్థలను బలోపేతం చేస్తూ విద్యార్థులకు సకల సదుపాయాలతో కూడిన నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని తాండూర్ మండల కేంద్రంలో విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిబా పూలే వసతి గృహ నిర్మాణానికి బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, మండల తహసిల్దార్ జ్యోత్స్న, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, మహాత్మ జ్యోతిబాపూలే ఆర్ సి ఓ బాల భాస్కర్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ అన్ని ప్రభుత్వ పాఠశాలలలో త్రాగునీరు, విద్యుత్, ప్రహరీ గోడ, మూత్రశాలలు ఇతర పూర్తి సౌకర్యాలు కల్పించి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ క్రమంలో తాండూర్ మండలంలో 1 కోటి 95 లక్షల రూపాయల ఎస్ డి ఎఫ్ నిధుల అంచనా వ్యయంతో మహాత్మ జ్యోతిబాపూలే వసతి గృహ నిర్మాణం చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలలో విద్యార్థినీ విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే పాఠ్యపుస్తకాలు, ఏకరూప దుస్తులు అందించడం జరుగుతుందని, ప్రభుత్వ పాఠశాలలను విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి పట్టణంలోని రామ్ నగర్ ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల అదనపు తరగతి గదులను జిల్లా కలెక్టర్, బెల్లంపల్లి సబ్ కలెక్టర్ మనోజ్, బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ రమేష్, మున్సిపల్ చైర్ పర్సన్ దావ స్వాతి, మండల విద్యాధికారి లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విద్య, సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 లక్షల 50 వేల రూపాయల సమగ్ర శిక్ష అంచనా నిధులతో పాఠశాల అదనపు తరగతి గదులు నిర్మించడం జరిగిందని తెలిపారు.

గదుల నిర్మాణ పనులను వేగవంతం చేసి విద్యా సంవత్సరం ప్రారంభంలోగా పూర్తి చేసేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. విద్యా వ్యవస్థలో ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాదిఎమ్మెల్యే పాయల్ శంకర్



**ఆదిలాబాద్, వుదయం :**

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధికి పునాది అని, ప్రతి గ్రామానికి అవసరమైన మౌలిక వసతులను కల్పించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. భోరజ్ మండలంలోని హషంపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే ఘనంగా ప్రారంభించారు. గ్రామ ప్రజల ఆనందోత్సాహాల మధ్య జరిగిన ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, హషంపూర్ గ్రామం చిన్నదైనా గ్రామ ప్రజల మనసులు ఎంతో విశాలమైనవని కొనియాడారు. గ్రామ ప్రజలు తనపై చూపుతున్న ప్రేమ, ఆప్యాయత, అభిమానాలు ఎంతో సంతోషాన్ని కలిగించాయని అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. హషంపూర్ గ్రామాన్ని రాబోయే రెండేళ్లలో అభివృద్ధి పరంగా ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తామని ఎమ్మెల్యే వెల్లడించారు. ముఖ్యంగా రైతులకు ఇబ్బందులు లేకుండా పొలాలకు వెళ్లే రహదారులను మెరుగుపరచడం, తాగునీటి సమస్యలను పరిష్కరించడం, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు, పారిశుద్ధ్య సదుపాయాలను మరింత అభివృద్ధి చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. హషంపూర్ గ్రామ ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల సమిష్టి కృషితో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. విద్య, ఆరోగ్యం, తాగునీరు, వ్యవసాయం, రవాణా, పారిశుద్ధ్యం వంటి రంగాల్లో గ్రామం మరింత పురోగతి సాధించేలా కృషి చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గ్రామసర్పంచ్, వార్డు సభ్యులు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామ పెద్దలు, మహిళా సంఘాల ప్రతినిధులు, యువకులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం గ్రామ ప్రజలు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి తమ సమస్యలను వివరించగా, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

## రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేశాం.. జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూన్ 12 (వుదయం ప్రతినిధి)**

రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు.సమగ్ర జిల్లా కార్యాలయ సముదాయం (ఐడీఓసీ)లో శుక్రవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మీడియా సమావేశం నిర్వ హించి యాసంగి ధాన్యం కొనుగోళ్లు, మొక్కజొన్న కొనుగోళ్లు, స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్), మట్టి రవాణా, ప్రభుత్వ భూముల పరిరక్షణ, అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ల (ఏటీసీ) ప్రవేశాలపై సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, యాసంగి 2025-26 సీజన్‌కు సంబంధించి జిల్లాలో ధాన్యం కొనుగోళ్లను వందశాతం పూర్తి చేసినట్లు తెలిపారు. జిల్లాలో 59,342 మంది రైతుల నుంచి 4.35 లక్షల మెట్రిక్ టన్నుల వరిని కొనుగోలు చేసి రూ.1,031 కోట్ల విలువైన ధాన్యాన్ని సేకరించామని చెప్పారు. రైతులకు చెల్లించాల్సిన మొత్తంలో ఇప్పటికే 93 శాతం చెల్లింపులు పూర్తిచేసినట్లు తెలిపారు. గత పదేళ్లలో ఇదే అత్యధిక వరి కొనుగోలు అని పేర్కొంటూ, 2024-25 యాసంగి సీజన్‌లో 4.01 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలు జరగగా, ఈసారి 4.35 లక్షల మెట్రిక్ టన్నులకు చేరుకున్నట్లు తెలిపారు.సీఎంఆర్ బియ్యం సరఫరాలో పెద్దపల్లి జిల్లా రాష్ట్రంలో అగ్రస్థానంలో ఉందని తెలిపారు. 2024-25 ఖరీఫ్‌లో 100 శాతం, రబీలో 95 శాతం, 2025-26 ఖరీఫ్‌లో 39 శాతం, రబీలో 8 శాతం సీఎంఆర్ డెలివరీ పూర్తయినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు డిఫాల్ట్‌లో ఉన్న 10 రైస్ మిల్లులకు బకాయిలు చెల్లించి, బ్యాంకు గ్యారంటీ సమర్పించిన అనంతరం మాత్రమే ధాన్యం కేటాయించినట్లు తెలిపారు. ధాన్యం రవాణాకు రోజుకు సుమారు 600 వాహనాలను వినియోగించామని, మొత్తం 1.15 కోట్ల గన్నీ సంచులు ఉపయోగించినట్లు తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లుల్లో 6.90 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వసామర్థ్యం అందుబాటులో ఉండగా, అవసరాన్ని బట్టి ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్, భూపాలపల్లి, కుమురం భీం ఆసిఫాబాద్, వికారాబాద్, మేడ్చల్ జిల్లాల్లో కూడా అదనపు నిల్వ స్థలాన్ని వినియోగించినట్లు తెలిపారు.

# మహబూబ్ నగర్ | మెదక్ - ఉమ్మడి జిల్లాల వార్తలు

## బాల కార్మిక రహిత సమాజం మనందరి కల



**- జూనియర్ సివిల్ జడ్జ్ సాయి మనోజ్**

**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**

బాల కార్మిక రహిత సమాజం మనందరి కల,ప్రభుత్వ చట్టాల గురించి తెలుసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా నారాయణపేటలోని శ్రీ వేద సరస్వతి జూనియర్ కాలేజీ లో జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ ప్రధాన న్యాయమూర్తి లీగల్ సర్వీసెస్ సంస్థ చైర్మన్ బోయ శ్రీనివాసులు ఆదేశాల మేరకు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. దానిలో భాగంగా ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ, లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లల అక్రమ రవాణా తదితర వాటిపై అవగాహన కల్పించారు. బాలలను పనిలో పెట్టుకోవడం బాల్య వివాహాలను చేయడం నేరమన్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మిలించేందుకు తల్లిదండ్రుల బాధ్యత ఎంతో ఉందని అన్నారు. తమ పిల్లలను పనికి పంపించి వారి బంగారు భవిష్యత్తును నాశనం చేయవద్దని సూచించారు. మన చుట్టుపక్కల ఎక్కడైనా బాల కార్మికులను గుర్తిస్తే, వెంటనే చైల్డ్ లైన్ (1098) లేదా అధికారుల దృష్టికి తీసుకువెళ్లాలి అన్నారు. లైంగిక నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం పోక్సో 2012 , ఇది 18 సంవత్సరాల లోపు పిల్లలకు లైంగిక వేధింపుల నుండి రక్షణ కల్పించడానికి ఉద్దేశించబడింది అని అవగాహన కల్పించారు. ఈనాటి యువతరం రేపటి దేశ భవిష్యత్తు అని యువత మంచి మార్గంలో నడవాలని అన్నారు. దురదృష్టవశాత్తు కొన్ని దురలవాట్లు మన యువతను దారి మళ్లిస్తున్నాయి వాటికి దూరంగా ఉండాలన్నారు. వాటిలో మాదక ద్రవ్యాల వినియోగం అత్యంత తీవ్రమైనది, ప్రమాదకరమైనది అన్నారు. యువత మత్తుకు దూరంగా ఉండి జీవితంలో ఒక లక్ష్యం ఏర్పరచుకొని దానికి కోసం కృషి చేయాలి అని తెలిపారు. ఈ సందర్భంలో జిల్లా కోర్టు చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్ మాట్లాడుతూ న్యాయ సలహాల కోసము జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ యొక్క టోల్ ఫ్రీ నెంబర్ 15100 మీద అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో కాలేజీ ప్రిన్సిపాల్ శేషమ్మ, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## సిద్దిపేటలో పర్యావరణ అవగాహన సదస్సు

**సిద్దిపేట, జూన్ 12 (వుదయం బ్యూరో)**




తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ ఆఫీస్ మరియు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో "సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిర్మూలన ప్రత్యామ్నాయాల అవగాహన" కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి జిల్లా నోడల్ ఆఫీసర్ (పర్యావరణ శాస్త్రవేత్త) శ్రీ టి. రవీందర్, మున్సిపల్ కమిషనర్ సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సుకు పట్టణంలోని వ్యాపారులు, పంపిణీదారులు, ప్రజలు దాదాపు 120 మంది హాజరయ్యారు. నిత్యజీవితంలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను పూర్తిగా దూరం పెట్టి, పూర్వీకుల పద్ధతిలో బయోడిగ్రేడబుల్ వస్తువులైన బట్ట సంచులు, నార సంచులు, స్టీల్ బాటిళ్లు, ఇస్తరాకులు, చెక్క స్పూన్లను వాడాలని శాస్త్రవేత్త టి. రవీందర్ పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుందని, వర్షపు నీరు భూమిలోకి ఇంకకుండా అడ్డుపడుతుందని హెచ్చరించారు. ప్లాస్టిక్ కాల్చడం వల్ల వచ్చే హానికర వాయువులతో క్యాన్సర్ వంటి వ్యాధులు వస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు ప్రతి ఒక్కరూ ఇంట్లోనే తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర వ్యర్థాలను (Segregation) వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని కమిషనర్ కోరారు. తాము ఇప్పటికే ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించామని, మార్కెట్లో బయోడిగ్రేడబుల్ సంచులు అందుబాటులో ఉంచితే వాటినే విక్రయిస్తామని స్థానిక వ్యాపారులు స్పష్టం చేశారు. పర్యావరణ పరిరక్షణ కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, భావితరాలకు మంచి గాలి, నీరు, నేల అందించడం ప్రతి ఒక్కరి కర్తవ్యమని అధికారులు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా అవగాహన సదస్సుకు వచ్చిన వారందరికీ మరియు ఇంటిగ్రేటెడ్ మార్కెట్లోని ప్రజలకు కాలుష్య నియంత్రణ మండలి సిబ్బంది ఉచితంగా బట్ట సంచులు, నార సంచులను పంపిణీ చేశారు.

## రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒకరి మృతి

**నారాయణపేట టౌన్ జూన్12 (వుదయం ప్రతినిధి)**



నారాయణపేట జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో గురువారం రాత్రి 11:30 గంటల ప్రాంతంలో రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నందిని హోటల్ శివకుమార్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనంపై రోడ్డు క్రాస్ చేస్తుండగా కొత్త బస్టాండ్ నుండి వస్తున్న పల్సర్ ఒక్కసారిగా శివకుమార్ వాహనాన్ని ఢీకొనడంతో ద్విచక్ర వాహనాలపై ఉన్న ఇద్దరు కిందపడిపోయారు.దీనితో శివకుమార్ తలకు బలమైన గాయం కావడంతో అక్కడే ఉన్న కొంతమంది యువకులు వారి వాహనాలపై జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శివకుమార్ మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మరో వ్యక్తికి తీవ్రగాయాలు కావడంతో మహబూబ్ నగర్ జిల్లా ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు.

## పోలీస్ స్టేషన్ పరిసరాలు నిత్యం పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు**

**గద్వాల జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**



పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంతో పాటు అత్యవసర పరిస్థితుల్లో వచ్చే డయల్100 కాల్స్‌కు తక్షణమే స్పందించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు సూచించారు. శుక్రవారం అలంపూర్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించిన ఆయన స్టేషన్ రికార్డులు, సిబ్బంది విధుల నిర్వహణ, పరిసరాల పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రిసెప్షన్, రైటర్ సెక్షన్, టెక్ టీమ్, ఎస్‌హెచ్‌వో కార్యాలయం, లాకప్ గది, విశ్రాంతి గదులు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలను తనిఖీ చేసిన ఎస్పీ, సిబ్బంది యూనిఫాం నిర్వహణతో పాటు జనరల్ డైరీ, బీట్ డ్యూటీ బుక్స్, ఉన్నతాధికారుల సందర్శన రికార్డులు తదితర పత్రాలను పరిశీలించారు. అనంతరం సిబ్బందితో సమావేశమైన ఎస్పీ, పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాలు, బీట్ వ్యవస్థ, బ్లూ కోల్ట్స్, పెట్రోల్ వాహనాల విధుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. గ్రామాల్లో క్రమం తప్పకుండా పర్యటిస్తూ సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు, మూఢనమ్మకాలు, బాల్య వివాహాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను విస్తృతంగా నిర్వహించి రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఆదేశించారు. డయల్ 100 కాల్ అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సమస్యలను పరిష్కరించడంతో పాటు, ప్రజా ఫిర్యాదులపై ఎటువంటి జాప్యం లేకుండా స్పందించాలని ఎస్పీ స్పష్టం చేశారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించేలా సేవలు అందించాలని సూచించారు. ఈ తనిఖీలో గద్వాల డీఎస్పీ వై మొగిలయ్య, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వి. ప్రదీప్ కుమార్, ఎస్సై ఎం. రామకృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## తోర్నాల్ గ్రామంలో విగ్రహాల ఆవిష్కరణ

**వుదయం, మనూరు,**




మండల్ మనూరు మండలం తోర్నల్ గ్రామం గౌతమ్ బుద్ధుడు, బసవేశ్వరుని, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మహనీయుల విగ్రహాలను స్థానిక తోర్నల్ అంబేద్కర్ భవనం లో ఆవిష్కరించడం జరిగింది, అనంతరం పురాతనమైన పోచమ్మ పండగ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది, ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలను ప్రతిష్టించడం చాలా గొప్ప విషయం అని వారి అడుగు జడలలో ప్రతి ఒక్కరు నడవవలసిన అవసరం ఉందని అన్నారు, భవిష్యత్తులో దళితవాడలో గ్రామాలలో అనేక సంక్షేమ పథకాలను అమలు చేసి అభివృద్ధి చేర్పడతామని హామీ ఇవ్వడం జరిగింది, ఈ కార్యక్రమంలో గెజిటెడ్ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు డి, వైద్యనాథ్ గారు గ్రామ సర్పంచ్ పి, సంగమేశ్వర్ పాటిల్ గారు గ్రామ ఉపసర్పంచ్ వినోద ఆంబోజీ గారు, గ్రామ మాజీ సర్పంచ్ సంగారెడ్డి గారు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, వైజ్యనాథ్ గారు, మల్లికార్జున పాటిల్ గారు, గ్రామస్తులు యువజన నాయకులు కోటారి నర్సింలు, ఖలేద్, కె, కె, నర్సింలు, కె, లలాప్ప, పెద్ద , చిన్న నర్సింలు, శర్ణప్ప, మచందర్.రవి, శంకర్, పుండ్లీక్,హాఫేజ్,సతీష్, రాజు,గంగప్ప తదితరులు పాల్గొన్నారు

## ప్రభుత్వ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి




**- బెస్ట్ అవైలబుల్ పాఠశాల లకు డిప్ విధానంలో విద్యార్థుల ఎంపిక జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**గద్వాల జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**

అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునే అవకాశం కల్పిస్తుందని, ఎంపికైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఐడిఓసి సమావేశపు మందిరంలో 202627 విద్యా సంవత్సరానికి గాను బెస్ట్ అవైలబుల్ పాఠశాలల్లో చదువుకునేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను లక్కీ డిప్ విధానంలో కలెక్టర్ ఎంపిక చేశారు. నాన్ రెసిడెన్షియల్ ఒకటవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 57 సీట్లు ఉండగా, మొత్తం 265 మంది దరఖాస్తు చేసుకోగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మహిళా రిజర్వేషన్స్, జనరల్ కోటాలో నిబంధనల ప్రకారం డిప్ ద్వారా విద్యార్థులను ఎంపిక చేశారు. రెసిడెన్షియల్ ఐదవ తరగతిలో ప్రవేశాలకు మొత్తం 59 సీట్లు ఉండగా గ్రూప్ 1, 2, 3లకు సంబంధించి మొత్తం 310 మంది దరఖాస్తు చేసుకోవడంతో అర్హులైన వారిలో నుంచి డిప్ విధానంలో విద్యార్థులను ఎంపిక చేశారు. వివిధ గ్రూపులకు సంబంధించి వెయిటింగ్ లిస్టు ప్రాతిపదికన కొంతమంది విద్యార్థులను కూడా డిప్ విధానంలో ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఎంపికైన విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి నుషిత, ఏఎస్సిడబ్ల్యూఓ నాగరాజు, సెక్టోరియల్ అధికారి కర్రెప్ప, బీచుపల్లి గురుకుల విద్యాలయ ప్రిన్సిపల్ రామాంజనేయులు, ఇతర అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## యాలాల పోలీస్ స్టేషన్ సందర్శించిన వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రా

*** ఎస్ఐ విట్టల్ రెడ్డి పనితీరు పై సంతృప్తి**

*** యాలాల మే 12**

**( వు దయం ప్రతినిధి ):-**



యాలాల పోలీస్ స్టేషను శుక్రవారం వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రు సందర్శించారు. ఈ సందర్భంగా యాలల పోలీస్ స్టేషన్లో వివిధ రికార్డులను పరిశీలించారు. పోలీస్ స్టేషన్లో కేసులు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అప్డేట్ చేయాలని సూచించారు. స్థానికంగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్లో వివిధ కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మేహ్రూ మాట్లాడుతూ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. విధి నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్త వహించాలనిసూచించారు. నిర్వహణలో జాప్యం జరిగితే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. స్థానిక ఎస్సై విట్టల్ రెడ్డి పనితీరుపై జిల్లా ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే సిబ్బందికు సిబ్బంది పనితీరు కూడా బాగుందని కొనియాడారు. ఆమె వెంట తాండూర్ డిఎస్పి నర్సింగ్ యాదయ్యతదితరులున్నారు

## భూమితో నాకు సంబంధం లేదు... గుంట భూమి ఉన్నా రాజకీయం వదిలేస్తా

*** కుటుంబాన్ని లాగొద్దని హెచ్చరిక, విలేకరుల సమావేశంలో మీడియాపై అసహనం**

*** సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్**

**ఆందోల్ (వుదయం),**



: ఆందోల్ మండల పరిధిలోని నెరడిగుంట గ్రామ సర్పంచ్ ఒగ్గు సాయికిరణ్ శుక్రవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి తనపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. రాజకీయంగా ఎదుర్కొనలేక ప్రత్యర్థులు తనపై తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు.సర్పంచ్ సంచలన వ్యాఖ్యలు: "నాపై భూమికి సంబంధించి ఒక్క గుంట ఉన్నా సరే, నేను వెంటనే రాజకీయాలను వదిలిపెట్టుకోవడానికి సిద్ధంగా ఉన్నాను. ఒకవేళ నా పేరు మీద గుంట భూమి ఉంటే దాన్ని మా చిన్నమ్మ లేదా అమ్మ బాబాయ్ శ్రీశైలం పేరు మీద రాసిస్తాను" అని సాయికిరణ్ సవాల్ విసిరారు. "రాజకీయం కోసం నా కుటుంబ సభ్యులను లాగి, ఒకరికి ఒకరికి కొట్లాట పెట్టడం ఎంతవరకు సబు? గ్రామ ప్రజలు నన్ను సర్పంచ్‌గా ఎన్నుకున్నారు, వారికి ఎప్పుడూ అండగా ఉంటాను" అని ఆయన స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోదండ ఈశ్వర్ తాజా మాజీ ఎంపీటీసీ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ గౌడ్ వార్డ్ మెంబర్ బోయిని శంకర్ గ్రామ పెద్దలు బాప్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

విలేకరులతో వాగ్వాదం:

సమావేశంలో సర్పంచ్ సాయికిరణ్ "మీరు 500 నుంచి 1000 రూపాయలకు వార్తలు రాస్తారు" అని వ్యాఖ్యానించడంతో కాసేపు గందరగోళం నెలకొంది. దీనికి ఘాటుగా స్పందించిన ఒక విలేకరి, "మీరు ఎవరికి డబ్బులు ఇచ్చారు? పత్రిక, ఎలక్ట్రానిక్ మీడియా అంటే మీకు విలువ లేదామరి మమ్మల్ని సమావేశానికి ఎందుకు పిలిచారు?" అని ప్రశ్నించారు. తోటి విలేకరులు కూడా సర్పంచ్ వ్యాఖ్యలపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

## ప్రతి పేదవాడికీ మెరుగైన వైద్యం

**- పేదవాడికి ఉచిత వైద్యం అందిస్తున్న డాక్టర్ శ్రీకాంత్**

**వికారాబాద్ జూన్ 12 (వుదయం బ్యూరో)**





గ్రామీణ ప్రాంత ప్రజలు మెరుగైన వైద్యానికి నోచుకోక అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ప్రతి పేదోడికి నాణ్యమైన వైద్యం అందించేందుకు ముందుకొచ్చిన డాక్టర్ శ్రీకాంత్ . వికారాబాద్ పట్టణంలోని పాత పోలీస్ స్టేషన్ పక్కన 2021న డాక్టర్ స్వప్న తో కలిసి ఆసుపత్రిని ప్రారంభించారు. ఆ రోజు నుంచి ఈ ప్రాంత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై అవగాహన కొచ్చిన డాక్టర్ శ్రీకాంత్ మెరుగైన వైద్యం అందించేందుకు ముందుకొచ్చారు. ట్రస్ట్ ఏర్పాటు చేసి ట్రస్ట్ ఆధ్వర్యంలో కేవలం 50 రూపాయల ఫీజుతో వైద్యనందిస్తున్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థులకు కూడా తన ఆసుపత్రి ద్వారా మెరుగైన అందించడం ఇస్తున్నారు. ఈ ప్రాంతంలో పుట్టి పెరిగిన వ్యక్తి కాబట్టి ఈ ప్రాంత ప్రజలు ఆరోగ్యం పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదని ఆలోచనతో ప్రజల్లో అవగాహన కల్పించి మంచి వైద్యాన్ని అందించేందుకు ఈ డాక్టర్ ముందుకు వచ్చారు. ఇతర రాష్ట్రాల నుంచి ఈ ప్రాంతానికి వలస వచ్చిన కార్మికులకు వైద్యం వేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పేదవాడికి సరైన సమయంలో వైద్యం అందకపోవడంతో సమయంతో పాటు ఆర్థికంగా శారీరకంగా ఇబ్బందులకు గురవుతున్నారు. మెరుగైన వైద్యం ఎక్కడ అందుతుందో అని ఆలోచించకుండా ఇతర మార్గాల ద్వారా వైద్యం తీసుకోవడం వల్ల శారీరకంగా దెబ్బతిన్నతో పాటు ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఇలాంటివారు ఈ ప్రాంతంలో అనేక మంది ఉన్నారని వారికి మెరుగైన వైద్యం మాత్రమే మా లక్ష్యమని డాక్టర్ తెలిపారు. తగిన ఉంటాడని ఆయన వివరించారు. తాను అనేక గ్రామాల్లో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయడం జరిగింది అన్నారు. ఈ మెడికల్ క్యాంపులో ప్రతి ఒక్కరికి నాణ్యమైన వైద్యాన్ని అందించామన్నారు. గర్భిణీలు నార్మల్ డెలివరీ అయ్యేందుకు వారికి యోగాసనాలు కూడా తమ ట్రస్ట్ ద్వారా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వికారాబాద్ ప్రాంతం పూర్తిగా వెనుకబడిన ప్రాంతమని ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాలు తెలిసిన వ్యక్తిని కనుక ఈ ప్రాంత ప్రజలకు సేవ చేయడమే తన కర్తవ్యం భావించి పలు కార్యక్రమాలకు శ్రీకారం చుట్టామని ఆయన వివరించారు. తగిన సమయంలో వైద్యం అందిస్తే ఆ వ్యక్తి అన్ని రకాలుగా ఆరోగ్యంగా ఉండే అవకాశం ఉందన్నారు. ఈ ప్రాంత ప్రజలు కష్టజీవులు కనుక తన పనులపై ఉన్న ఆసక్తి వైద్యం పట్ల చూపడం లేదన్నారు. అనుకోని సంఘటన జరిగినప్పుడు అసలైన వైద్యులను గుర్తించకుండా ఎవరినో ఒకరిని ఆశించడం వల్ల నాణ్యమైన వైద్యం అందరం లేదన్నారు. జనరల్ సర్జన్, జనరల్ మెడిసిన్, స్త్రీల వైద్యనిపురాలు, నరాల వైద్య నిపుణులు, జీర్ణకోషకు సంబంధించిన వైద్యుల తోపాటు అన్ని రకాల వైద్యులు ఈ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నారు.24 గంటలు వైద్య సేవలు అందిస్తున్నారు. తన ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగిని క్షుణ్ణంగా పరీక్షించి మెరుగైన వైద్యం అందించేందుకు ఈ ఆసుపత్రి వైద్యులతో పాటు సిబ్బంది కూడా ముందున్నారు. మెరుగైన వైద్యం, మంచి మెడిసిన్ అందిస్తూ ప్రజలకు సేవ చేస్తున్నారు.

## చీకట్లో ప్రాణాలు గాల్లో!



**- కోదండపురం స్టేజీ వద్ద వెలగని హైవే దీపాలు**

**- రాత్రి 8 దాటినా అంధకారమే.. ప్రమాదాల ముప్పుపై ప్రయాణికుల ఆందోళన**

**జూన్ 12 (వుదయం కరస్పాండెంట్)**

జోగులాంబ గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలంలోని కోదండపురం స్టేజీ వద్ద జాతీయ రహదారి NH44పై రాత్రి సమయం అయినప్పటికీ హైవే వీధి దీపాలు వెలగకపోవడం తీవ్ర విమర్శలకు దారి తీస్తోంది. దేశంలో అత్యంత రద్దీగా ఉండే జాతీయ రహదారులలో ఒకటైన NH44పై రాత్రి సుమారు 8 గంటలు దాటినా రహదారి దీపాలు పనిచేయకపోవడంతో ప్రయాణికులు అంధకారంలోనే ప్రయా ణించాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రతిరోజూ వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ మార్గంలో వెలుతురు లేకపోవడం వల్ల ప్రమాదాల భయం వెంటాడుతోంది. ముఖ్యంగా ద్విచక్రవాహనదారులు, పాదచారులు, స్థానిక గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాత్రి వేళల్లో రహదారిపై ఎదురుగా వచ్చే వాహనాల హెడ్‌లైట్ల కాంతి, చీకటి కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు అధికంగా ఉన్నాయని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. హైవే భద్రతలో కీలకమైన లైటింగ్ వ్యవస్థ సరిగా పనిచేయక పోయినా సంబంధిత అధికారులు పట్టించుకోక పోవడంపై స్థానికులు మండిపడుతున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత స్పందించే బదులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ సమస్యపై జాతీయ రహదారి శాఖ అధికారులు తక్షణమే స్పందించి హైవే దీపాలను పునరుద్ధరించాలని, రాత్రి వేళల్లో సురక్షిత ప్రయాణానికి అవసరమైన చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. హైవేపై చీకట్లు తొలగితేనే ప్రయాణికులకు భద్రత" అని స్థానికులు స్పష్టం చేస్తున్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం..



**మెదక్ జిల్లా వుదయం ప్రతినిధి**

నిజాంపేటమండల పరిధిలోని చల్మెడ గ్రామానికి చెందిన వెంకట నారాయణ రోడ్డు ప్రమాదంలో మరణించడం జరిగింది. ఇట్టి విషయాన్ని తెలుసుకున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు లీలా గ్రూప్ చైర్మన్ మీనాక్షి డాక్టర్ మోహన్ నాయక్, శుక్రవారం వారి కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి రూ. 5వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బొమ్మెన మల్లేశం,ఉప సర్పంచ్ మహేందర్,రమేష్, నర్సింలు,అబ్బాస్,స్వామి, కనకయ్య,నారాయణ, సురేష్,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముందస్తు పరీక్షలే ఆరోగ్య రక్షణ.. ఆదివారం ఉచిత షుగర్ – బీపీ శిబిరం

**నాగర్ కర్నూల్ జూన్ 12 (వుదయం ప్రతినిధి)**

ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడంతో పాటు మధుమేహం, రక్తపోటు వంటి వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించేందుకు సంతబజార్ లోని వివేక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత షుగర్ – బీపీ పరీక్షల శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు సందడి రవీందర్ రెడ్డి తెలిపారు.ఈ నెల 14వ తేదీ ఆదివారం ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు నాగర్‌కర్నూల్ బాయ్స్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈ శిబిరం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు. వాకింగ్ చేసే వారితో పాటు సాధారణ ప్రజలకు కూడా ఉచితంగా షుగర్, బీపీ పరీక్షలు నిర్వహించి వైద్యుల సలహాలు అందజేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఇతర ల్యాబ్ టెస్టులు చేసుకునేవారికి 50% డిస్కౌంట్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.ప్రస్తుతం మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా మధుమేహం, రక్తపోటు సమస్యలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఈ ఉచిత ఆరోగ్య శిబిరం ద్వారా ప్రజలు తమ ఆరోగ్య పరిస్థితిని తెలుసుకొని అవసరమైన జాగ్రత్తలు తీసుకునే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ఉచిత ఆరోగ్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని వివేక్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ నిర్వాహకులు కోరారు.

## కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపిన బి కే ఎస్ నాయకులు



**నారాయణపేట జూన్12 (వుదయం ప్రతినిధి)**

నారాయణపేట జిల్లాలో మూతపడిన సమీకృత మార్కెట్ ను జిల్లా కలెక్టర్ ప్రియాంక మళ్లీ ప్రారంభించిన సందర్భంగా నారాయణపేట భారతీయ కిసాన్ సంగ్ నాయకులు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మెయిన్ బజార్ బస్టాండ్ ఎదురుగా రైతులకు ప్రజల సౌకర్యార్థము అందరికీ వినియోగం ఉండే విధంగా అన్ని రకాల పండ్లు పూలు కూరగాయలు చిరుధాన్యాలు వ్యవసాయ ఉత్పత్తులు సేంద్రీయ ఉత్పత్తులు మహిళా సంఘాలు ఏర్పాటు చేసిన వివిధ కళావృత్తులు వివిధ ఆహార పదార్థా జొన్న రొట్టెలు సజ్జ రొట్టెలు గోధుమ చపాతీలు భక్షాలు వివిధ చిరుధాన్యాల వ్యాపారులకు అనుకూలంగా ఉన్నందుకు వారు కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలిపారు.

కృతజ్ఞతలు తెలిపిన వారిలో భారతీయ కిసాన్ సాంగ్ రాష్ట్ర జోనల్ కార్యదర్శి నాయకుడు వెంకోబా, జిల్లా కమిటీ కార్యదర్శి అనంతరెడ్డి, శరణమయ్యప్ప స్వామి, మైపాల్ రెడ్డి ,నగర అధ్యక్షుడు ఆకుల వెంకటప్ప, ఉపాధ్యక్షుడు లక్ష్మీనారాయణ ,తంగు విశ్వనాథ్ రెడ్డి ,బాపనపల్లి రాము, రంగారెడ్డి రైతులు రైతు సంఘం నాయకులు పాల్గొన్నారు.

## మైనర్ బాలికపై హత్యాచారం దారుణం

**నాగర్ కర్నూల్ జూన్ 12 (వుదయం ప్రతినిధి)**



ఖమ్మం జిల్లాలో ఈనెల 6న 12 సంవత్సరాల బాలికపై మహమ్మద్ గౌస్ జరిపిన హత్యాచార హత్యాయత్నం అత్యంత దారుణమని విశ్వహిందూ పరిషత్ అధ్యక్షులు శివయ్య గౌడ్ కార్యదర్శి బాలస్వామి కోశాధికారి మిడిదొడ్డి చంద్రశేఖర్ మండిపడ్డారు. ఓటు బ్యాంకు రాజకీయాల కోసం హిందువులపై దాడులు జరుగుతున్న కఠిన శిక్షలు వేయడంలో విఫలం చెందడం వల్ల ఇటువంటి దారుణాలు రోజురోజుకు పెరుగుతున్నాయని ప్రభుత్వం వెంటనే నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మహిళలపై బాలికలపై జరుగుతున్న అత్యాచారాలు ఇతర నేరాల విషయంలో బాధితులకు త్వరితగతిన శిక్షపడేలా అన్ని చర్యలు తీసుకోవాలని కోరారు. మహిళల భద్రతా విషయంలో ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మత తీవ్రవాదులపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాధిత కుటుంబానికి 10 లక్షల పరిహారం చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని మహమ్మద్ గౌస్ ను ఉరితీయాలని డిమాండ్ చేశారు ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపడతామని హెచ్చరించారు ఈ సమావేశంలో నాయకులు వెంకటేశ్వర శర్మ ప్రభాకర్ రెడ్డి బుచ్చన్న కండే సాయి శంకర్ తదితరులు పాల్గొన్నారు

## బాలకార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

**- బాలకార్మిక నిర్మూలన పోస్టర్ ను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్**

**కామారెడ్డి, జూన్ 12 (వుదయం ప్రతినిధి):-**

ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బాల కార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అన్నారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

బాల్యం అనేది ప్రతి చిన్నారి హక్కు అని, పిల్లలు విద్యను అభ్యసిస్తూ ఆరోగ్యకరమైన వాతావరణంలో ఎదగాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ పిల్లల విద్య, ఆరోగ్యం, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం చూపుతుందని తెలిపారు.

జిల్లాలో బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన కోసం సంబంధిత శాఖలు సమన్వ తల్లిదండ్రులు తమ పిల్లలను పనులకు పంపకుండా పాఠశాలలకు పంపాలని, బాల కార్మికులు ఎక్కడైనా కనిపిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు, విద్యాసంస్థలు, ప్రజా ప్రతినిధులు, పౌర సమాజం భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. "ప్రతి చిన్నారికి విద్య – ప్రతి చిన్నారికి బాల్యం" అనే లక్ష్యంతో బాల కార్మిక రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఆకాంక్షించారు.

# మంథనిలో ఎస్సీ బాలికల ఎస్ఎంహెచ్ హాస్టల్‌ను పునఃప్రారంభించాలి: ఎస్ఎఫ్ఐ



మంథని, జూన్ 12: (వుదయం ప్రతినిధి) మంథనిలోని ఎస్సీ బాలికల (ఎస్ఎంహెచ్) హాస్టల్‌ను తిరిగి ప్రారంభించి పేద విద్యార్థినులకు విద్యా సౌకర్యాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్ డిమాండ్ చేశారు.

హాస్టల్ తరలింపు అంశంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మంథని నుంచి హాస్టల్‌ను పెద్దపల్లికి తరలించడం వల్ల స్థానిక పేద విద్యార్థినుల చదువుకు ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. గతంలో ఎస్ఎఫ్ఐ పోరాటాల ఫలితంగా హాస్టల్‌కు ప్రత్యేక వార్డెన్‌ను నియమించినప్పటికీ, ప్రస్తుతం హాస్టల్‌ను మూసివేసే విధంగా అధికారులు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.

మంథనిలోనే హాస్టల్‌ను వెంటనే పునఃప్రారంభించాలని, లేని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో డీవైఎఫ్ఐ, వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, దళిత ఐక్యవేదిక, విద్యార్థి జేఏసీ తదితర సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# టిఫిన్ బైఠక్ కార్యక్రమం లో పాల్గొన్న బిజెపి నాయకులు



కరీంనగర్ జూన్ 12(వుదయం ప్రతినిధి): మానకొండూరు మండల కేంద్రంలోని భారత ప్రధాని నరేంద్ర మోడీ 12 సంవత్సరాల సేవ స్ఫూర్తితో మానకొండూర్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో మన బడి-మన బాధ్యత కార్యక్రమంలో భాగంగా రేపు జరిగే స్వచ్ పాఠశాల పరిశుభ్రం చేయడానికి చర్చించుకొని టిఫిన్ బైఠక్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు అప్పని తిరుపతి, సొన్నకుల శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి భాష బోయిన ప్రదీప్ యాదవ్, మండల ఉపాధ్యక్షులు మీసా రమణయ్య, మాజీ ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు మార్కొండ రమేష్ పటేల్, నందగిరి బలరాం మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రజలందరు భాగస్వాములు కావాలి



కరీంనగర్ జూన్ 12(వుదయం ప్రతినిధి):బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ చిత్ర మిశ్రా పిలుపునిచ్చారు. ప్రపంచ బాల కార్మిక వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం కలెక్టరేట్ లోని తన చాంబర్ లో కార్మిక శాఖ రూపొందించిన పోస్టర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 14 ఏళ్లలో పిల్లలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వారు పాఠశాలకు వెళ్లి చదువుకునేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. బాల కార్మికులు కనిపిస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ కోలా ప్రసాద్, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వెంకటరమణ పాల్గొన్నారు.

# హెల్త్ కార్డులకు ఎదురు చూపులేనా...?

**జూన్ 2 దాటినా కార్డులు అందని పరిస్థితిపై ఉద్యోగులు పెన్షనర్ల ఆందోళనలు...**
**నెల ప్రీమియం చెల్లించినా వైద్యం అందని తీరు...**

జగిత్యాల జూన్ 12 (వుదయం ప్రతినిధి) రెండు మూడు రోజుల్లో ఈహెచ్ఎస్ ట్రస్ట్ ఏర్పాటు చేసి పది రోజుల్లో హెల్త్ కార్డులు ఇచ్చి ఉచిత నగదు రహిత వైద్యం ను అందిస్తాం అని ఉద్యోగ పెన్షనర్ల సంఘాలకు ప్రభుత్వం ఇచ్చిన హామీ అమలుకు ఎదురు చూపులు తప్పడం లేని పరిస్థితి నెల కొంది జూన్ నెల నుంచే ప్రీమియం వసూలు చేస్తామన్న ప్రభుత్వం మే నెల నుంచే కోత విధించిందని ఈ నెల నుంచే ప్రీమియం చెల్లించినా ఉద్యోగులు ఉపాధ్యాయులు పెన్షనర్లు ఉచిత వైద్యానికి నోచుకోలేక పోతున్నారని తెలంగాణ పెన్షనర్ల రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్ కుమార్ మా ప్రతినిధి తో ఆందోళన వ్యక్తం చేస్తూ పలు అభ్యంతరాలను అయన వ్యక్తం చేశారు సంవత్సరానికి రెండు సార్లు అవుట్ పేషంట్ ట్రీట్మెంట్ అవకాశం కల్పించాలని అవసరమైన మందులు ఇవ్వాలని వైద్య పరీక్షలు చేయాలని కోరారు ఆయుర్వేద యునాని హోమియో సిద్ద వైద్య న్యాచురోపతి వైద్యం కు అవకాశం కల్పించాలి జూనియర్ల చెల్లింపు ప్రీమియం తక్కువగా ఉండగా ఇంట్లో అర్హులైన అందరికి హెల్త్ కార్డు వర్తిస్తుంది అదే రిటైర్మెంట్ కు దగ్గరగా ఉన్న వారు చెల్లించే ప్రీమియం అధికంగా ఉంటుంది పైగా భార్య భర్త లు ఇద్దరికీ వర్తిస్తుంది ఉద్యోగుల మూల వేతనం నుంచి 1.5 శాతాన్ని ప్రీమి యంగా వసూలు చేస్తున్నారు 1.5 శాతం కోత విధిస్తే వయోపరిమితి ఉండకుండా చూడాలని నగదు రహిత వైద్యం ఎలా అందుతుంది? ఏయే ఆస్పత్రులు ఈ పరిధి లోకి వస్తాయి? అనే విషయాలపైన ఇంకా ట్రస్ట్ స్పష్టం చేయక పోవడం పైన ఉద్యోగులు పెన్షనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు సిపిఎస్ ఉద్యోగులకు రిటైర్డ్ సిబ్బంది కి ఆరోగ్య భద్రత పైన సరైన హామీల లేకపోవడంతో భవిష్యత్ పైన అనుమానాలు నెలకొన్నాయని ఎలాంటి స్పష్టత లేకుండా ఏక పక్షంగా వేతనాల్లో కోత విధించడం చట్ట విరుద్ధం అని అలాగే ఉద్యోగులు పెన్షనర్లు అయిన భార్యా భర్తలకు ఒక్కరికే వేతనంలో ఆరోగ్య కార్డు కోసం 1.5 శాతం మినహాయింపు చేయాలని ఉండాలని కోరుతున్నామన్నారు పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ ప్రయోజనాలు చెల్లించడ ములో జరుగుతున్న జాప్యం పైన తమ అసోసియేషన్ సభ్యులు హైకోర్టు ను ఆశ్రయిస్తే హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేస్తూ తదుపరి విచారణ 2 వారాలకు వాయిదా వేసిందని హరి అశోక్ కుమార్ పెన్షనర్ల సమాచారం కోసం తెలిపారు

# దౌర్జన్యం చేస్తున్న కూతురుపై తండ్రి ఫిర్యాదు...



జగిత్యాల జూన్ 12 (వుదయం ప్రతినిధి) తన పెద్ద కూతురు పద్మ తన పేరు మీద ఉన్న ఇంటిని అక్రమంగా గ్రామ పంచాయతిలో మార్పించుకోవడమే కాక తన జీవితావసరాల కోసం దాచుకున్న 10 లక్షల రూపాయలను బలవంతంగా తీసుకొని పోషించక తన భర్త తో కలిసి దౌర్జన్యం చేస్తోందని తన ఇల్లును తన పేరిట మార్పించాలని తీసుకున్న 10 లక్షల రూపాయలు ఇప్పిస్తూ ప్రతి నెల పెద్ద కూతురు పద్మ చిన్న కూతురు వరలక్ష్మి మరణించిన కొడుకు మల్లేశం భార్య అయిన కోడలు భాగ్య నుంచి ప్రతి నెల పోషణ వైద్య ఖర్చుల కోసం ఒక్కొక్కరి నుంచి 5 వేల రూపాయలు ఇప్పించాలని జగిత్యాల రూరల్ మండలం ధర్మారం గ్రామానికి చెందిన గోస్కుల బుచ్చయ్య (80) అనే వృద్ధుడు సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ను ఆశ్రయించి అయన సాయంతో జగిత్యాల ఆర్డీవోకు ఫిర్యాదు చేయగా వృద్ధుల పోషణ రక్షణ చట్టం కింద కేసు నమోదు చేశారు అనంతరం సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఆయన విలేకరులకు తన గోడు వినిపించారు తనకు సంబందించిన ఇంటిని తన పెద్ద కూతురు పద్మ అక్రమంగా గ్రామ పంచాయతీ లో తన పేరిట మార్పు చేసుకుందని అంతే కాకుండా తన జీవితావసరాల కోసం దాచుకున్న 10 లక్షల రూపాయలను బలవంతంగా తీసుకొని ఇవ్వమని ప్రాధేయ పడితే కూతురు అల్లుడు తనపై దౌర్జన్యం చేస్తున్నారని నా ఆస్తి ని మొత్తం తన కూతుర్లు ఇద్దరికీ మరణించిన కొడుకు కు సమానంగా పంచి ఇచ్చానని వారు ప్రతి నెల పోషణ వైద్య ఖర్చులు ఇవ్వకపోవడంతో వృద్దాప్యంలో పలు ఆర్థిక శారీరక ఇబ్బందులు పడుతున్నానని నా పెద్ద కూతురు అక్రమంగా మార్పు చేసుకున్న తన ఇంటిని తన పేరు మీద మార్పించాలని తన నుంచి బలవంతంగా తీసుకున్న 10 లక్షల రూపాయలను పోషణ వైద్య ఖర్చులు ఇప్పించాలని ఈ విషయంలో కలెక్టర్ ఎస్పీ లకు ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షులు న్యాయవాది హరి అశోక్ కుమార్ వృద్ధుల చట్టం కాన్సిలియేషన్ అధికారి పిసి హన్మంత్ రెడ్డి సీనియర్ సిటిజన్స్ ప్రతినిధులు వెల్ముల ప్రకాష్ రావు ఎండి యాకూబ్ తదితరులు పాల్గొన్నారు



# ఆకస్మిక తనిఖీ

పెద్దపల్లి జూన్ 12 (వుదయం ప్రతినిధి) :పెద్దపల్లిలో ఫెర్టిలైజర్ షాపులను ఆకస్మిక తనిఖీ చేసిన ణూూా శ్రీనివాస్... పెద్దపల్లి పట్టణ కేంద్రంలోని పలు ఫెర్టిలైజర్ షాపు లో తనిఖీ చేసిన ణూూా శ్రీనివాస్ షాపులో రికార్డులను పరిశీలించారు ఎప్పటికప్పుడు రికార్డు మైంటైన్ చేయాలని ఫెర్టిలైజర్ షాప్ యజమానులకు సూచించారు. రాబోయేది వర్షాకాల సీజన్ కు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలని అన్నారు మనకు వర్షపాతం తక్కువ ఉంటే దానికి అనుగుణంగా సాగు చేసుకుంటే మంచి దిగుబడి వచ్చే అవకాశం ఉంటుందని రైతులకు కావలసిన యూరియా సరఫరా చేసే దిశలో ప్రభుత్వ సిద్ధంగా ఉందని రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రైతులకు వ్యవసాయ శాఖ తరపున పలు సూచనలు చేశారు ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లయితే డీలర్లపై షాపు లైసెన్స్ రద్దుచేసి క్రిమినల్ కేసులు నమోదు చేయబడుతుందని హెచ్చరించారు.

## రామాలయ గుడి నిర్మాణాన్ని కూల్చేసిన మున్సిపల్ అధికారులు



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ భీముని దెబ్బ మద్దనపల్లి రామకృష్ణ ఇంటి ముందు రాములవారి గుడి చిన్నగా కట్టుకుంటే హిందువుల ఆరాధ్య దైవమైన శ్రీరాములవారికుడిని మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వచ్చి కూల్చివేశారు రోడ్డుపై ఎన్నో మతాలకు చెందిన దర్గాలు చర్చిలు ఉండగా కేవలం దీనిపై కక్ష కట్టి ఉల్చివేయడం వెనక ఆంతర్యం ఏమిటని హిందువుల మనోభావాలు దెబ్బతీసే విధంగా మున్సిపల్ అధికారులు వ్యవహరించడం చాలా బాధాకరంగా ఉందని స్థానిక ప్రజలు చర్చించుకుంటున్నారు

## కాలిపోయిన ఈతవణాన్ని పరిశీలించిన జువ్వాడి కృష్ణారావు



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల మండలం కల్లూర్ లో ప్రమాదవశాత్తు ఈతవనం కాలిపోగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వడి కృష్ణారావు సందర్శించారు ఈతవనం కాలిపోవడం బాధాకరమని గీతా కార్మిక సోదరులు పని కోల్పోతారని అన్నారు బాధితులను ఆదుకోవాలని సంబంధిత అధికారులను కోరారు ఈ కార్యక్రమంలో జువ్వాడి కృష్ణారావు తో పాటు రెవిన్యూ ఎక్సయిజ్ శాఖల అధికారులు నియోజకవర్గ యువజన కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు ఏలేటి మహిపాల్ రెడ్డి స్థానిక గీత కార్మికులు కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## కూల్చిన రామాలయ గుడికి టెంకాయ కొట్టి పనులను ప్రారంభించిన కమిషనర్



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ భీముని దిబ్బ ప్రాంతంలో గల హిందువులు ఐక్యతతో యువకులు పెద్దలు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయానికి తరలి వెళ్లి కమిషనర్ కి రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు వెంటనే స్పందించిన కమిషనర్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల వల్ల జరిగిన తప్పిదాన్ని ప్రశ్నిస్తూ దేవాలయ వద్దకు చేరుకొని సమస్యను పరిష్కారం చేసి కమిషనర్ స్వయంగా కొబ్బరికాయ కొట్టి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు ఇట్టి కార్యక్రమానికి కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర లకు భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ మాడవేలి నరేష్ భీముని దుబ్బా ప్రాంత ప్రజలు మున్సిపల్ చైర్ పర్సన్ కు కమిషనర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు హిందువుల ఐక్యత వర్ధిల్లాలి జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ ప్రజలు నినాదాలు చేశారు

# రాజకీయ విమర్శలు హుందాగా ఉండాలి

**మహిళలను రాజకీయాల్లోకి లాగడం సరికాదు: కాంగ్రెస్ నాయకులు**



మంథని, జూన్ 12 వుదయం (ప్రతినిధి):రాజకీయాల్లో విమర్శలు ప్రజా సమస్యలు, అభివృద్ధి అంశాలపైనే ఉండాలని, రాజకీయాలతో సంబంధం లేని మహిళలను వివాదాల్లోకి లాగడం సరికాదని కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శుక్రవారం మంథనిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు.

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, ఆయనపై వ్యక్తిగత విమర్శలు చేయడం తగదన్నారు. కుల, మత ప్రస్తావనలతో రాజకీయాలు చేయడం మానుకోవాలని సూచించారు.రాజకీయాలతో సంబంధం లేని మహిళల పేర్లను ప్రస్తావించడం ప్రజాస్వామ్య సంస్కృతికి విరుద్ధమని పేర్కొన్నారు. వ్యక్తిగత దూషణలకు బదులుగా అభివృద్ధి అంశాలపై చర్చ జరగాలని కోరారు.మంత్రి శ్రీధర్‌బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు మంథని అభివృద్ధికి కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, సర్పంచులు లక్కాకుల సత్యనారాయణ. నాగుల రాజయ్య. తోట పోశయ్య. పంతంగి లక్ష్మణ్. మాజీ ఎంపిటీల పోరం అధ్యక్షులు ఉదరి శంకర్. మాజీ సర్పంచులు ఎరుకల మధు. దోరగొర్ల శ్రీనివాస్. ఎస్సీ సెల్ మండల ప్రధాన కార్యదర్శి అక్కపాక సదయ్య. మైనార్టీ సెల్ మండల వైస్ ప్రెసిడెంట్ ఎండి సల్మాన్. కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా ఇంచార్జ్ ఆరెల్లికిరణ్ గౌడ్. బీసీ సెల్ మంథని టౌన్ ప్రధాన కార్యదర్శి కందుకూరి రామ్మూర్తి. నాయకులు కన్న వేణి రమేష్ యాదవ్. తదితరులు పాల్గొన్నారు

# గాలి వానకు కరెంట్ వైర్ తెగి 3 మేకల మృతి

**ఒకే చోట రెండు ట్రాన్స్ఫార్మరలు**
**ప్రమాదకరం గా 11 ఎజ లైన్**
**కోతులు ఊపితే ఊగే స్తంబాలు**
**భయంతో వార్డు ప్రజలు, వద్దన్నా మరో లైన్**



మెట్ పల్లి (ఇబ్రహీంపట్నం ), జూన్ 12 (వుదయం ప్రతినిధి )జగిత్యాల జిల్లా మెట్ పల్లి మండలం బండలింగపూర్ గ్రామంలో వేకువ జామున కురిసిన గాలి వానకు 3 మేకలు మరణించడం జరిగింది, సంఘటన వివరాలు ఇలా ఉన్నవి, వేకువ జామున ( ఉదయం ) 4 గంటలకు మేకలు కోయటానికి అని కటిక సతీష్ (46) తన కొట్టం నుండి మేకలు తీసుకొని ఇంటికి వచ్చే క్రమంలో అప్పటికే గాలి ధుమారం, వాన రావటం తో కరెంట్ వైర్ తెగి కింద పడి పోయింది, రోడ్డు పై వర్షం నీరు ఆగటం, దాని నుండి మేకలు వెళ్ళటంతో మేకలకు షాక్ తగిలింది, రోడ్డు పై తాడు పడింది అని భావించి, దాన్ని తీసే క్రమంలో కటిక సతీష్ కు షాక్ వచ్చింది, వెంటనే ప్రక్కకు జరగటం తో పెద్ద ప్రమాదం తప్పిశీది, ఈ కరెంట్ షాక్ తో 3 మేకలు అక్కడికక్కడే మృతి చెందినవి, విచిత్రం ఏమిటి అంటే దగ్గర లోనే ఒకే చోట రెండు ట్రాన్స్ఫార్మర్ లు ఉండటం, వార్డు ప్రజలు వద్దన్నా వినకుండా గత 20 రోజుల క్రితం పాత స్తంభాల పక్కనే కొత్త స్తంబాలు వేసి లైన్ ను వేరే ఏరియా కు ఇచ్చారు,

రోడ్డు కు మరో వైపున రిలయన్స్ టవర్ కు కరెంట్ సప్లై కొరకు విద్యుత్ శాఖ 11 ఎజ వైర్లు వేసి ఉన్నారు, ఇవి ఇళ్లపై నుండి వెళ్లడం ప్రమాదకరం గా ఉన్నవి, ప్రతి రోజు కోతుల గుంపు స్థంబాలు ఎక్కి ఊగడం పరి పాటుగా మారింది, వైర్ లు ఊడి ఎప్పుడు స్థంబాలు పడిపోతాయో అని ప్రజలు భయపడుతూ ఉన్నారు, కావున ప్రభుత్వ అధికారులు మరియు విద్యుత్ శాఖ అధికారులు స్పందించి కరెంట్ వైర్ లు సరి చేయాల్సిఉదిగా 3 వ వార్డు ప్రజలు కోరుచున్నారు , నిరుపేద కటిక సతీష్ కు చెందిన 3 మేకల విలువ సుమారు 30 వేల రూపాయలు. ఉంటుంది, కావున అజూఎశ్రీ సంస్థ నుండి నష్టపరిహారం ఇవ్వాల్సిన దిగా ప్రజలు కోరుచున్నారు,

# ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై బిఎల్ఏ లకు అవగాహన

**ముఖ్యఅతిథులుగా తెలంగాణ రాష్ట్ర వేలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పరిశీలకులు రుద్ర సంతోష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు**



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆదేశాల మేరకు శుక్రవారం కోరుట్ల పట్టణ కావేరి గార్డెన్ లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై బిఎల్ఏ లకు అవగాహన శిక్షణ కార్యక్రమం పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ ఆధ్వర్యంలో నిర్వహించారు ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పోరేషన్ ఛైర్మన్ కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు పీసీసీ జనరల్ ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పరిశీలకులు రుద్ర సంతోష్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ రాష్ట్ర నాయకులు జువ్వాడి కృష్ణారావు లు హాజరై ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై బిఎల్ఏ లకు అవగాహన కల్పించారు ఈ సందర్భంగా బిఎల్ఏ లకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కిట్లను అందజేశారు అనంతరం వారు మాట్లాడుతూ ప్రతి ఒక్క బిఎల్ఏ వద్ద పిసిసి అందజేసిన కిట్లు తప్పనిసరిగా ఉండాలని సూచించారు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై బిఎల్ఏ లు అప్రమత్తంగా ఉండాలన్నారు ఇప్పటికే పలు రాష్ట్రాల్లో ఎన్నికల సంఘం అధికారులు నిర్వహించిన సర్ కార్యక్రమంలో లక్షలాది మంది ఓట్లు గల్లంతయ్యాయని తెలిపారు బిఎల్ఏ లు ప్రత్యేక శ్రద్ధ వహించి అర్హులైన వారి ఓట్లు రద్దు కాకుండా చూడాలని కోరారు అనంతరం (సర్) పరిశీలకులు రుద్ర సంతోష్ లైవ్ డెమో ద్వారా బిఎల్ఏ లకు ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై అవగాహన కల్పించారు ఈ కార్యక్రమంలో జగిత్యాల జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు గాజంగి నందయ్య కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ పిసిసి జాయింట్ సెక్రటరీ బండ శంకర్ కోరుట్ల పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తిరుమల గంగాధర్ మెట్ పెల్లి పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రైసొద్దీన్ కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పన్నాల అంజిరెడ్డి జగిత్యాల జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు రమేష్ జగిత్యాల జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు ఎల్లాల జలపతి రెడ్డి జగిత్యాల జిల్లా సేవాదళ్ అధ్యక్షులు నాయిని సురేష్ గౌడ్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ వివిధ హోదాల నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు


# కూల్చిన రామాలయ గుడికి టెంకాయ కొట్టి పనులను ప్రారంభించిన కమిషనర్



కోరుట్ల జూన్ 12 (వుదయం ప్రతినిధి) కోరుట్ల పట్టణ భీముని దిబ్బ ప్రాంతంలో గల హిందువులు ఐక్యతతో యువకులు పెద్దలు పెద్ద సంఖ్యలో మున్సిపల్ కార్యాలయానికి తరలి వెళ్లి కమిషనర్ కి రాతపూర్వకంగా వినతి పత్రాన్ని అందజేశారు వెంటనే స్పందించిన కమిషనర్ మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల వల్ల జరిగిన తప్పిదాన్ని ప్రశ్నిస్తూ దేవాలయ వద్దకు చేరుకొని సమస్యను పరిష్కారం చేసి కమిషనర్ స్వయంగా కొబ్బరికాయ కొట్టి గుడి నిర్మాణాన్ని ప్రారంభించారు ఇట్టి కార్యక్రమానికి కోరుట్ల మున్సిపల్ చైర్ పర్సన్ తిరుమల వసంత గంగాధర్ మున్సిపల్ కమిషనర్ రాఘవేంద్ర లకు భారతీయ జనతా పార్టీ కోరుట్ల పట్టణ అధ్యక్షులు కస్తూరి లక్ష్మీనారాయణ ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రుద్ర శ్రీనివాస్ జగిత్యాల జిల్లా భారతీయ జనతా పార్టీ ఎండోమెంట్ సెల్ కన్వీనర్ మాడవేలి నరేష్ భీముని దుబ్బా ప్రాంత ప్రజలు మున్సిపల్ చైర్ పర్సన్ కు కమిషనర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు హిందువుల ఐక్యత వర్ధిల్లాలి జై శ్రీరామ్ జై శ్రీరామ్ అంటూ ప్రజలు నినాదాలు చేశారు

# చక్కని ఆరోగ్యం

# గుండె ఆరోగ్యానికి బ్లాక్ కాఫీ?



బ్లాక్ కాఫీ ప్రపంచంలో అత్యంత ప్రజాదరణ పొందిన పానీయాలలో ఒకటి. పాలు లేదా చక్కెర లేకుండా తయారు చేసే బ్లాక్ కాఫీ ఆరోగ్యానికి మంచిదిగా పరిగణిస్తారు. వైద్య పరిశోధనల ప్రకారం, ఇది గుండె జబ్బులను తగ్గించడంలో సహాయపడవచ్చు. ఇందులో కేలరీలు ఉండవు, యాంటీఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యాన్ని కాపాడటానికి ఉపయోగపడతాయి. మితంగా బ్లాక్ కాఫీ తాగడం వల్ల శరీరంలో జీవక్రియ మెరుగుపడి ఆకలి తగ్గుతుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. బ్లాక్ కాఫీలో ఉండే కెఫిన్ ఒక ఉత్సాహాన్ని ఇచ్చే పదార్థం. ఇది కొంత మందిలో తాత్కాలికంగా రక్తపోటు, గుండె వేగాన్ని పెంచుతుంది. క్రమం తప్పకుండా కాఫీ తాగని వారిలో ఈ ప్రభావం ఎక్కువగా కనిపిస్తుంది. కాలిఫోర్నియా యూనివర్సిటీ అధ్యయనం ప్రకారం, కెఫిన్ శరీరంలో నొరాడ్రినలిన్, నొరెపినెఫ్రిన్ వంటి హార్మోన్లను పెంచుతుంది. దీనివల్ల హృదయ స్పందన వేగం, రక్తపోటు పెరగవచ్చు. బ్లాక్ కాఫీలో ఉండే పాలీఫెనాల్స్, యాంటీఆక్సిడెంట్లు శరీరంలో వేడి ఉత్పత్తిని పెంచి శక్తి వినియోగాన్ని ఎక్కువ చేస్తాయి. దీంతో బరువు తగ్గడంలో సహాయపడుతుంది. రోజుకు 2–3 కప్పుల బ్లాక్ కాఫీ తాగడం వల్ల గుండెపోటు, కరోనరీ హార్ట్ డిసీజ్ వంటి ప్రమాదాలు తగ్గవచ్చు.

నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ పరిశోధనల ప్రకారం, మితంగా కాఫీ తాగడం వల్ల అధిక రక్తపోటు, గుండె వైఫల్యం, గుండె సమస్యల ప్రమాదం తగ్గవచ్చు. ఇందులోని యాంటీఆక్సిడెంట్లు వాపును తగ్గించి రక్తనాళాల పనితీరును మెరుగుపరుస్తాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ అధ్యయనం ప్రకారం, తీవ్రమైన అధిక రక్తపోటు (160/100 mm Hg లేదా అంతకంటే ఎక్కువ) ఉన్నవారు రోజుకు రెండు లేదా అంతకంటే ఎక్కువ కప్పుల కాఫీ తాగితే గుండె సంబంధిత సమస్యల ప్రమాదం పెరగవచ్చు. ఆరోగ్యవంతులైన పెద్దవారికి రోజుకు 400 మిల్లీగ్రాముల వరకు కెఫిన్ సురక్షితంగా పరిగణిస్తారు. ఫిల్టర్ చేయని కాఫీలో ఉండే సహజ నూనెలు (కెఫెస్టాల్, కహ్వియోల్) చెడు కొలెస్ట్రాల్‌ను పెంచవచ్చు. పేపర్ ఫిల్టర్ ఉపయోగించి తయారుచేసే కాఫీ (డ్రిప్ లేదా పోర్ ఓవర్) ఆరోగ్యానికి మంచిదిగా భావిస్తారు. ఆరోగ్యవంతులు రోజుకు 2 నుంచి 4 కప్పుల వరకు తాగవచ్చు. గుండె సమస్యలు, అధిక రక్తపోటు లేదా గర్భిణీలు కాఫీ తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. మొత్తంగా, చక్కెర లేదా పాలు లేకుండా మితంగా బ్లాక్ కాఫీ తాగడం ఆరోగ్యానికి, ముఖ్యంగా గుండె ఆరోగ్యానికి ప్రయోజనకరంగా ఉండవచ్చు.

## షుగర్ వల్ల జుట్టు రాలుతుందా?



ఇటీవలి కాలంలో మధుమేహం, రక్తంలో అధిక చక్కెర (బ్లడ్ షుగర్) సమస్యలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. సాధారణంగా ఇవి గుండె, మూత్రపిండాలు, కళ్లపై ప్రభావం చూపుతాయని అందరికీ తెలుసు. అయితే రక్తంలో చక్కెర స్థాయిలు ఎక్కువగా ఉండటం వల్ల చర్మం, జుట్టు ఆరోగ్యం కూడా దెబ్బతింటుందని నిపుణులు చెబుతున్నారు.రక్తంలో చక్కెర ఎక్కువకాలం నియంత్రణలో లేకపోతే శరీరంలో రక్తప్రసరణ సరిగా జరగదు. దీంతో చర్మ కణాలకు అవసరమైన పోషకాలు తగినంతగా అందవు. ఫలితంగా చర్మం పొడిబారడం, దురద, ఇన్ఫెక్షన్లు రావడం, గాయాలు త్వరగా మానకపోవడం వంటి సమస్యలు తలెత్తుతాయి. కొంతమందిలో చర్మం రంగులో కూడా మార్పులు కనిపించవచ్చు. అలాగే జుట్టు కుదుళ్లకు సరైన పోషణ అందకపోవడంతో జుట్టు బలహీనంగా మారి ఎక్కువగా రాలే అవకాశం ఉంటుంది. కొత్త జుట్టు పెరుగుదల కూడా నెమ్మదించవచ్చు. తరచుగా దాహం వేయడం. తరచూ మూత్ర విసర్జన చేయడం కారణం లేకుండా బరువు తగ్గడం.చూపు మసకబారడం, తరచూ చర్మ ఇన్ఫెక్షన్లు రావడం, గాయాలు ఆలస్యంగా మానడం, జుట్టు ఎక్కువగా రాలడం, చర్మం, జుట్టు ఆరోగ్యంగా ఉండాలంటే, సమతుల్య ఆహారం తీసుకోవాలి. తీపి పదార్థాలు, ప్రాసెస్డ్ ఫుడ్ తగ్గించాలి. రోజూ వ్యాయామం చేయాలి. తగినంత నీరు తాగాలి. బాగా నిద్రపోవాలి. ఒత్తిడిని తగ్గించుకోవాలి. వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడాలి.

## టీ, కాఫీ, కోలా పానీయాలు.. ఏది పళ్లకు ఎక్కువ హాని చేస్తుంది?

చాలా మంది ఉదయం టీతో రోజు ప్రారంభిస్తారు. ఆఫీసులో కాఫీ తాగుతారు. ఇంకొంత మంది కోలా పానీయాలు కూడా తాగుతారు. కానీ ఈ పానీయాల్లో ఏది పళ్లకు ఎక్కువ హాని చేస్తుందో చాలా మందికి తెలియదు. ఆరోగ్య నిపుణులు తెలిపిన



సమాచారం ప్రకారం.. ఈ మూడు పానీయాలు నోటి ఆరోగ్యంపై ప్రభావం చూపుతాయి కానీ వాటి ప్రభావం వేరుగా ఉంటుంది. పళ్లపై మరకల విషయానికి వస్తే బ్లాక్ టీనే ఎక్కువ ప్రభావం చూపుతుంది. బ్లాక్ టీలో ఉండే టానిన్లు, రంగు పదార్థాలు పళ్ల పై పొర (ఎనామెల్)కు అతుక్కుంటాయి. కాలక్రమేణా ఇవి పళ్లను పసుపు లేదా గోధుమ రంగులోకి మార్చుతాయి. రోజూ ఎక్కువ టీ తాగేవారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. దీర్ఘకాలంగా దంత శుభ్రతను పట్టించుకోకపోతే మరకలు ఇంకా ఎక్కువగా కనిపిస్తాయి. కాఫీ కూడా పళ్లపై మరకలు ఏర్పడేందుకు ప్రధాన కారణాల్లో ఒకటి. ఇందులో ఉండే రంగు పదార్థాలు పళ్ల పైపొరకు అతుక్కుని, కాలక్రమేణా పళ్లను పసుపు లేదా గోధుమ రంగులోకి మారుస్తాయి. ముఖ్యంగా రోజుకు పలుమార్లు కాఫీ తాగే వారిలో ఈ సమస్య ఎక్కువగా కనిపిస్తుంది. కాఫీలో చక్కెర కలపడం వల్ల నేరుగా మరకలు పెరగకపోయినా, అది దంత క్షయం, ఇతర నోటి ఆరోగ్య సమస్యలకు దారితీసే అవకాశం ఉంటుంది. కోలా పానీయాలు పళ్లకు ఎక్కువ హాని చేస్తాయని చాలా మంది భావిస్తారు. అయితే, పళ్లపై మరకలు ఏర్పడే విషయంలో ఇది టీ లేదా కాఫీతో పోలిస్తే తక్కువ ప్రభావం చూపుతుంది. కానీ ఇందులో ఉండే ఆమ్లాలు పళ్లను రక్షించే ఎనామెల్‌ను క్రమంగా బలహీనపరుస్తాయి. ఎనామెల్ దెబ్బతింటే ఇతర ఆహారాలు, పానీయాల వల్ల వచ్చే మరకలు పళ్లకు సులభంగా అంటుకునే అవకాశం ఉంటుంది. అదనంగా, ఇందులోని అధిక చక్కెర దంత క్షయం ప్రమాదాన్ని కూడా పెంచుతుంది.

పళ్లను కాపాడుకునే సూచనలు: టీ,కాఫీ, కోలా పానీయాలు తాగిన తర్వాత నీటితో నోరు పుక్కిలించాలి. కోలా పానీయాలు తాగిన వెంటనే బ్రష్ చేయకూడదు. స్ట్రా ఉపయోగించడం మంచిది. చక్కెర తగ్గించాలి.

## వాతావరణ మార్పుల వల్ల కీళ్ల నొప్పులు..

ఇటీవలి కాలంలో దేశంలోని పలు ప్రాంతాల్లో వాతావరణ పరిస్థితులు తరచూ మారుతున్నాయి. ఎండలు, వర్షాలు, ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులు ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపుతున్నాయి. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం, ఉష్ణోగ్రతలో వచ్చే మార్పులు కొంతమందిలో కీళ్ల నొప్పులను పెంచే అవకాశం ఉంది. ముఖ్యంగా చల్లటి వాతావరణం లేదా తేమ అధికంగా ఉన్న రోజుల్లో కీళ్లలో



బిగుతు, నొప్పి, భారంగా అనిపించడం వంటి సమస్యలు కనిపించవచ్చు. ఉదయం నిద్రలేచిన వెంటనే లేదా ఎక్కువసేపు ఒకే భంగిమలో కూర్చున్న తర్వాత ఈ లక్షణాలు మరింత ఎక్కువగా అనిపిస్తాయి. అయితే వాతావరణ మార్పుల ప్రభావం ప్రతి ఒక్కరిపై ఒకే విధంగా ఉండదు. కొందరికి ఎలాంటి ఇబ్బందులు లేకపోయినా, మరికొందరు మాత్రం కీళ్ల నొప్పులతో ఎక్కువగా ఇబ్బంది పడే అవకాశం ఉంటుంది.

వాతావరణం మారినప్పుడు కీళ్ల నొప్పులు కొంత మందిలో పెరగడం సాధారణమే. అయితే నొప్పి ఎక్కువకాలం కొనసాగినా, రోజువారీ పనులకు ఆటంకం కలిగించినా నిర్లక్ష్యం చేయకూడదు. సరైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఆరోగ్యకరమైన జీవనశైలితో కీళ్ల ఆరోగ్యాన్ని మెరుగ్గా కాపాడుకోవచ్చు.

## రోజూ వ్యాయామం చేయడం ఆరోగ్యానికి మంచిదేనా?

నేటి బిజీ జీవితంలో ఆరోగ్యంగా ఉండటం చాలా ముఖ్యం. అందుకు రోజూ వ్యాయామం చేయడం మంచి అలవాటు. ఇది శరీరాన్ని దృఢంగా ఉంచడమే కాకుండా, మానసిక ఆరోగ్యాన్ని



కూడా మెరుగుపరుస్తుంది. అందుకే.. రోజూ కనీసం కొంత సమయం వ్యాయామానికి కేటాయించాలని నిపుణులు సూచిస్తున్నారు. వ్యాయామం చేయడం వల్ల శరీరంలో సంతోషాన్ని కలిగించే హార్మోన్లు విడుదలవుతాయి. దీంతో మనసు ప్రశాంతంగా ఉండి, ఉత్సాహం పెరుగుతుంది. రోజూ వ్యాయామం చేస్తే శరీరంలో ఉన్న అదనపు కేలరీలు ఖర్చవుతాయి. దీంతో బరువు నియంత్రణలో ఉండటమే కాకుండా, స్థూలకాయం సమస్య కూడా తగ్గుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల గుండె జబ్బులు, మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుంది. అలాగే కొన్ని రకాల క్యాన్సర్ల నుంచి కూడా రక్షణ లభిస్తుంది. ఒత్తిడి, ఆందోళనతో బాధపడుతున్నవారికి వ్యాయామం మంచి పరిష్కారం. రోజూ అరగంట నడక కూడా మనసుకు ప్రశాంతతను అందిస్తుంది. వ్యాయామం కండరాలను బలపరచి శరీరానికి కావాల్సిన శక్తిని పెంచుతుంది. దీంతో రోజంతా చురుకుగా ఉండగలుగుతారు. నిద్రలేమి సమస్యతో బాధపడేవారికి వ్యాయామం ఎంతో ఉపయోగకరం. ఇది త్వరగా నిద్రపోవడానికి సహాయపడుతుంది. రోజూ వ్యాయామం చేయడం వల్ల మనస్సు ప్రశాంతంగా ఉంటుంది. జ్ఞాపకశక్తి, ఏకాగ్రత, ఆలోచనా శక్తి మెరుగుపడి సానుకూల దృక్పథం పెరుగుతుంది. రోజూ కొద్దిసేపు వ్యాయామం చేయడం ద్వారా శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండవచ్చు. ఆరోగ్యకరమైన జీవనశైలికి వ్యాయామం ఒక ముఖ్యమైన భాగం. కాబట్టి రోజువారీ జీవితంలో వ్యాయామాన్ని తప్పనిసరిగా భాగం చేసుకోవడం మంచిది.

## సౌందర్య పోషణకూ.. కాఫీ!

'కొంచెం కాఫీ తాగితే ఎంత హాయిగా ఉంటుందో..!' కాఫీ ప్రియులు తరచుగా చెప్పే మాట ఇది. మూడ్‌ని ఉల్లాసంగా మార్చే కాఫీ సౌందర్య పోషణలోనూ ఉపకరిస్తుందంటున్నారు నిపుణులు. కాఫీ పొడి/గింజల వల్ల ఎన్నో సౌందర్యపరమైన ప్రయోజనాలున్నాయని చెబుతున్నారు. కాఫీపొడి చర్మానికి మంచి స్క్రబ్‌గా పని చేస్తుందట. ఇది చర్మంపై ఉన్న మృతకణాలను సులభంగా తొలగిస్తుందట. ఇందుకోసం స్నానం చేసే సమయంలో కాఫీపొడిని నూనె/జెల్‌తో కలిపి చర్మంపై రుద్దుకుంటే సరిపోతుందట. స్క్రబింగ్ కోసం కాఫీ గింజలను సైతం వాడచ్చంటున్నారు నిపుణులు. కాఫీ యాంటీ ఏజింగ్ ఏజెంట్‌లా కూడా పని చేస్తుందట. దీనికోసం రెండు కప్పుల కాఫీ గింజలకు ఒక కప్పు నీటిని, కొన్ని చుక్కల టీట్రీ నూనెను కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్లెండర్‌తో బాగా కలిపి, బ్రష్‌తో ముఖానికి రాసుకోవాలి. కాసేపటి తర్వాత చల్లని నీటితో శుభ్రం చేసుకోవాలి. ఈ మిశ్రమం చర్మాన్ని బిగుతుగా మార్చుతుందని చెబుతున్నారు నిపుణులు.



జుట్టును సంరక్షించుకోవడానికి మనం అనేక రకాల ఉత్పత్తులను ఉపయోగిస్తుంటాం. మరి కాఫీ వల్ల జుట్టుకి కలిగే ప్రయోజనమేంటి అనుకుంటున్నారా? ఇది మంచి కండిషనర్‌గా పనిచేసి జుట్టును మృదువుగా అయ్యేలా చేస్తుందంటున్నారు నిపుణులు. దీనికోసం కాఫీపొడిని నీటిలో వేసి బాగా మరిగించాలి. తర్వాత దీనిని ఒక గిన్నెలోకి వడపోయాలి. ఈ నీటిని జుట్టుకు అప్లై చేసి ఇరవై నిమిషాల తర్వాత శుభ్రం చేసుకుంటే మంచి ఫలితం ఉంటుందంటున్నారు.

## మడ్ థెరపీతో అందం... ఆరోగ్యం!

జీవనశైలిలో వేగం... నిరంతర ఒత్తిడి... రసాయనాలతో నిండిన బ్యూటీ ఉత్పత్తుల వినియోగం... వీటన్నింటితో విసిగిపోయిన అమ్మాయిలు పాత రోజుల్లో అనుసరించే సహజ సౌందర్య పద్ధతుల వైపు అడుగులేస్తున్నారు. అందులో భాగమే ఈ మడ్ థెరపీ. ఇది అందంతోపాటు అనారోగ్య సమస్యల్నీ దూరం చేస్తుందని చెబుతున్నారు నిపుణులు. నేషనల్ లైబ్రరీ ఆఫ్ మెడిసిన్ సర్వే ప్రకారం – నల్లమట్టి, డెడ్ సీ మట్టిలో మెగ్నీషియం, కాల్షియం, పొటాషియం ఎక్కువగా ఉంటాయి. ఇవి చర్మంలో ఉండే హానికర టాక్సిన్లను తొలగిస్తాయి. ఆర్థరైటిస్‌తో బాధపడే వాళ్లపై చేసిన సర్వేలో వారానికి రెండుసార్లు 'వార్మ్ మడ్ ప్యాక్స్' వేయడంవల్ల నొప్పులు దాదాపు 40–50 శాతం తగ్గినట్లు గుర్తించారు. మొటిమలు, మచ్చలు, ఎగ్జిమా వంటి సమస్యల్ని తగ్గిచడంలో మడ్ థెరపీ బాగా పని చేస్తుంది. చర్మంపై ఉండే మృతకణాలను తొలగించి కాంతిమంతంగా మెరిసేలా చేస్తుందీ థెరపీ. మట్టి సహజంగానే ఒంట్లో వేడిని, విషపదార్థాలను గ్రహించే గుణాన్ని కలిగి ఉంటుంది. ఇది శరీరానికి



పట్టించినప్పుడు చర్మ రంధ్రాల ద్వారా వ్యర్థాల్ని బయటకు లాగేస్తుంది. దాంతో శరీరం చల్లబడి నరాలకు ఉపశమనం లభిస్తుంది. గంటల తరబడి కంప్యూటర్ల ముందు గడిపే వాళ్ల కళ్లపై పడిన ఒత్తిడి ఇట్టే మాయం చేస్తుంది. ఇందుకు నుదుటిపై మట్టితో ప్యాక్ వేయాలి. ఇలా చేయడం వల్ల కంటి నరాలకు ఉపశమనం లభిస్తుంది. మానసిక ఒత్తిడి తగ్గి నిద్ర బాగా పడుతుంది. పొట్ట భాగంలో మట్టితో ప్యాక్ వేస్తే గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం వంటి సమస్యలు కొంతవరకూ తగ్గి జీర్ణక్రియ మెరుగుపడుతుందని నిపుణులు చెబుతున్నారు.

## వేప ఆకులే కాదు.. పండు కూడా ఔషధమే!

వేప ఆకులే కాకుండా వేప పండు కూడా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉంటుందని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు. దీనిని తినడం వల్ల శరీరానికి మేలు జరుగుతుందని చెబుతున్నారు. ఆయుర్వేద నిపుణులు తెలిపిన ప్రకారం.. వేప పండులో యాంటీబాక్టీరియల్, యాంటీఫంగల్, యాంటీఆక్సిడెంట్ గుణాలు ఉన్నాయి. ఇవి శరీరాన్ని ఇన్ఫెక్షన్ల నుంచి రక్షించడంలో, అలాగే రోగనిరోధక శక్తిని పెంచడంలో సహాయపడతాయి. సరైన మోతాదులో వాడితే అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. భారతదేశంలో వేపను సంప్రదాయంగా ఔషధ గుణాలున్న చెట్టుగా పరిగణిస్తారు. ఆయుర్వేదంలో వేప ఆకులు, బెరడు, పువ్వులు, విత్తనాలు వంటి భాగాలను వివిధ రోగాల చికిత్సకు ఉపయోగిస్తారు. అయితే వేప పండుకు కూడా ముఖ్యమైన ఔషధ గుణాలు ఉన్నాయని చాలామందికి తెలియదు. వేప పండు శరీరంలోని హానికరమైన బ్యాక్టీరియా, ఫంగస్ ప్రభావాన్ని తగ్గించడంలో సహాయపడుతుందని భావిస్తారు. అందువల్ల చర్మ సమస్యలు, కొన్ని ఇన్ఫెక్షన్ల చికిత్సలో కూడా దీన్ని ఉపయోగి



స్తారు.

ఇది శరీరాన్ని అంతర్గతంగా శుభ్రపరచడంలో సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. జీర్ణ వ్యవస్థకు కూడా వేప పండు మేలు చేస్తుందని చెబుతారు. కొన్ని కడుపు సమస్యలను తగ్గించడంలో ఇది సహాయపడుతుంది. అలాగే శరీర శుద్ధి ప్రక్రియను మెరుగుపరుస్తుంది. అయితే దీన్ని పరిమిత మోతాదులో మాత్రమే తీసుకోవాలి. వేప పండులోని యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల కణాలకు కలిగే నష్టాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. దీని వల్ల రోగనిరోధక శక్తి పెరిగి, కాలానుగుణ వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుంది. చర్మ ఆరోగ్యానికి కూడా వేప పండు ఉపయోగకరంగా ఉంటుంది. ఆయుర్వేద చికిత్సల్లో దీనిని కొన్ని చర్మ సమస్యలను తగ్గించడానికి ఉపయోగిస్తారు. అయితే, ఏ ఔషధ మొక్కనైనా లేదా దాని భాగాలను ఉపయోగించే ముందు నిపుణుల సలహా తీసుకోవడం అవసరం. ప్రతి వ్యక్తి శరీర పరిస్థితి భిన్నంగా ఉంటుంది కాబట్టి వైద్యుల సూచనతో మాత్రమే వాడటం మంచిది.

## నలభై దాటినా.. ఇమ్యూనిటీ తగ్గకుండా..!

మెనోపాజ్ వల్ల కావచ్చు.. జీవనశైలిలో మార్పుల వల్ల కావచ్చు.. ఇలా కారణమేదైనా నలభైల్లోకి అడుగుపెట్టిన మహిళలు వయసుతో పాటు ఉన్నట్లుండి బరువు పెరుగుతుంటారు. శరీరానికి సరైన వ్యాయామం లేకపోవడం, చక్కటి ఆహార నియమాలు పాటించకపోవడం వల్ల కూడా ఈ వయసులో వివిధ అనారోగ్యాలు చుట్టుముడతాయి. మరి, ఇలా జరగకుండా.. ఈ వయసులో రోగనిరోధక శక్తిని పెంచుకోవాలంటే కొన్ని ఆహార పదార్థాలు రోజువారీ మెనూలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకుందాం.. నలభై దాటాక బరువు అదుపులో ఉంచుకోవాలన్నా, రోగనిరోధక శక్తిని పెంచుకోవాలన్నా సబ్జా గింజలు మంచి ఆహారమంటున్నారు నిపుణులు. ఇందులో క్యాలరీలు తక్కువగా ఉంటాయి.



గ్లూటెన్ ఉండదు. యాంటీ ఆక్సిడెంట్లు, ఒమేగా–3 ఫ్యాటీ ఆమ్లాలు.. నిండి ఉన్న సబ్జా గింజలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. ఇక ఈ గింజల్లో ఫైబర్ పుష్కలంగా ఉండడం వల్ల ఎక్కువసేపు కడుపు నిండుగా ఉన్నట్లు అనిపిస్తుంది. తద్వారా ఆహారపు కోరికలు అదుపులో ఉంటాయి. వీటిని నీటిలో నానబెట్టుకుని తీసుకోవాల్సి ఉంటుంది. లేకపోతే సలాడ్లు, స్మూతీలలో కలుపుకొని తీసుకున్నా ఫలితం ఉంటుందంటున్నారు నిపుణులు. నారింజ, ద్రాక్ష, నిమ్మ.. వంటి పండ్లలో యాంటీ ఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్–సి తదితర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీర బరువును అదుపులో ఉంచడమే కాకుండా రోగనిరోధక శక్తిని కూడా పెంపొందిస్తాయి. అంతేకాదు.. మెదడు పనితీరునూ మెరుగుపరుస్తాయి. గుండెకు రక్షణనిస్తాయి. అలాగే చర్మ ఆరోగ్యానికీ ఈ పోషకాలు ఎంతో మంచివంటున్నారు నిపుణులు. మెనోపాజ్‌కు దగ్గరవుతోన్న మహిళల్లో ఐరన్, విటమిన్–డి స్థాయులు క్రమంగా తగ్గిపోతుంటాయి. ఇలాంటప్పుడు ఈ రెండు పోషకాలు పుష్కలంగా లభించే కోడిగుడ్లు తప్పనిసరిగా ఆహారంలో చేర్చుకోవాలంటున్నారు నిపుణులు. వీటి వల్ల రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుందంటున్నారు. అదేవిధంగా గుడ్లలోని ప్రొటీన్లు మెనోపాజ్ కారణంగా స్త్రీలలో పెరిగే చెడు కొవ్వును కరిగించడంలో సహకరిస్తాయంటున్నారు నిపుణులు.

## చమురు నిల్వలు మరింత పెంచుకుందాం!



దేశంలో ముడి చమురు నిల్వ సామర్థ్యాన్ని మరింత పెంచుకోవాలని ప్రభుత్వ రంగ చమురు కంపెనీ (ఓఎమ్‌సీ)లను కేంద్రప్రభుత్వం కోరే అవకాశం కనిపిస్తోంది. అంతర్జాతీయంగా చమురు ధరల్లో ఊగిసలాట, సరఫరా అంతరాయాల ప్రభావాన్ని దేశీయ విపణిపై తగ్గించేందుకు ఇది ఉపకరిస్తుందన్నది ఆలోచన. భారత ప్రభుత్వం వెల్లడించిన సమాచారం ప్రకారం 60 రోజుల దేశీయ అవసరాలకు సరిపడా ఇంధన నిల్వలు మనదేశంలో ఉన్నాయి. అత్యవసర ఇంధననిల్వలను 3 నెలల అవసరాలకు సరిపడా పెంచాలనే మధ్యకాలిక ప్రణాళికలో కేంద్రం ఉన్నట్లు తెలిపారు.




# బంగారం, వెండి ధరలు పైపైకి



అంతర్జాతీయ పరిణామాలతో ఇటీవల కాస్త దిగొచ్చిన బంగారం, వెండి ధరలు శుక్రవారం మళ్లీ పెరిగాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు శాంతించడంతో ఈ లోహాలకు డిమాండ్ దక్కింది. దీంతో దేశీయ విపణిలోనూ వీటి ధరలు పెరిగాయి. హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల మేలిమి 24 క్యారెట్ల పసిడి (Gold) ధర రూ.1,52,200కు చేరింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు రూ.3వేల పైన పెరిగింది. ఇక, కేజీ వెండి ధర రూ.2.49 లక్షలు పలికింది. దీని ధర ఒక్క రోజే దాదాపు రూ.9వేల మేర పెరగడం గమనార్హం. అంతర్జాతీయ మార్కెట్‌లోనూ ఈ లోహాల ధరలు పెరిగాయి. నేడు ఔన్సు పుత్తడి ధర 4,205 డాలర్లు పలికింది. క్రితం రోజుతో పోలిస్తే దాదాపు 100 డాలర్ల పైన పెరిగింది. ఇక ఔన్సు వెండి ధర 67.32 డాలర్ల వద్ద కొనసాగుతోంది. మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలో గోల్డ్ ఫ్యూచర్స్ ధర రూ.1.50లక్షలు, వెండి ఫ్యూచర్స్ ధర రూ.2.43లక్షల వద్ద కొనసాగుతోంది. ఇరాన్‌పై తాజా దాడుల్ని విరమించుకుంటున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. టెహ్రాన్‌తో చర్చలు దాదాపు కొలిక్కి వచ్చాయని, ఆ దేశ అగ్రనాయకత్వం తమ ప్రతిపాదనలకు అంగీకరించిందని చెప్పారు. దీంతో పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తగ్గొచ్చనే అంచనాలు వ్యక్తమయ్యాయి. ఈ పరిణామాలతో ముడి చమురు ధరలు కూడా దిగొచ్చాయి. అటు మన దేశ కరెన్సీ రూపాయి విలువ కూడా భారీగా కోలుకుంది. నేటి మార్కెట్‌లో డాలర్‌తో పోలిస్తే 60 పైసలు బలపడి 95.25 వద్ద ట్రేడ్ అవుతోంది.

# ధరలు పెంచిన టాటా మోటార్స్..

ప్రముఖ ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ పాసింజర్ వెహికల్ లిమిటెడ్ కార్ల ధరలను పెంచేసింది. జులై 1 నుంచి కార్ల ధరలను 1.5 శాతం చొప్పున పెంచుతున్నట్లు తెలిపింది. ఇంటర్నల్ కంబషన్ ఇంజిన్ (ICE)తో పాటు, ఎలక్ట్రిక్ వాహన (EV) ధరలనూ పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. ఇప్పటికే ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ జూన్ నుంచి కార్ల ధరలను రూ.30 వేల వరకు పెంచిన వేళ.. టాటా మోటార్స్ నుంచి ఈ ప్రకటన రావడం గమనార్హం. ముడి సరకు ధరల పెరుగుదల, ద్రవ్యోల్బణం ఒత్తిళ్ల కారణంగా పాక్షికంగా ధరల పెంపు చేపట్టాల్సి వస్తోందని టాటా మోటార్స్ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో తెలిపింది. అయితే, వినియోగదారులపై పెద్దగా ప్రభావం పడకుండా కొంత మొత్తం మాత్రమే బదిలీ చేస్తున్నట్లు కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. మోడల్, వేరియంట్‌ను బట్టి ధరల పెంపు వర్తిస్తుందని కంపెనీ తెలిపింది. టియాగో, ఆల్ట్రోజ్, టిగోర్, పంచ్, నెక్సాన్, సియారా, హ్యారియర్ వంటి సంప్రదాయ ఇంజిన్‌తో నడిచే కార్లతో




పాటు టియాగో ఈవీ, టిగోర్, పంచ్ ఈవీ, నెక్సాన్ ఈవీ, కర్వ్ ఈవీ, హ్యారియర్ ఈవీ మోడళ్లను టాటా మోటార్స్ విక్రయిస్తోంది.

# స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పెరుగుతాయ్!



స్మార్ట్‌ఫోన్ ధరలపై మరోసారి కీలక వ్యాఖ్యలు చేశారు నథింగ్ కంపెనీ సీఈఓ కార్ల్ పై. రాబోయే రోజుల్లో స్మార్ట్‌ఫోన్ ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని హెచ్చరించారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగం నుంచి మెమొరీ చిప్‌లకు డిమాండ్ విపరీతంగా పెరగడమే దీనికి కారణమని ఆయన పేర్కొన్నారు. అందువల్ల రాబోయే పండుగల సీజన్‌లో స్మార్ట్‌ఫోన్ ధరలు తగ్గుతాయని ఆశ పడొద్దని వినియోగదారులకు సూచించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా ఆయన పోస్టులు పెట్టారు. గతంలో కంటే మెమొరీ చిప్‌ల ధరలు ఏకంగా 300 శాతం వరకు పెరిగాయని కార్ల్ పై పేర్కొన్నారు. ఒక స్మార్ట్‌ఫోన్ తయారీలో ప్రాసెసర్, డిస్‌ప్లే కంటే మెమొరీ అత్యంత ఖరీదైన భాగంగా మారిందని తెలిపారు. కొన్ని ప్రీమియం ఫోన్లలో మొత్తం హార్డ్‌వేర్ ఖర్చులో మెమొరీ వాటానే 50 శాతానికి పైగా ఉంటోందన్నారు. రాబోయే పండగ సీజన్ లేదా సేల్స్ సమయంలో స్మార్ట్‌ఫోన్లపై గతంలో మాదిరిగా భారీ డిస్కౌంట్లు లభించకపోవచ్చని అభిప్రాయపడ్డారు. ఫోన్ కొనాలనుకునే వారు ఆలస్యం చేస్తే మరింత ఎక్కువ ధర చెల్లించాల్సి రావొచ్చని పేర్కొన్నారు. మెమొరీ ఖర్చుల పెరుగుదల వల్ల మొబైల్ బ్రాండ్లు తమ లాభాలను కాపాడుకోవడానికి ఫోన్ ధరలను 30 శాతం వరకు పెంచడం లేదా ఫోన్ స్పెసిఫికేషన్లను తగ్గించడం వంటి రెండు ఆప్షన్లలో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వస్తుందని కార్ల్ పై అభిప్రాయపడ్డారు. నథింగ్ కూడా దీనికి మినహాయింపు ఏమీ కాదన్నారు. తమ నథింగ్ 4ఏ అభివృద్ధి దశకు, విడుదల సమయానికి మెమొరీ ఖర్చులు రెట్టింపయ్యాయన్నారు. తమ స్మార్ట్‌ఫోన్‌ను అప్‌గ్రేడ్ చేయడమా?మరికొంతకాలం కొనుగోలును వాయిదా వేయడమా? అనేది వినియోగదారుల ముందున్న మార్గాలని పేర్కొన్నారు. కార్ల్‌పై ఇప్పుడే కాదు.. గతంలోనూ స్మార్ట్‌ఫోన్ ధరలు పెరగబోతున్నాయని సంకేతాలివ్వగా అది మార్కెట్‌లో ప్రతిబింబించింది. ఆయన తాజా వ్యాఖ్యలను బట్టి చూస్తే వచ్చే ఏడాది సైతం ఇదే ధోరణి కొనసాగే అవకాశం కనిపిస్తోంది.

# 3.93 శాతానికి రిటైల్ ద్రవ్యోల్బణం

పశ్చిమాసియా ఉద్రిక్తతలు భారత్‌తో పాటు పలు దేశాల్లో తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. యుద్ధం ప్రారంభమైన దగ్గరి నుంచే ద్రవ్యోల్బణ భయాలు ముసురుకోగా.. ఇప్పుడు ఆ ఎఫెక్ట్ నేరుగా కనిపిస్తోంది. ఆహారం, ఇంధన ధరలు పెరగడంతో మే నెలలో రిటైల్ ద్రవ్యోల్బణం 3.93 శాతంగా నమోదైంది. ఈ మేరకు ప్రభుత్వం గణాంకాలను విడుదల



చేసింది. అయితే, ఈ లెక్కలు ఆర్‌బీఐ మధ్యకాలిక ద్రవ్యోల్బణ లక్ష్యపరిధిలోనే ఉన్నాయి. ఏప్రిల్‌లో ఈ ద్రవ్యోల్బణం 3.48 శాతంగా నమోదైన విషయం తెలిసిందే. వినియోగదారుల జీవనశైలిలో వచ్చిన మార్పులను దృష్టిలో ఉంచుకొని ధరల సూచీని లెక్కించేందుకు కేంద్రం ఈ ఏడాది ప్రారంభంలో కొన్ని సవరణలు చేసింది. ఆ గణాంకాల ప్రకారం చూస్తే.. మే నెలలోనే అత్యధిక ద్రవ్యోల్బణ రేటు నమోదైంది. ఆహార ద్రవ్యోల్బణం ఏప్రిల్‌లో 4.20 శాతంగా ఉండగా.. మేలో 4.78 శాతానికి పెరిగింది. ప్రపంచ ఇంధన రవాణాకు అత్యంత కీలకమైన హర్మూజ్‌లో నౌకల రాకపోకలకు అంతరాయం కొనసాగుతోంది. దాంతో అన్ని దేశాలకు చమురు షాక్ తగులుతోంది.

# సెన్సెక్స్ 1695, నిఫ్టీ 461 పాయింట్లు పైకి

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు భారీ లాభాల్లో ముగిశాయి. అమెరికా– ఇరాన్ మధ్య త్వరలో శాంతి ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు, అంతర్జాతీయంగా ముడిచమురు దిగుమతులు దిగి రావడం పాజిటివ్ సెంటిమెంట్‌కు కారణమైంది. దీంతో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్ సూచీలూ రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 1700 పాయింట్లకు పైగా లాభపడగా.. నిఫ్టీ 23,600 ఎగువన ముగిసింది. మదుపర్ల సంపదగా భావించే బీఎస్‌ఈలో నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.9.7 లక్షల కోట్లు పెరిగి రూ.452.33 లక్షల కోట్ల నుంచి రూ.462.05 లక్షల కోట్లకు చేరింది. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో సెన్సెక్స్ ఉదయం 74,709.27 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 73,832.55) భారీ లాభాల్లోనే ప్రారంభమైంది. రోజంతా కొనుగోళ్ల మద్దతుతో సూచీలు కళకళలాడాయి. ఇంట్రాడేలో 75,608.02 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 1695.40 పాయింట్ల లాభంతో 75,527.95 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 461.30 పాయింట్ల లాభంతో 23,622.90 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 95.11గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో బజాజ్ ఫైనాన్స్, ఎల్అండ్‌టీ, ఇండిగో, టైటాన్, ఎటర్నల్ షేర్లు ప్రధానంగా లాభపడ్డాయి. టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ షేర్లు మాత్రమే నష్టాలు చవిచూశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 86 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4224 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఇరాన్‌తో త్వరలో శాంతి ఒప్పందం కుదరబోతోందని అమెరికా అధ్యక్షుడు



డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. వారాంతంలోపు ఇరు దేశాలు ఈ డీల్‌పై సంతకాలు చేయబోతున్నాయని తెలిపారు. హర్మూజ్ తిరిగి తెరుచుకుంటుందని పేర్కొన్నారు. ఈ ప్రకటన ప్రపంచ మార్కెట్‌లతో పాటు మన మార్కెట్‌లో కొత్త ఉత్సాహానికి కారణమైంది. ట్రంప్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు దిగి వచ్చాయి. గత కొన్ని రోజులుగా బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 90 డాలర్ల ఎగువన ట్రేడవుతూ వస్తుండగా.. శాంతి ఒప్పందంపై అంచనాలతో మళ్లీ 86 డాలర్ల స్థాయికి చేరడం దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి ఆర్థిక వ్యవస్థలకు ఊరట కల్పించే అంశం. శాంతి ఒప్పందంపై ఆశలతో ఆసియా మార్కెట్లన్నీ లాభాల్లో ట్రేడయ్యాయి. జపాన్ నిక్కీ దాదాపు 3 శాతం, దక్షిణ కొరియా కోస్పీ 4 శాతం మేర లాభాల్లో ముగిశాయి. ఇతర ఆసియా మార్కెట్‌లు లాభాల్లో ముగియగా.. యూరోపియన్ మార్కెట్‌లు సైతం లాభాల్లో ప్రారంభమయ్యాయి. అంతర్జాతీయ మార్కెట్‌ల నుంచి సానుకూల సంకేతాలతో మన మార్కెట్‌లూ దూసుకెళ్లాయి.




## చెకియాపై సూపర్ విక్టరీ



ఫిఫా ప్రపంచ కప్‌లో ఆసియా జట్టు దక్షిణ కొరియా శుభారంభం చేసింది. చెకియాపై 2–1 తేడాతో విజయం సాధించింది. గ్రూప్ –Aలో తలపడిన ఇరు జట్లూ గెలుపు కోసం చివరివరకూ పోరాడాయి. అయితే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ సాధించలేదు. కానీ, రెండో అర్ధ భాగం నుంచి ఆట రసవత్తరంగా మారింది. రెండో సగం మొదలైన కాసేపటికే చెకియా ఆటగాడు లాడీస్లావ్ గోల్ కొట్టి తన జట్టుకు ఆధిక్యం ఇచ్చాడు. మ్యాచ్ 59వ నిమిషంలో తొలి గోల్ నమోదైంది. మరికాసేపటికే సౌత్ కొరియా ప్లేయర్ హవాంగ్ బోయిమ్ 67వ నిమిషంలో గోల్ కొట్టి స్కోరును సమం చేశాడు. ఇక కాసేపు గోల్స్ కోసం ఇరుజట్లూ శ్రమించాయి. 80వ నిమిషంలో దక్షిణ కొరియా ఆటగాడు ఓ హైన్ గ్యు గోల్ కొట్టి 2–1 ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. ఆట అదనపు సమయంలోనూ కొరియా పట్టువిడవకుండా కాపాడుకుంది. చెకియాను గోల్ కొట్టనీయకుండా కట్టడి చేయగలిగింది. ఆటలో ఎక్కువ భాగం బంతిపై నియంత్రణ దక్షిణ కొరియాకే ఉంది. చెకియా 16 పొరపాట్లు చేయగా.. దక్షిణ కొరియా 9 మాత్రమే చేసింది.

# ఆ ఇద్దరినీ వైభవ్ అధిగమిస్తాడు: డేల్ స్టెయిన్




ప్రపంచ క్రికెట్‌లో వైభవ్ సూర్యవంశీ అద్భుతాలు సృష్టిస్తాడని దక్షిణాఫ్రికా మాజీ పేసర్ డేల్ స్టెయిన్ అన్నాడు. అతడు భారత క్రికెట్‌కు ఖజానా లాంటివాడని అభివర్ణించాడు. క్రికెట్ దిగ్గజం సచిన్ తెందుల్కర్, విరాట్ కోహ్లీ కంటే వైభవ్‌లోనే ఎక్కువ సత్తా ఉందని వ్యాఖ్యానించాడు. ఇప్పుడు అతడి వయసులో ఉన్న పిల్లల్లో ఇలాంటి టాలెంట్‌ను చూడలేదని చెప్పాడు. "మీరంతా వైభవ్ సూర్యవంశీని సచిన్ లేదా విరాట్‌లా ఉన్నాడని భావిస్తారు. కానీ, వారిద్దరి కంటే కూడా ఇతడిలో చాలా సత్తా ఉందని అనిపిస్తోంది. వైభవ్ కెరీర్ ముగిసేసరికి ఆ దిగ్గజాలను అధిగమిస్తాడని అనుకుంటున్నా. ఇప్పుడున్న అంతర్జాతీయ క్రికెటర్ల కంటే కూడా వైభవ్ చాలా బెటర్. అండర్ –15, అండర్ –19 జట్లలో అద్భుతమైన ఆటగాళ్లను చూస్తూ ఉంటాం. కానీ, నాకు తెలిసి దక్షిణాఫ్రికా లేదా ఇతర దేశాల్లో వైభవ్ వంటి నైపుణ్యం ఉన్న యువ క్రికెటర్ లేదు. మా దేశంలో టాలెంట్‌కు కొదవేం లేదు. కానీ, వైభవ్ వంటి బెస్ట్ ప్లేయర్ లేడని మాత్రం చెప్పగలను. అందుకే, అతడు భారత జట్టుకు అతిపెద్ద ఖజానా అంటున్నా'' అని స్టెయిన్ తెలిపాడు. జాగ్రత్తగా చూసుకోవాలి.. 'ప్రస్తుతం వైభవ్ వయసు కేవలం 15 ఏళ్లే. రాబోయే కాలం అత్యంత విలువైంది. అతడిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన బాధ్యత భారత క్రికెట్ జట్టు మేనేజ్‌మెంట్‌పై ఉంది. వైభవ్‌ను ఎంత బాగా చూసుకుంటే.. టీమ్‌ఇండియాకు అంత బెనిఫిట్. ఒకవేళ అతడి ఆటను కోల్పోతే మాత్రం చాలా నష్టమవుతుంది. బంతిని చాలా బాగా ఆడతాడు. భారత్‌లో అతడి ఆటను దగ్గర్నుంచి చూశా. మంచి వికెట్లపైనా ఉత్తమ ఆటతీరు ప్రదర్శించాడు. విధ్వంసం సృష్టించిన తీరు బాగుంది. రబాడ ఒక్కడే వైభవ్‌ను కాస్త కట్టడి చేయగలిగాడు. మిగతా బౌలర్లు భారీగానే పరుగులు సమర్పించారు. మ్యాచ్ బరిలోకి దిగినప్పుడు భయపడుతూ ఉంటే సరిగ్గా బౌలింగ్ చేయలేం. అలాగే బ్యాటింగ్‌లోనూ నాణ్యమైన ఆట ఆడలేం. వైభవ్‌ను షార్ట్ బంతులతో మాత్రమే అడ్డుకొనేందుకు అవకాశం ఉంది'' అని స్టెయిన్ వెల్లడించాడు. ఐర్లాండ్, ఇంగ్లాండ్ సిరీస్‌లకు వైభవ్ ఎంపికైన సంగతి తెలిసిందే.

# తొలి మ్యాచ్‌లోనే 3 రెడ్ కార్డులు..

ఫిఫా వరల్డ్ కప్ అట్టహాసంగా ప్రారంభమైంది. తొలి మ్యాచ్‌లోనే సహ ఆతిథ్య జట్టు మెక్సికో విజయం సాధించింది. దక్షిణాఫ్రికాపై 2–0 తేడాతో మెక్సికో గెలిచింది. అయితే, ఇప్పుడు ఆ మ్యాచ్‌కు రిఫరీగా పనిచేసిన విల్టన్ సాంపియో హైలైట్‌గా నిలిచాడు. ఒకే మ్యాచ్‌లో మూడు రెడ్ కార్డులు ఇచ్చి వార్తల్లోకెక్కాడు. దక్షిణాఫ్రికా ఓడిపోవడంలో కీలక పాత్ర పోషించిన విల్టన్‌కే 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు ఇవ్వాలని అభిమానులు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. సోషల్ మీడియాలో అతడిపై మీమ్స్‌తో నెటిజన్లు విజృంభించారు. ఫిఫా వరల్డ్ కప్ తొలి మ్యాచ్‌లోనే ఇలాంటివి చూడాల్సి రావడం బాధాకరమని పలువురు ఫ్యాన్స్ కామెంట్లు చేశారు. దక్షిణాఫ్రికాకు చెందిన ఇద్దరు ప్లేయర్లకు డైరెక్ట్‌గా రెడ్‌కార్డు రావడంతో.. చాలా సమయంపాటు ఆ జట్టు తొమ్మిది మందితోనే ఆడాల్సి వచ్చింది. గత ప్రపంచ కప్ (2022)లో టోర్నీ మొత్తం కేవలం నాలుగు రెడ్ కార్డులను మాత్రమే ఇవ్వడం జరిగింది. కానీ, ఇప్పుడు తొలి మ్యాచ్ లోనే ఏకంగా మూడు రెడ్ కార్డులు ఇవ్వ డం చర్చనీయాంశంగా మారింది. ఫిఫా ప్రపంచ కప్‌లో ఒకే మ్యాచ్‌లో ఇన్ని రెడ్ కార్డులు అదీనూ ఎలాంటి హెచ్చరికలు లేకుండా ఇవ్వడం ఇదే తొలిసారి. మెగా టోర్నీ మొదటి మ్యాచ్‌లోనే రికార్డు నమోదైతే..



మున్ముందు ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం లేకపోలేదు. నిబంధనలకు విరుద్ధంగా ప్రవర్తించే ఆటగాడికి రిఫరీ రెడ్ కార్డు ఇవ్వడం సహజమే. అయితే, రెండుసార్లు ఎల్లో కార్డులు ఇచ్చినా క్రీడాస్ఫూర్తికి విరుద్ధంగా ప్రవర్తిస్తే అప్పుడు రెడ్ కార్డు చూపిస్తారు. దీంతో అప్పట్నుంచి మ్యాచ్ అయ్యేవరకూ సదరు ఆటగాడు డగౌట్‌కే పరిమితం కావాల్సిఉంటుంది.

## మనుబాకర్ కోచ్ జస్పాల్ రాణా కన్నుమూత

దిగ్గజ షూటర్, ప్రఖ్యాత కోచ్ జస్పాల్ రాణా (49) కన్నుమూశారు. కొన్ని రోజుల క్రితం తీవ్ర అనారోగ్యానికి గురైన ఆయన.. ఈ రోజు ఉదయం తుదిశ్వాస విడిచారు. భారత్ స్టార్ షూటర్ మను బాకర్ ఈయన కోచింగ్‌లోనే రాటుదేలిన సంగతి విదితమే.




ఐఎస్ఎస్ఎఫ్ వరల్డ్ కప్‌లో భాగంగా ఇటీవల జర్మనీ నుంచి భారత్‌కు తిరిగివస్తుండగా రాణా అనారోగ్యానికి గురయ్యారు. విమానం దిగిన వెంటనే ఆయన్ను దిల్లీలోని ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడే చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. ఈ విషయాన్ని నేషనల్ రైఫిల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (NRAI) ధ్రువీకరించింది. 'జర్మనీలో వరల్డ్‌కప్ సందర్భంగా జస్పాల్‌కు ఛాతినొప్పి, అసౌకర్యం కలిగాయి. ఎసిడిటీగా పొరబడి.. తన పనిలో నిమగ్నమయ్యాడు. అయితే భారత్‌కు వచ్చేటప్పుడు మళ్లీ అసౌకర్యానికి గురయ్యాడు. దాంతో ఆసుపత్రిలో చేరాడు'' అంటూ జస్పాల్ సోదరుడు సుభాష్ వెల్లడించారు. పారిస్ ఒలింపిక్స్‌లో రెండు కాంస్యాలు గెలిచిన మను బాకర్‌కు రాణా వ్యక్తిగత కోచ్‌గా వ్యవహరించారు. 2006 ఆసియా క్రీడల్లో మూడు స్వర్ణాలు గెలిచిన జస్పాల్.. గతంలో జాతీయ జూనియర్ కోచ్‌గా వ్యవహరించారు. అప్పుడే మను బాకర్, సౌరభ్ చౌదరి లాంటి ప్రతిభావంతులైన షూటర్లు వెలుగులోకి వచ్చారు. ఒలింపిక్స్ విజయాల అనంతరం ఆయన గత ఏడాది ఫిబ్రవరిలో జాతీయ కోచ్‌గా నియమితులయ్యారు. 25 మీటర్ల పిస్టల్ విభాగంలో హై పర్ఫార్మెన్స్ కోచ్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. జస్పాల్ రాణా మృతిపై ప్రధాని మోదీ తీవ్ర విచారం వ్యక్తంచేశారు. ''ఆయన మరణం భారత క్రీడా ప్రపంచానికి తీరని లోటు. షూటింగ్‌లో ఆయన సాధించిన విజయాలతో దేశానికి ఎంతో పేరు తీసుకువచ్చారు. యువ అథ్లెట్లను తీర్చిదిద్దడంలో ఆయన చూపిన నిబద్ధత ఎనలేనిది. ఈ విషాద సమయంలో ఆయన కుటుంబం, ఆత్మీయులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను'' అని మోదీ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టారు.

# రిషభ్ పంత్‌ను పూర్తిగా పక్కన పెట్టొద్దు..

రిషభ్ పంత్ అనగానే టెస్టుల్లో దూకుడుగా ఆడతాడు.. మిగతా ఫార్మాట్లలో ప్రభావం చూపించడనే కామెంట్లు వినిపిస్తాయి. అతడి ఆటతీరు కూడా అలానే ఉంది. కానీ, భారత మాజీ పేస్ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ మాత్రం పంత్ మళ్లీ పరిమిత ఓవర్ల క్రికెట్‌లో కీలకంగా మారతాడని ఆశాభావం వ్యక్తం చేశాడు. పంత్ విషయంలో బీసీసీఐ సెలక్టర్లు మరీ కఠినంగా వ్యవహరించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశాడు. అఫ్గానిస్థాన్‌తో మూడు వన్డేల సిరీస్‌కు పంత్ ఎంపిక కాని విషయం తెలిసిందే. శనివారం తొలి వన్డే జరగనుంది. "వన్డేల్లో వికెట్ కీపర్‌గా ఇప్పుడు కేఎల్ రాహుల్ తొలి ఛాయిస్. అతడు ఓపెనర్‌గానూ.. ఐదు లేదా ఆరో స్థానంలోనూ బ్యాటింగ్ చేయగలడు. అతడికి బ్యాకప్‌గా సెలక్టర్లు ఇషాన్ కిషన్‌ను తీసుకొచ్చారు. టాప్ ఆర్డర్‌లో అతడు బ్యాటింగ్ చేస్తాడు. షార్ట్ బంతులను కూడా చక్కగా ఆడేస్తున్నాడు. ఇది స్మార్ట్ సెలక్షన్. మూడో ఆప్షన్‌గా సంజు శాంసన్. అతడికి ఎప్పుడు అవకాశం వచ్చినా వన్డేల్లో సత్తా చాటాడు. గత టీ20 ప్రపంచ కప్‌లోనూ సంజు కీలక ఇన్నింగ్స్‌లు ఆడటం చూశాం కదా.. ఇక రిషభ్ పంత్ విషయానికొద్దాం.. ఈ సందర్భంగా సెలక్టర్లకు నేనొక విజ్ఞప్తి చేస్తున్నా. 2027 వన్డే ప్రపంచ కప్ సెలక్షన్స్‌లో పూర్తిగా అతడిని పక్కన పెట్టొద్దు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అతడి ఫామ్ గొప్పగా లేదని తెలుసు. గతంలో ఇషాన్ కిషన్ కూడా జట్టులో నుంచి బయటకు వెళ్లాడు. తర్వాత రాణించి మళ్లీ టీమ్‌లోకి ఎంట్రీ ఇచ్చాడు. సారథిగా సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీని ఝార్ఖండ్‌కు అందించాడు. అందుకే, అతడిని పంత్ స్ఫూర్తిగా తీసుకోవాలి. వైట్‌బాల్ క్రికెట్‌లోకి పునరాగమనం చేయాలి'' అని ఇర్ఫాన్ తెలిపాడు. పంత్ చివరిసారిగా 2024లో వన్డే మ్యాచ్ ఆడాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి ఎంపికైనా.. రిజర్వ్ బెంచ్‌కే పరిమితమయ్యాడు. గత ఐపీఎల్‌లోనూ గొప్ప ప్రదర్శన చేయలేదు. లఖ్‌నవూ సూపర్ జెయింట్స్ కెప్టెన్సీని వదిలేశాడు.



# వుదయం సినిమా
MOVIE TIME!

## 'ఆల్ఫా' టీజర్ రిలీజ్..

**వుదయం సినిమా** ఆలియా భట్ ప్రధాన పాత్రలో యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై ఆదిత్య చోప్రా నిర్మిస్తోన్న భారీ యాక్షన్ మూవీ 'ఆల్ఫా'. బుధవారం (జూన్ 10) మేకర్స్ ఈ మూవీ టీజర్‌ను విడుదల చేశారు. ఇందులో ఆలియా భట్ ఓ హంతకురాలి పాత్రలో నటించింది. వైఆర్ఎఫ్ స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందుతోన్న ఆల్ఫా చిత్రాన్ని ..చిన్న వయస్సు నుంచే పెంచి, హత్యలు చేయడానికి తయారు చేసిన ఓ హంతకురాలుకి సంబంధించిన మూల కథతో రూపొందించారు. టీజర్‌ను గమనిస్తే.. బాబీ డియోల్ తండ్రి పాత్రలో కనిపించారు. తన కుమార్తెను బాబీ చిన్నప్పటి నుంచే హత్యలు చేసే ఓ హంతురాలిగా పెంచి పెద్ద చేస్తాడని అర్థమవుతుంది.

## 'పెద్ది' చిత్ర బృందాన్ని అభినందించిన చిరంజీవి



**వుదయం:** రామ్ చరణ్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది' చిత్ర బృందాన్ని మెగా స్టార్ చిరంజీవి అభినందించారు. 'పెద్ది' చిత్రాన్ని వీక్షించిన చిరంజీవి, దర్శకుడు బుచ్చిబాబు సానా, నిర్మాత వెంకట సతీష్ కిలారు, చిత్ర బృంద సభ్యులను ప్రత్యేకంగా అభినందించి, వారికి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. 'పెద్ది' ప్రపంచవ్యాప్తంగా బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. రామ్ చరణ్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలిచిన ఈ చిత్రం 350 కోట్ల క్లబ్‌లోకి చేరింది. రెండో వారంలో కూడా కలెక్షన్లు చాలా బలంగా ఉన్నాయి. రామ్ చరణ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచిన ఈ చిత్రం విజయవంతంగా దూసుకుపోతోంది. 'పెద్ది'లో రామ్ చరణ్ నటనపై ప్రేక్షకులు, విమర్శకుల నుంచి ప్రశంసల వర్షం కురుస్తోంది. ఆయన ట్రాన్స్‌ఫర్మేషన్, స్క్రీన్ ప్రెజెన్స్, భావోద్వేగాలతో కూడిన నటన అందరినీ కట్టిపడేస్తోంది. ప్రస్తుతం హౌస్‌ఫుల్ కలెక్షన్లతో దూసుకెళ్తున్న 'పెద్ది' రానున్న రోజుల్లో మరిన్ని సంచలనాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది.

## 'సింగ'- మాస్ అప్పీలింగ్ గూస్ బంప్స్ టైటిల్ ప్రోమో రిలీజ్

**వుదయం:** టి. గోపీచంద్ ప్రతిష్టాత్మక యాక్షన్ ఎంటర్‌టైనర్ 'సింగ'తో అలరించబోతున్నారు. ప్రముఖ యాక్షన్ కొరియోగ్రాఫర్ వి వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని 70ఎంఎం ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మిస్తున్నారు. విభిన్నమైన కథలను ప్రేక్షకులకు అందిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందిన ఈ నిర్మాణ సంస్థ ఈ భారీ ప్రాజెక్ట్‌తో ముందుకొస్తోంది. గోపీచంద్ పుట్టినరోజు సందర్భంగా మేకర్స్ సినిమా టైటిల్‌తో పాటు ఆయన లుక్‌ను కూడా రివీల్ చేశారు. పక్షుల కిలకిలారావాలతో ప్రారంభమయ్యే ఈ టైటిల్ గ్లింప్స్ ప్రేక్షకులను దట్టమైన అడవి మధ్యలోకి తీసుకెళ్తుంది. ట్రైబల్ నేపథ్య సంగీతం ఆసక్తిని మరింత పెంచుతుంది. చీకటిలో మెరుస్తున్న రెండు కళ్లను చూస్తే మొదట అడవిలో సంచరిస్తున్న పాంథర్ అనిపిస్తుంది. అయితే వెంటనే గోపీచంద్‌ను రివీల్ చేస్తూ మేకర్స్ సర్‌ప్రైజ్ ఇచ్చారు. కళ్లలో ఆగ్రహం, చేతిలో గొడ్డలి, ప్రతీకారంతో రగిలిపోతున్న పాంథర్‌లా కనిపిస్తూ పవర్ ఫుల్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు. తర్వాత 'సింగ' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను రివీల్ చేశారు. టైటిల్ డిజైన్ కూడా ఎంతో ఆకట్టుకునేలా ఉంది. టైటిల్ టీజర్ మాస్ ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలతో రూపొందింది. గడ్డం, మీసం, చెవిపోగు, రక్తం, చెమటతో కనిపించే రగ్డ్ అవతార్‌లో గోపీచంద్ అదరగొట్టారు. అభిమా



## ప్రొడక్షన్ నెం 1 చిత్రం గ్రాండ్ గా లాంచ్



**వుదయం:** డైనమిక్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం 'క', 'కె-ర్యాంప్' వంటి వరుస బ్లాక్‌బస్టర్ల తర్వాత అలరించారు. 'ఎస్ఆర్ కళ్యాణమండపం' సంచలన విజయంతో తన రైటింగ్ ట్యాలెంట్ ని ఇప్పటికే చాటుకున్న కిరణ్ అబ్బవరం, ఇప్పుడు తన అత్యంత ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌కు హీరోగా, కథా రచయితగా, స్క్రీన్‌ప్లే రచయితగా, దర్శకుడిగా బాధ్యతలు చేపట్టడానికి సిద్ధమయ్యారు. ఈ చిత్రాన్ని జాయ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నిర్మాతగా అరంగేట్రం చేస్తున్న ప్రముఖ ఓవర్సీస్ డిస్ట్రిబ్యూటర్ సుధాకర్ చాగంటి నిర్మిస్తుండగా, సురేష్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. భారీ స్థాయిలో నిర్మిస్తున్న ఈ చిత్రం, కిరణ్ అబ్బవరం కెరీర్‌లో ఇప్పటివరకు అత్యధిక బడ్జెట్ తో రూపొందుతోంది. అనౌన్స్‌మెంట్ పోస్టర్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. భారీ గంగాళం, మంటలు, పొగల మధ్య బ్యాక్ సైడ్ నుంచి కనిపిస్తున్న కిరణ్ అబ్బవరం సంప్రదాయ గ్రామీణ యువకుడి గెటప్‌లో ఆకట్టుకుంటున్నారు. గ్రామీణ వేడుకల వాతావరణాన్ని ప్రతిబింబించే ఈ పోస్టర్, ఈ చిత్రాన్ని కూడా ఒక ప్రత్యేక విందులా ఎంతో శ్రద్ధతో రూపొందిస్తున్నామనే ఫీలింగ్ కలిగిస్తోంది. "Ek Dum Bindass Pakaane Waale" అనే ట్యాగ్‌లైన్ మరింత ఆసక్తికరంగా మార్చింది.

## రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ క్లాప్ తో ప్రారంభమైన ప్రొడక్షన్ నెం.3




**వుదయం:** కొత్త సినిమా హైదరాబాద్ ఆరె మైసమ్మ టెంపుల్ లో పూజా కార్యక్రమాలతో ఘనంగా ప్రారంభమైంది. ఈ సినిమాను నిసా ఎంటర్ టైన్ మెంట్స్, సెవెన్ క్రియేషన్స్ బ్యానర్స్ తమ ప్రొడక్షన్ నెం.3 చిత్రంగా నిర్మిస్తున్నాయి. క్రైమ్ కామెడీ ఎంటర్ టైనర్ గా దర్శకుడు జి.మధుసూధన్ రెడ్డి రూపొందిస్తున్నారు. ఈ రోజు జరిగిన ఈ చిత్ర పూజా కార్యక్రమాలకు రాజేంద్ర నగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ముహూర్తపు సన్నివేశానికి క్లాప్ ఇచ్చారు. ప్రముఖ పబ్లిసిటీ డిజైనర్స్ అనిల్ - భాను, "రోమాంచికం" చిత్ర దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి కెమెరా స్విచ్చాన్ చేశారు. అనంతరం జరిగిన ప్రెస్ మీట్ లో దర్శకుడు జి.మధుసూధన్ రెడ్డి మాట్లాడుతూ – ఈ రోజు మా చిత్ర పూజా కార్యక్రమాలకు అతిథిగా వచ్చి క్లాప్ ఇచ్చిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ గారికి, కెమెరా స్విచ్చాన్ చేసిన పబ్లిసిటీ డిజైనర్స్ అనిల్ భాను, దర్శకుడు వేణు గోపాల్ రెడ్డికి థ్యాంక్స్. మా సినిమాను క్రైమ్ కామెడీ జానర్ లో మంచి ఎంటర్ టైన్ మెంట్ తో రూపొందిస్తున్నాం. మూవీని ప్రొడక్షన్ వ్యాల్యూస్ లో ఎక్కడా రాజీ పడకుండా నిర్మాతలు ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. త్వరలోనే మా సినిమాకు సంబంధించిన మరిన్ని అప్డేట్స్ వెల్లడిస్తాం. అన్నారు. నటీనటులు – సాయి సోహన్, విస్మయ శ్రీ , విష్ణు ఓయ్, నరేంద్ర రవి, హరితేజ, జీవన్ కుమార్, మురళీధర్ గౌడ్.

## శ్రీ సత్య సాయి ఆర్ట్స్ ప్రతిష్టాత్మక పాన్-ఇండియా ప్రాజెక్ట్ 'భోగి'

**వుదయం:** 'చార్మింగ్ స్టార్' శర్వా భారీ పాన్-ఇండియా పీరియడ్ యాక్షన్ చిత్రం 'భోగి' పై భారీ అంచనాలు నెలకొన్నాయి. దర్శకుడు సంపత్ నందితో శర్వా చేస్తున్న మొదటి సినిమా ఇదే కావడం విశేషం. ఈ కాంబినేషన్ ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ ఆసక్తిని రేకెత్తించింది. శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ నిర్మిస్తున్న చిత్రాన్ని లక్ష్మి రాధామోహన్ సమర్పిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన ఫస్ట్-లుక్, పుట్టినరోజు పోస్టర్లుకు అదిరిపోయే రెస్పాన్స్ వచ్చింది. ముఖ్యంగా చిత్రంలోని రగ్గడ్, గ్రాండ్ స్కేల్ విజన్‌కు ప్రశంసలు లభించాయి. పల్లెటూరి



యువతిగా కథానాయిక అనుపమ పరమేశ్వరన్ కనిపించిన ఫస్ట్-లుక్‌కు కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. ప్రస్తుతం, ఆర్ట్ డైరెక్టర్ కిరణ్ కుమార్ మన్నె ప్రత్యేకంగా నిర్మించిన భారీ సెట్‌లో హై ఆక్టేవ్ ఎమోషనల్ యాక్షన్ క్లైమాక్స్ చిత్రీకరణ జరుగుతోంది. ప్రేక్షకులకు ఒక గొప్ప థియేట్రికల్ అనుభూతిని అందించేలా, స్టంట్ మాస్టర్ దిలీప్ సుబ్బరాయన్ ఈ సన్నివేశాన్ని మునుపెన్నడూ చూడని స్టయిల్ లో రూపొందిస్తున్నారు. ఈ కీలకమైన క్లైమాక్స్ లో శర్వా మోస్ట్ ఇంటెన్స్, రిస్కీ స్టంట్లతో తన నటనలో సరికొత్త కోణాన్ని ప్రజెంట్ చేయబోతున్నారు. సినిమాలోని ఈ కీలక భాగాన్ని పూర్తి చేసే లక్ష్యంతో ఈ షెడ్యూల్ 20 రోజుల పాటు కొనసాగనుంది. ఈ చిత్రంలో డింపుల్ హయతి మరో కథానాయికగా నటిస్తోంది. 1960ల నాటి నేపథ్యంలో సాగే 'భోగి' చిత్రం, తెలంగాణ-మహారాష్ట్ర సరిహద్దులోని ఒక ఫిక్షనల్ విలేజ్ లో జరిగే పీరియడ్ యాక్షన్ డ్రామాగా రూపొందుతోంది. ట్యాలెంటెడ్ టెక్నికల్ టీం ఈ సినిమాకి పని చేస్తున్నారు. ఆర్ట్ డైరెక్షన్‌ను కిరణ్ కుమార్ మన్నె పర్యవేక్షిస్తుండగా, సినిమాటోగ్రాఫర్ కిషోర్ కుమార్ అరోకియా అద్భుతమైన విజువల్స్ అందిస్తున్నారు.

## "ఈశ్వర్" సినిమా రీరిలీజ్ సందర్భంగా ట్రిబ్యూట్ గా "సా V3" మూవీ టీమ్ స్పెషల్ ప్రెస్ మీట్

**వుదయం:** సామ్రాట్, డీమోన్ పవన్, లిఖిత (రాను బొంబాయికి రాను సాంగ్ ఫేమ్) హీరో హీరోయిన్లుగా నటిస్తున్న సినిమా "సా V3". ఈ చిత్రాన్ని లక్ష్మి కృష్ణ ఫిలింస్ బ్యానర్ పై ప్రొడక్షన్ నెం.2గా నిర్మాత వి. విజయ నిర్మిస్తున్నారు. నటుడు, దర్శకుడు కృష్ణ మాయ ఈ సినిమాను రూపొందిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ సినిమా త్వరలోనే గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. రెబల్ స్టార్ ప్రభాస్ "ఈశ్వర్" సినిమాలో కృష్ణమాయ ఫ్రెండ్ క్యారెక్టర్ లో నటించి పేరు తెచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో ఈశ్వర్ సినిమా రీరిలీజ్ సందర్భంగా ట్రిబ్యూట్ గా ఈ రోజు "సా V3" మూవీ టీమ్ స్పెషల్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ



సందర్భంగా యాక్టర్ అదిరే అభి మాట్లాడుతూ – నెక్ట్స్ ఇయర్ కు ఈశ్వర్ సినిమా పాతికేళ్లకు చేరుకుంటుంది. అప్పుడు ఓ గెట్ గెదర్ పెట్టుకోవాలని, అందుకు కృష్ణమాయ గారు ఇనిషేటివ్ తీసుకోవాలి కోరుతున్నా. ఈశ్వర్ చిత్రంలో మేము ప్రభాస్ గారి ఫ్రెండ్స్ గా నటించాం. ఆ మూవీతో మాకు మంచి గుర్తింపు దక్కింది. ప్రభాస్ గారు ఈ రోజు బిగ్ స్టార్ అయ్యారు. ఈశ్వర్ సినిమా టైమ్ నుంచే కృష్ణమాయ మంచి స్నేహితులు అయ్యారు. ఆయన దర్శకత్వం వహిస్తున్న "సా V3" సినిమా పెద్ద హిట్ కావాలని కోరుకుంటున్నా. అన్నారు. హీరో సామ్రాట్ మాట్లాడుతూ – ప్రభాస్ గారు మా అందరికీ ఫేవరేట్ హీరో. ఆయన ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ కు మేమంతా టీమ్ గా వెళ్లి థియేటర్స్ లో సినిమా చూస్తాం. ఈశ్వర్ సినిమా రీ రిలీజ్ సందర్భంగా మా మూవీ ప్రెస్ మీట్ నిర్వహించుకోవడం హ్యాపీగా ఉంది. "సా V3" సినిమా కంటెంట్ చూసిన ప్రతి ఒక్కరూ మూవీ చాలా బాగుందంటూ చెబుతున్నారు.

## 'మండాడి'.. సెప్టెంబర్ 4న గ్రాండ్ రిలీజ్

**వుదయం:** సుహాస్, సూరి ప్రధాన పాత్రలో నటిస్తున్న చిత్రం 'మండాడి'. ఇప్పటికే ఫస్ట్ లుక్ పోస్టర్లు, టైటిల్ పోస్టర్లతో బజ్ క్రియేట్ చేశారు. ఈ సినిమాపై అటు కోలీవుడ్‌లోనూ, ఇటు టాలీవుడ్‌లోనూ అంచనాలు అమాంతం పెరిగాయి. తీరప్రాంతం, మత్స్యకారుల నేపథ్యంలో సాగే ఈ మూవీలో సూరి, సుహాస్ ఇద్దరూ కూడా రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తారు. ఇక ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాని ఎల్రెడ్ కుమార్ సమర్పణలో ఆర్ఎస్ ఇన్ఫోటైన్‌మెంట్ నిర్మిస్తోంది. మదిమారన్ పుగళేంది తెరకెక్కిస్తున్న ఈ మూవీకి సంబంధించిన షూటింగ్ ఆల్రెడీ పూర్తయింది. రియల్ లొకేషన్స్‌లో ఎంతో శ్రమించి ఉత్కంఠభరితమైన యాక్షన్ సన్నివేశాలు, ఎమోషనల్ సీన్స్, ఒళ్లుగగుర్పొడిచే సెయిల్‌బోట్ రేస్ సీక్వెన్స్‌ను షూట్ చేశారు. దాదాపు 80 కోట్ల బడ్జెట్‌తో నిర్మించిన ఈ సినిమాని సెప్టెంబర్ 4న రిలీజ్ చేయబోతోన్నారు. ఈ మేరకు రిలీజ్ డేట్ పోస్టర్‌ను తాజాగా రివీల్ చేశారు. ఈ రిలీజ్ డేట్ పోస్టర్‌లో సుహాస్, సూరి ఎదురెదురుగా నిల్చుని కనిపిస్తున్నారు. ఈ మూవీలో ఈ ఇద్దరి మధ్య వచ్చే సీన్స్ ప్రతీ ఒక్కరినీ ఆకట్టుకునేలా ఉండబోతోన్నాయని సమాచారం.



## #VenkyAnil5 #NkrAR2 కు స్పెషల్ అనౌన్స్‌మెంట్ వీడియో

**వుదయం:** వెంకటేష్, నందమూరి కళ్యాణ్ రామ్, బ్లాక్‌బస్టర్ హిట్ మెషీన్ అనిల్ రావిపూడి భారీ ఫెస్టివల్ ఎంటర్‌టైనర్ #VenkyAnil5/ #NKRAR2 తో అలరించబోతున్నారు. విజయవంతమైన నిర్మాణ సంస్థ షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. సురేష్ ప్రొడక్షన్స్, శ్రీమతి అర్చన సమర్పణలో, జీ స్టూడియోస్ సహనిర్మాణంలో తెరకెక్కుతున్న ఈ చిత్రం 2027 సంక్రాంతికి గ్రాండ్ రిలీజ్‌కు సిద్ధమవుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థలు కలిసి రూపొందిస్తున్న ఈ భారీ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. దక్షిణ భారత సినీ పరిశ్రమలో అగ్ర సంగీత దర్శకుల్లో ఒకరైన జీవీ ప్రకాష్ కుమార్ ఈ చిత్రానికి సంగీతం అందించనున్నారు. సంగీత దర్శకుడిగా, నటుడిగా బహుముఖ ప్రజ్ఞతో రాణిస్తున్న జీవీ ప్రకాష్ ప్రస్తుతం ఇండస్ట్రీలో అత్యంత బిజీ టాలెంట్స్‌లో ఒకరు. ఆయన ఈ ప్రాజెక్ట్‌లో భాగమైన విషయాన్ని ప్రత్యేకంగా, వినోదాత్మకంగా ప్రకటిస్తూ మేకర్స్ అనిల్ రావిపూడి స్టైల్‌లో ఓ ఫన్‌ఫుల్ వీడియోను విడుదల చేశారు. ఈ ప్రమోలో దిగ్గజ దర్శకుడు జంధ్యాల క్లాసిక్ చిత్రం 'ఆహా నా పెళ్లంట'లోని ఐకానిక్ సన్నివేశానికి నివాళిగా, పాత్రలను మెడ వరకు ఇసుకలో పాతిపెట్టిన సన్నివేశాన్ని రీక్రియేట్ చేశారు. సరదా ట్విస్ట్‌గా జీవీ ప్రకాష్ కుమార్ కూడా అదే పరిస్థితిలో కనిపిస్తారు. అప్పుడు అనిల్ రావిపూడి వచ్చి, సినిమా పండుగ వాతావరణానికి తగ్గట్టుగా చార్ట్‌బస్టర్ ట్యూన్స్ కావాలని అడగడం నవ్వులు పూయిస్తుంది. ఈ వీడియో ద్వారా ప్రముఖ గేయరచయిత అనంత శ్రీరామ్ కూడా ఈ చిత్ర బృందంలో భాగమని అధికారికంగా ప్రకటించారు. ఈ క్రియేటివ్ అనౌన్స్‌మెంట్‌తో మరోసారి అనిల్ రావిపూడి తన సినిమాల్లోనే కాదు, ప్రమోషన్స్‌లో కూడా ఫన్ టచ్ ఎంత బలంగా ఉంటుందో చూపించారు.



Printed, Published & Owned by Sirikonda Maria, Ashish Publications H.No. 1-7-25/5, Risalagadda, RTC X Roads, Hyderabad - 500020 and Published from H. No. 1-3-95,Padmashali Street, Karimnagar-505001 Telangana. Editor : Sirikonda Augustin, RNI No. TELTEL/2013/65079, E-mail : voodayam2007@gmail.com Cell : 9247698676.